ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 162 పేజీలు: 10+4 వెల: 8.00


బహమాస్‌లో కూలిన విమానం: 10 మంది మృతి 5

ముందుగా వందేమాతరం.. తర్వాత జనగణమన

వియత్నాం విషాదం:

# సముద్రంలో పడవ బోల్తా



15 మంది భారతీయులు మృతి

వారిలో ఎపికి చెందిన ముగ్గురు

పడవలో మొత్తం 36 మంది

తమ పంపినీదార్లను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లిన ఓ మొబైల్ కంపెనీ

**హానోయ్ / న్యూఢిల్లీ:** వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో శనివారం జరిగిన ఘోర పడవ ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు మృతి చెందారు. మృతుల్లో 13 మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు ఉన్నారు. కడపజిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీలు మరణించినట్లు ధృవీకరించారు. మరో కడప పంపిణీదారు తీరంలోనే ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నాడు. మరో ముగ్గురు ఆంధ్రప్రదేశ్ వాసులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. >>2



నన్ను చంపితే ఇరాన్

## పూర్తిగా ధ్వంసమే 5

వెయ్యి క్షిపణులను లోడ్‌చేసి పెట్టాం: తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

## న్యూజిలాండ్‌తో భారత్ 'వాకా' ప్రయాణం

ఆక్లాండ్‌లో భారత్ సంతతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోడీ



ఆక్లాండ్‌లో ప్రవాసభారతీయుల సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, న్యూజిలాండ్ ప్రధాని లక్సన్

**ఆక్లాండ్,జులై 11:** భారత్ న్యూజిలార్ దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం >>2

భారత్‌లో భారీగా న్యూజిలాండ్ పెట్టుబడులు 5

'నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా'



## ప్రఖ్యాత గాయని జానకి ఇకలేరు

మైసూరులో చికిత్స పొందుతూ కన్నుమూత

48 వేలు పైగా పాటలు పాడిన గొప్ప గాయని

4 జాతీయ, 10 నంది అవార్డులు ఆమె సొంతం

కేరళం ప్రభుత్వం నుంచి 11 అవార్డులు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** సుప్రసిద్ధ నేపథ్య గాయని ఎస్. జానకి కన్నుమూశారు. మైసూరులోని తన సొంత ఇంట్లో వుండగా శనివారం సాయంత్రం గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు వెంటనే అపోలో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె వయస్సు 88 ఏళ్లు. జానకి పూర్తి పేరు శిష్టా శ్రీరామమూర్తి జానకి. ఎపిలోని గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్ల పట్లలో ఆమె 1938 ఏప్రిల్ 23న శ్రీరామ మూర్తి, సత్యవతి దంపదులకు జన్మించారు. జానకి తండ్రి ఉపాధ్యాయుడుగా ఆయుర్వేద వైద్యుడి గా సేవలందించారు. ఆ సమయంలో >>2

# గేట్లుమూస్తే గల్లంతే

ఎన్‌డిసిఎ సూచనల ప్రకారమే కాళేశ్వరం పునరుద్ధరణ చేపడతాం

3 బ్యారేజిల్లో నీరు నింపడం ప్రమాదం

హరీష్ సూచనల వల్లే ఈటల ఆ మాటలు

కాళేశ్వరంపై సిబిఐ విచారణ ఎందుకు సాగడం లేదు?

కిలాడీ కమిటీ సూచనలు పాటించబోం: మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్



శనివారం హైదరాబాద్‌లో మీడియాతో సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్ తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై11:** కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. శనివారం సాయంత్రం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 3 బ్యారేజీల్లో నీరు నింపకూడదని ఎన్డీఎస్ఏ తెలిపిందని, ఆ నివేదిక మేరకే కమిటీ వేసి బ్యారేజీల >>2

అధిష్ఠానం ఆదేశిస్తే హరీష్‌పై పోటీచేస్తా -జగ్గారెడ్డి 6








నిందితుడు రాజ్ కుమార్ (ఫైల్)

# షాబాద్‌లో మారణకాండ

ఆరుగురిని హత్య చేసిన పోక్సో నిందితుడు

రెండు కుటుంబాలు అంతం

స్థానికుల ఆందోళనతో ఉద్రిక్తత

నిందితుడిపై రూ.2 లక్షల రివార్డు.. ఎస్ఐ సస్పెన్షన్



నిందితుడి చేతిలో హత్యకు గురైన భార్య, పిల్లలు

**చేవెళ్ల / షాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పట్టణం వరుస హత్యలతో ఉలిక్కిపడింది. మైనర్ బాలికను వేధించినందుకు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినందుకు కక్ష పెంచుకున్న నిందితుడు రాజ్‌కుమార్ (28) శనివారం తెల్లవారుజామున మారణకాండను సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని అతి దారుణంగా హత్య చేశాడు. ఉన్మాదిగా మారిన అతను తనపై కేసు పెట్టిన కుటుంబంతో పాటు తన స్వంత కుటుంబ సభ్యులను సైతం విచక్షణారహితంగా అంతమొందించాడు. తనపై కేసు పెట్టిన మైనర్ బాలికను బలవంతంగా ఇంటి నుంచి తీసుకువెళ్లి ఊరిబయట చెరువు గట్టు సమీపంలో తల నరికి హతమార్చాడు. తనపై ఫోక్సో కేసు పెట్టిన మైనర్ బాలికతో పాటు తల్లి, నాయనమ్మను, తన భార్య, ఇద్దరు కుమారులను అతికిరాతకంగా కత్తితో విచక్షణ రహితంగా హత్య చేసి పరారయ్యాడు. షాబాద్ >>2



## 7 బుల్లెట్ రైళ్లలో 3 రూట్లు తెలంగాణకే

-కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై11:** దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశ పెట్టనున్న ఏడు బుల్లెట్ >>2

# రైతులను నిలువునా ముంచుతున్నారు..



కాంగ్రెస్‌కు 117 కాదు.. 7 కూడా రావు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై11:** తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ..రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్లలభ్యత వద్దే పంపులుఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం >>2



ఆక్లాండ్‌లో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## న్యూజిలాండ్‌తో భారత్ 'వాకా' ప్రయాణం

>> పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యాయని ప్రధానిమోడీ పేర్కొన్నారు. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన వాకా ను గురించి ప్రస్తావిస్తూ అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం అని పేర్కొన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. నేడు ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత్‌న్యూజిలాండ్ వాకా (బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభించేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోడీ అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఆ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోడీ రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

## ప్రఖ్యాత గాయని జానకి ఇకలేరు

>> జానకి తండ్రి ఉద్యోగరీత్యా కొంత కాలం కరీంనగర్‌లోని సిరిసిల్లాలో పనిచేశారు. చిన్నతనం నుంచే సం గీతంపై మక్కువ పెంచుకున్న జానకి మూడేళ్ల వయస్సులోనే వేదికలపై పాటలు పాడేవారు. నాదస్వర విద్వాంసుడు పైడిస్వామి వద్ద జానకి స ంగీత సాధన చేసి గాయనిగా పేరు సంపాదించారు. అప్పట్లో లతా మంగేష్కర్, జిక్కి, లీల వంటి గాయకులు ఆలపించిన పాటను జానకి వివి ధ కార్యక్రమాల్లో ఆలపించి అందరి మన్ననలు అందుకున్నారు. 19 ఏళ్ల వయస్సులో తన మామయ్య సూచన మేరకు చెన్నై చేరుకున్న జానకి ఏవీఎం స్టూడియోలో తొలిసారిగా గాత్రాన్ని వినిపించారు. దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంలో 50 వేల పాటలు పాడి న జానకి సౌత్ ఇండియా నైటింగేల్‌గా ప్రసిద్ధి పొందారు. గత జనవరి నెలలో ఆమె కుమారుడు మురళీకృష్ణ (65) మరణించడంతో మనో వే దనతో బా ధపడుతున్న జానకి చివరకు ఇదే కారణంగా గుండెపోటుకు గురై కన్ను మూశారు. దక్షిణాది దిగ్గజ గాయకులు ఎస్‌పి బాలసుబ్రమ ణ్యం, పి. సుశీలతో కలిసి జానకి వేలాది పాటలు పాడిన ఘనాపాటిగా పేరొందారు. 1957లో చెన్నైలోని ఏవీఎం స్టూడియోలో స్టాఫ్ సింగర్ గా తన గాన ప్రయాణాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె పాడిన తొలిపాట తమిళంలో విదియిన్ విలయాట్టు సినిమాలోని విషాద గీతం. తెలు గులో తొలి పా ట పెండ్యాల నాగేశ్వర రావు సంగీత దర్శకత్వంలో వచ్చిన ఎంఎల్ఏ సినిమాలోని నీ ఆశ అడియాస అనే పాట. ఈ పాటను ఘంటసాలతో క లిసి పాడారు. 1970 నుంచి 1990 వరకు దక్షిణాది రాష్ట్రాలలో మహి ళా గాత్రానికి ప్రధాన స్తంభంగా ఆమె నిలిచారు. నా దస్వరం, వేణువు, షెహనాయ్ వంటి సంగీత వాయిద్యాలతో పోటీపడి పాడగల అరుదైన గాత్ర ప్రతిభ జానకి సొంతం. కాగా జానకికి నాలు గుసార్లు జాతీయ పు రస్కారాలు అందాయి. దీంతో పాటు వివిధ రాష్ట్రాలు ప్రత్యేకంగా అవార్డులు ఇచ్చి సన్మానించాయి. 2017లో వయో భా రంతో ఆమె పాటలు పాడడం మానేశారు. 2013 కేంద్రం ప్రకటించిన పద్మభూషన్ అవార్డును ఆమె తిరస్కరించడం సంచలనం రేపింది. తె లుగు భాషలో వేలాది పాటలు పాడిన ఆమెకు ప్రత్యేకంగా అభిమానులున్నారు. ఆదివారం ఆమె అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ స భ్యులు తెలిపారు.

**ప్రముఖుల సంతాపం**

ప్రముఖ గాయని ఎస్. జానకి మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం తెలిపారు. జానకి మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు, సంగీత ప్రపంచానికి తీరని లోటని, ఆమె ఆలపించిన అమర గీతాలు తరతరాలకు సంగీతా భిమానులను అలరిస్తూనే ఉంటాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జానకి మృతి పట్ల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. ఆరు దశాబ్దాలకు పైగా సినీ సంగీత ప్రపంచానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని, 48 వేలకు పైగా పాటలు ఆలపించి, గ్రామీణ జానపదాల నుండి శాస్త్రీయ, భక్తి గీతాల వరకు తన మధురమైన గాత్రంతో కోట్లాది మంది అభిమానుల మనసు గెలుచుకున్నారని ఆయన కొనియాడారు.

## రైతులను నిలువునా ముంచు తున్నారు..

>> మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు. మేడిగడ్డతో ఎలాంటి సంబంధం లేకుండానే, మేడిగడ్డ బ్యారేజ్ వద్ద ఒక్క గేటు కూడా మూయకుండానే, కన్నెపల్లి నదీ ప్రవాహం దగ్గర 93 మీటర్ల ప్రవాహం నమోదైన ప్రతిసారి భారీగా నీళ్లను ఎత్తిపోసుకోవచ్చు. ప్రతిరోజు ఒక హుస్సేన్ సాగర్ లో ఉన్న స్థాయిలో ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసుకోవడానికి అవకాశం ఉన్నది. కానీ ఈరోజు దాదాపు 97 మీటర్ల నదీ ప్రవాహం కన్నెపల్లి దగ్గర పారుతున్నది. దీన్ని కేవలం ఒక్క బటన్ ద్వారా పంపులు ప్రారంభించి నీటిని ఎత్తిపోస్తే తెలంగాణ కరువు నుంచి దూరం అవుతుందన్నారు. వర్షాలు పడకున్నా గోదావరిలో నది నీళ్ల కిందికి పారుతున్నా పట్టించుకోకుండా కావాలనే రైతాంగంపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ వైఖరిని ఇంకో రెండు, మూడు వారాలు చూసి పార్టీగా ఒక భారీ కార్యాచరణ ప్రకటిస్తాం అని కేటీఆర్ తెలిపారు. హరీష్ రావు గురించి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. హరీష్ రావు కేసీఆర్ తయారు చేసిన క్రమశిక్షణ కలిగిన సైనికుడని, పార్టీ ప్రారంభం నుంచి ఆయనకి అండగా నిలబడ్డ నాయకుడు అన్నారు. ఆయన పైన ఇలాంటి చిల్లర పుకార్లు ఎన్నో సార్లు వచ్చాయని వాటికి ఆయన స్పష్టంగా పలుమార్లు సమాధానం ఇచ్చారు అన్నారు. అయినా రేవంత్ రెడ్డి లాంటి పార్టీలు మారే వ్యక్తి ఇతరుల గురించి మాట్లాడడం... సిగ్గుచేటు అన్నారు. పొద్దున లేస్తే కాంగ్రెస్ తో, అర్ధరాత్రి అయిన తర్వాత బీజేపీతో కలిసి ఉండే రేవంత్ రెడ్డి ఇతరుల గురించి మాట్లాడడం ఆపాలన్నారు.

### వారం - వర్జ్యం

12-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
త్రయోదశి రా. 10.29
రోహిణి ఉ. 8.28, మృగశిర తె. 5.41
వర్జ్యం : మ. 1.25-మ. 2.50
శుభసమయం : ఉ. 8.00-9.00
దు.సా. 4.55-సా. 5.47
రాహుకాలం - సా. 4.30-6.00

### వార్తాఫలం

**మేషం:** అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారితీస్తాయి. వస్త్రలాభం కలదు.

**వృషభం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మిథునం:** విమర్శలను లెక్కచేయక మీ ఆలోచనలకు రూపకల్పన చేస్తారు. జీవిత భాగస్వామితో సంయమనం పాటించడం మంచిది.

**కర్కాటకం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ఋణాలు తీరుస్తారు.

**సింహం:** పాతబాకీలు వసూలవుతాయి. ఓర్పుతో ముందుకు సాగుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య:** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. వృత్తిలో పురోభివృద్ధి సాధిస్తారు.

**తుల :** పనులలో ఆటంకాలు ఎదురైనా అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. స్వల్పధన లాభం పొందుతారు.

**వృశ్చికం:** ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. పై అధికారులతో మెలకువగా వ్యవహరించండి.

**ధనుస్సు:** ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ముఖ్యమైన విషయాలు వాయిదా వేయడం మంచిది.

**మకరం:** సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్ఠి సాగిస్తారు. ఏకాంత చర్చలకు అనుకూలమైన సమయం కలదు.

**కుంభం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలుగుతుంది. కోర్టుకేసుల నుండి బయటపడతారు.

**మీనం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. స్త్రీ మూలంగా ధనలాభం పొందుతారు. స్థలాలు కొనుగోలుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సముద్రంలో పడవ బోల్తా

>> పర్యాటకులతో ప్రయాణిస్తున్న పడవ బలమైన గాలులు, అలల కారణంగా బోల్తా పడింది. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 36 మంది ఉన్నారు. ప్రమాదం అనంతరం 21 మందిని సహాయక బృందాలు రక్షించి ఆస్పత్రులకు తరలించాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వియత్నాం ప్రభుత్వ మీడియా వెల్లడించింది. మిగిలిన వారి కోసం స్థానిక అధికారులు గాలింపు, సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం పడవలో 32 మంది భారతీయ పర్యాటకులు, ముగ్గురు సిబ్బంది, సహాయకుడు ప్రయాణిస్తున్నారు. హోన్ మే రుట్ న్గోయి ద్వీపం నుంచి ఆన్ థోయ్ నౌకాశ్రయానికి బయలుదేరిన కొద్దిసేపటికే బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా పడవ బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు, సిబ్బంది అంతా నీటిలో పడిపోయారు. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, స్థానిక అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారని తెలిపింది. బాధితులకు అవసరమైన కాన్సులర్ సేవలు అందించేందుకు భారత రాయబారి, రాయబార కార్యాలయ అధికారులు ఫు క్వోక్ ద్వీపానికి బయలుదేరినట్లు వెల్లడించింది.

ఈ ప్రమాదంలో తమ సంస్థ ఉద్యోగులు, ఛానల్ భాగస్వాముల్లో కొందరు ఉన్నట్లు లావా మొబైల్స్ సంస్థ తెలిపింది. భారత రాయబార కార్యాలయం, వియత్నాం స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, బాధితులు, వారి కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందిస్తున్నామని సంస్థ పేర్కొంది. దక్షిణ భారతానికి చెందిన లావా డిస్ట్రిబ్యూటర్లు, ఉద్యోగులు మొత్తం 110 మంది విహారయాత్ర కోసం వియత్నాం వెళ్లినట్లు సమాచారం. ఈ విషాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్ అధికారులు బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయం అందిస్తున్నారని, వియత్నాం అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగుతోందని తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రిత్వ శాఖ వియత్నాం అధికారులతో సన్నిహితంగా పనిచేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఇంకా గల్లంతైన వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ప్రమాదంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు ఉన్నారనే సమాచారం నేపథ్యంలో ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుంచి వివరాలు కోరారు. విహారయాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన కొందరు ఈ ప్రమాదంలో చిక్కుకుని ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపినట్లు సమాచారం. బాధితులు, వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటన నేపథ్యంలో భారత ప్రభుత్వం రెండు చోట్ల ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. హో చి మిన్ సిటీలోని భారత కాన్సులేట్ జనరల్, హనోయ్‌లోని భారత రాయబార కార్యాలయాల్లో ఈ సహాయక కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రమాదానికి సంబంధించిన సమాచారం లేదా సహాయం కోసం బాధితుల కుటుంబాలు ఈ కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని భారత రాయబార కార్యాలయం సూచించింది. థాయ్‌లాండ్ గల్ఫ్‌లో ఉన్న ఫు క్వోక్ ద్వీపం వియత్నాంలో అత్యంత ప్రసిద్ధ బీచ్ పర్యాటక ప్రాంతాల్లో ఒకటి. తెల్లని ఇసుక తీరాలు, స్వచ్ఛమైన సముద్ర జలాలకు ప్రసిద్ధి చెందిన హోన్ మే రుట్ ద్వీపానికి పర్యాటకులు సాధారణంగా స్పీడ్‌బోట్‌లలో ప్రయాణిస్తుంటారు. గత ఏడాది ఒక్కటే ఈ ద్వీపాన్ని 18 లక్షలకు పైగా విదేశీ పర్యాటకులు సందర్శించారు. వియత్నాంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వరదలు, పడవల నిర్వహణలో లోపాల కారణంగా ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. గత ఏడాది జూలైలో హా లాంగ్ బేలో తుఫాను కారణంగా పర్యాటక పడవ బోల్తాపడి 39 మంది మృతి చెందిన ఘటన కూడా చోటుచేసుకుంది.

ఒక మొబైల్‌కంపెనీ భారత్‌నుంచి తమ పంపిణీదార్ల కుటుంబాలను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లింది. మొత్తం 250 మంది ఈ యాత్రకువెళ్లారు. ఎపినుంచి 35, తెలంగాణనుంచి 40 మందివరకూ ఉన్నారు. ట్రిప్‌లోభాగంగా మూడుపడవల్లో సముద్రంలో విహార యాత్రకువెళ్లారు.

మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో హాన్‌మేరుట్‌నుంచి అన్‌థోయ్‌పోర్టుకు ఒక స్పీడ్‌బోట్ బయలుదేరింది. అందులో 32 మంది భారతీయులు నలుగురు సిబ్బంది ఉన్నారు. పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా ఒక్కసారిగా బోల్తాపడింది. దీనితోప్రయాణీకులు నీటిలోమునిగిపోయారు. సమీపంలోని ఇతర పార్యటక బోట్లనిర్వాహకులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలుచేపట్టారు. బోటుపూర్తిగా తల్లకిందులు కావడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. గల్లంతయిన వారికోసం గాలింపు జరుగుతోంది. బోటులో ప్రయాణించిన 32 మంది ప్రయాణీకుల జాబితాను భారత రాయబార కార్యాలయం విడుదలచేసింది.

# గేట్లుమూస్తే గల్లంతే

>> పునరుద్ధరణకు యత్నిస్తామని తెలిపారు. బ్యారేజీలు పునరుద్ధరించే వరకు గేట్లు ఎత్తి ఉంచాలని ఎన్డీఎస్ఏ ఆదేశించిందని, ఒకవేళ గేట్లు ఎత్తకుండా మూసివేస్తే బ్యారేజీలు పూర్తిగా దెబ్బతింటాయని, గేట్లు దించకుండా అక్కడ నీళ్లు లిఫ్ట్ చేయడం కుదరదని తెలిపారు. కాళేశ్వరానికి శ్రీపాద ఎల్లంపల్లి గుండెకాయ అయితే మేడిగడ్డ వెన్నెముక రేవంత్‌రెడ్డి తెలిపారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం భారమవుతుందని గతంలోనే ఇంజినీర్లు చెప్పారని, నాడు భారమవుతుందని చెప్పిన ఇంజినీర్లే ఇప్పుడు సన్నాయినొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. ఆ ఇంజినీర్లను జైలుకు పంపనందువల్లే ఇవాళ ఇలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. పభుత్వం ముందు రెండు కమిటీలు ఉన్నాయని, ఒకటి కేంద్ర ప్రభుత్వం వేసిందయితే, మరొకటి కిలాడీ కమిటీ. అందులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల సభ్యులని అన్నారు. బ్యారేజీల పునరుద్ధరణ అంశంలో ఎన్డీఎస్ఏ కమిటీ సూచనలు పాటించాలని నిర్ణయించాలని, కిలాడీల కమిటీ సూచనలు పాటించబోమని స్పష్టం చేశారు. మామ గుడిని మింగితే అల్లుడు గుడిలో లింగాన్ని మింగే రకమని, హరీశ్‌రావు లంచాలు బొక్కారని విమర్శించారు. 2021 సంవత్సరానికి ముందు ఎన్డీఎస్ఏ క్షేత్ర స్థాయిలో పని చేసేందుకు చట్టం లేదని తెలిపారు. ఆ తరువాత మేడిగడ్డను సందర్శించి అందులో నీటి నిల్వ సాధ్యం కాదని చెప్పిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల్లో నీరు నింపకూడదని తెలిపిందని అన్నారు. ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ అనుమతి మేరకే బ్యారేజీల పునరుద్ధరణకు యత్నిస్తామని తెలిపారు. నీళ్లు పారుతున్నంత మాత్రాన వాటిని వినియోగించుకోలేమని అన్నారు. మేడిగడ్డలో 5 టీఎంసీలు ఉంటేనే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నీటిని ఎత్తిపోయగలమని తెలిపారు. బ్యారేజీలు పునరుద్ధరించే వరకు గేట్లు ఎత్తి ఉంచాలని ఎన్డీఎస్ఏ ఆదేశించిందని, ఒక వేళ గేట్లు ఎత్తకుండా మూసేస్తే బ్యారేజీలు పూర్తిగా దెబ్బతింటాయని, బ్యారేజీ గేట్లు దించకుండా అక్కడ నీళ్లు లిఫ్ట్ చేయడం కుదరదని వెల్లడించారు. కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిరక్ష ్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. సీబీఐ వద్ద మూలుగుతున్న కాళేశ్వరం కేసుపై విచారణ ముందుకు తీసుకెళ్లేలా చేయండి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలపై విచారణను మేం సీబీఐకి అప్పగించాం. 2025 సెప్టెంబర్ 1వ తేదీన ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ మా ప్రభుత్వం జీవో నెం.104 జారీ చేసింది. ఇప్పటికీ విచారణ ఎందుకు వేగంగా సాగడం లేదో సమాధానం చెప్పాలి అని ప్రశ్నించారు.

## 3 రూట్లు తెలంగాణకే

>> రైళ్లలో మూడు రూట్లు తెలంగాణకే దక్కాయి. ఇలా దక్కడం విశేషమని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేక శ్రద్ధ వల్లనే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశం లోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రయిన్ హబ్ గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ హెచ్ఐసిసిలో వికసిత్ భారత్-2047-సాంకేతిక పాత్ర అనే అంశంపై నిర్వహించిన సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని, హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని పేర్కొన్నారు.

ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటు లోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర వాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగం లోనే ఒక మైలు రాయిగా నిలిచిపోతుందన్నారు. ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మండి పడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోడీకే దక్కుతుందన్నారు. గత యుపిఎ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ.800 కోట్లు మాత్రమే ఇస్తే.. తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ.5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. ఈ నిధుల వరద వల్లనే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని స్పష్టం చేశారు.

# షాబాద్‌లో మారణకాండ

>> మండలం దైవాలగూడకు చెందిన రాజ్‌కుమార్ అనె వ్యక్తి కొద్ది రోజుల క్రితం షాబాద్‌లో ఉండే ఓ మైనర్ బాలికను వేధించాడు. దీనిపై సదరు బాధిత బాలిక తల్లి మే 16న షాబాద్ పోలిస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. రాజ్‌కుమార్‌పై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసినప్పటి నుండి నిందితుడు రాజ్‌కుమార్ యాంటిసిపేటరి బెయిల్‌ను గత పది రోజుల క్రితం తీసుకున్నారు. బెయిల్ పొందినప్పటికీ తనను మళ్లీ జైలుకు పంపిస్తారన్న భయంతో ఉన్మాదిగా మారాడు. సదురు కుటుంబంపై కక్ష పెంచుకుని హత్యాకాండకు పాల్పడ్డాడు. పక్కా ప్రణాళికతో తన వెంట కత్తిని తీసుకుని అర్ధరాత్రి దాటిన తరువాత మైనర్ బాలిక (17) ఇంటికి చేరుకున్నాడు. ఇంటి బయట బీరు



శనివారం ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న ఫ్యూచర్ సిటీ కమీషనర్ తరుణ్ జోషి

సేవించి అనంతరం హత్యాకాండను కొనసాగించాడు. ముందుగా బాలిక ఇంటి తలుపులు తట్టాడు. దీనితో బాలిక తల్లి తలుపు తీయడంతో వెంటనే తనతో తెచ్చుకున్న కత్తితో ఆమె కడుపులో విచక్షణ రహితంగా పొడిచాడు. ఆమె అక్కడే గుమ్మంలోనే చనిపోయింది. అమె కేకలు విన్న మైనర్ బాలిక నాయనమ్మ బయటకు రావడంతో ఆమెపై కూడా దాడి చేశాడు. పలుమార్లు కత్తితో పొడవడంతో ఆమె కూడా అక్కడికక్కడే పడి మృతి చెందింది. తల్లి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చి ఆరుబయట పడేశాడు.

అదే ఇంట్లో ఉన్న మైనర్ బాలిక సోదరి మానసికంగాను, శారీరకంగాను వికలాంగురాలు కావడంతో ఆమె జోలికి వెళ్లలేదని తెలుస్తోంది. అనంతరం ఇంట్లోకి దూరి భయాందోళనలతో ఉన్న మైనర్ బాలికను బలవంతంగా లాక్కొని బయటకు వచ్చాడు. ముందుగానే ఒక కారును అద్దెకు తీసుకున్నాడు. ఆ కారులో బాలికను ఎక్కించుకుని మండల కేంద్రం నుండి దైవాలగూడలో ఉన్న తన ఇంటికి సమీపంలో ఉన్న అఖిల్ సాగర్ చెరువు గట్టు వద్దకు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమెను కారులో నుంచి దింపి కత్తితో మెడకోసి అత్యంత దారుణంగా హతమార్చాడు. అంతటితో పగ చల్లారక పోవడంతో తన ఇంటికి వెళ్లాడు. ఇంట్లో నిద్రిస్తున్న భార్య సరిత (33)ను ముందుగా హత్య చేశాడు. అమె పక్కనే పడుకుని ఇద్దరు చిన్నారులు పరీక్షిత్ (4), వైదీక్షిత్ (2)లను కూడా కనికరం లేకుండా హతమార్చాడు. హత్యాకాండల అనంతరం తన తండ్రికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని వివరించాడు. తాను అందరినీ హతమార్చానని, తాను కూడా ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు సమాచారం అందించాడు. అనంతరం తన వద్ద ఉన్న కారులో అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులకు లభించిన సీసీ పుటేజీ, ఇతర ఆధారాల ద్వారా అతను అక్కడి నుంచి నేరగా నందిగామకు చేరుకున్నాడు. ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేయడంతో అతని ఆచూకీ తెలుసుకోవడం సమస్యగా మారింది. ఫ్యూచర్ సిటీ కమీషనర్ తరున్‌జోషి, చేవెళ్ల డిసిపి యోగేష్‌గౌతమ్, చేవెళ్ల ఎసిపి కిషన్‌గౌడ్‌లు సంఘటన స్థలంకు చేరుకున్నారు. పోలీస్ బందో బస్తుతో క్లూస్ టీం డాడ్ స్వాగ్‌లతో ఆదారాలను సెకరించారు. మూడు మృత దేహాలను చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రికి, మరో మూడు మృత దేహాలను ఉస్మానియా అసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

**పోలీసుల నిరక్ష్యంపై ఆగ్రహం..**

పోక్సో కేసు నమోదైనప్పటికీ నిందితుడిపై తగిన నిఘా పెట్టలేదని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు షాబాద్ ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. రాస్తారోకోలో పట్నం అవినాష్ రెడ్డి, బర్క కృష్ణ, రాము, తమ్మలి రవీందర్, వెంకట్ యాదవ్, జడల రాజేందర్ గౌడ్, రాహుల్ గుప్తా, దేవేందర్ రెడ్డి, గౌరీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిలను పోలీసులు చేవెళ్లలోనే అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బాధిత కుటుంబ సభ్యుల రోదనలు షాబాద్ చౌరస్తాలో హృదయ విదారకంగా మారాయి.

**పది ప్రత్యేక బృందాలు : కమిసనర్ తరుణ్ జోషి**

కాగా నిందితుడు రాజ్‌కుమార్‌ను పట్టుకోవడానికి పది ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. జిల్లా సరిహద్దులు దాటకుండా చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలతో అతని కోసం గాలిస్తున్నామన్నారు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడం వల్ల అతని ఆచూకీలో కొంత జాప్యం జరగుతోందని ఆయన అన్నారు. నిందితుడిని సాధ్యమైనంత త్వరగా పట్టుకుని అరెస్ట్ చేస్తామని ఆయన అన్నారు. సంఘటన స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. జాయింట్ సీపీ చందన దీప్తి, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, షాద్‌నగర్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇతర పోలీసు అధికారులు, క్లూస్ టీం సభ్యులు ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తును పర్యవేక్షించారు. చేవెళ్ల ఆర్డీవో పార్థసారథి రెడ్డి కూడా సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

**సోదరికి డబుల్‌బెడ్‌రూం, వసతిగృహం కల్పిస్తాం:కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య**

షాబాద్ మండలంలో జరిగిన ఆరుగురు హత్యల ఘటనలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులందరినీ కోల్పోయి అనాథగా మిగిలిన మానసిక, శారీరక వికలాంగురాలుకు తక్షణ సహాయంగా రూ.5 లక్షల ప్రభుత్వ ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. ఆమెకు డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు అన్ని సౌకర్యాలు కలిగిన వసతిగృహంలో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ హామీలతో బంధువులు, గ్రామస్తులు చేపట్టిన రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలిమాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మేఘనకు కేవలం రూ.5 లక్షలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోకుండా రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తన పనులు తాను చేసుకోలేని స్థితిలో ఉన్న మేఘనను మంచి వసతిగృహంలో చేర్పించి ఆమె పూర్తి బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. అలాగే పోక్సో కేసులో నిరక్ష్యం వహించిన పోలీసు అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా పోక్సో కేసు నిందితుడు రాజ్‌కుమార్‌పై సకాలంలో తగిన చర్యలు తీసుకోకపోవడంతో విధుల్లో నిరక్ష్యం వహించిన షాబాద్ ఎస్సై రమేష్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. అలాగే షాబాద్ సీఐ కాంతారెడ్డిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు.

# షాబాద్ కిరాతక హత్యలపై ఎన్‌హెచ్ఆర్‌సిలో ఫిర్యాదు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురి దారుణ హత్యలపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సి)లో న్యాయవాది రామారావు శనివారం ఫిర్యాదు చేశారు. రాజ్‌కుమార్ అనే వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మొదట ఓ మైనర్ బాలికను ఆమె కుటుంబీకులు ఇద్దరిని, ఆ తరువాత కట్టుకున్న భార్య, ఇద్దరు కన్నపిల్లలను హత్యచేసి కారులో పా రిపోయాడు అని తెలిసింది. షాబాద్‌లోని నైజాంగూడలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ కిరాతకానికి పా ల్పడ్డ రాజ్‌కుమార్‌ను తమకు అప్పగించాలని స్థానికులు ధర్నా చేయగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఫ్యూచర్ సిటీ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి వారిని సముదా యించడంతో ఆందోళన విరమించారు. కాగా ఈ ఘటనలో పోలీసుల వైఫల్యం వుందని న్యాయవాది రామా రావు ఎన్‌హెచ్ఆర్‌సిలో ఫిర్యాదు చేశారు. రాజ్‌కుమార్‌పై ఫోక్సో కేసు నమోదైన తరువాత ఆతనిపై నిఘా వుంచడంలో పోలీసులు విఫలమ య్యారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో మైనర్ బాలికను వేధించిన ఘటనపై ఫిర్యాదు అందిన సమయంలో రాజ్‌కుమార్‌పై పోలీసులు నాంకే వాస్తేగా కేసు నమోదు చేసి ఆ తరువాత పట్టించుకోలేదని, దీని కారణంగా అతను ఆరుగురిని హత్య చేయగలిగాడని న్యాయ వాది రామారావు ఆరోపించారు. ఈ కేసులో షాబాద్ సిఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేష్ నిర్లక్ష్యంగా వ్యవహ రించారని ఆయన తెలిపారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే రాజ్‌కుమార్ సైకోగా మారి ఆరుగురిని అంతం చేశాడని, అతన్ని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని న్యాయవాది రామారావు కోరారు. కాగా ఈ ఫిర్యాదుపై ఎన్‌హెచ్ఆర్‌సి ఇంకా స్పందించలేదు.

## అందుబాటులో టిజిసెట్-2025 సర్టిఫికెట్లు

### అర్హత సాధించిన 2,565 మంది తీసుకోవచ్చు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతోపాటు డిగ్రీ లెక్చరర్ పోస్టుల అర్హత కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(టిజి సెట్)-2025 సర్టిఫికెట్లు అందుబాటులో ఉన్నాయని సెట్-2025 మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ బి శ్రీనివాస్ ప్రకటించారు. టిజి సెట్-2025 పరీక్షలను 2025లో డిసెంబర్ 22 నుంచి 24 వరకు నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను ఈ ఏడాది మార్చి 20న విడుదల చేసినట్లు గుర్తు చేసిన మెంబర్ సెక్రెటరీ సెట్ సర్టిఫికెట్స్‌ను అర్హత సాధించిన అభ్యర్థులు తీసుకోవచ్చనని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. టిజి సెట్-2025కి 45,127 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 37,706 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 2565 అర్హత సాధించారు. అర్హత సాధించిన వారు నేరుగా ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న టిజి సెట్ కార్యాలయంలో తమ సర్టిఫికెట్లను తీసుకోవచ్చని ప్రకటించారు.

## ఫిన్‌లాండ్‌లో అదృశ్యమైన విద్యార్థి మణిదీప్‌రెడ్డి మృతి

### సముద్రంలో మృతదేహాన్ని గుర్తించిన ఎఫ్‌బిఐ

**హైదరాబాద్ (వనస్థలిపురం), జులై 11, ప్రభాతవార్త:** ఫిన్‌లాండ్‌లో అదృశ్యమైన విద్యార్థి మణిదీప్‌రెడ్డి మృతి చెందినట్లు ఫిన్‌లాండ్ ఫెడరల్ బ్యూరో అధికారులు వెల్లడించారు. వనస్థలిపురం వైదేహీనగర్‌లో నివాస ముండే గుజ్జ ముత్యంరెడ్డి, మమత దంపతుల కుమారుడు గుజ్జ మణిదీప్‌రెడ్డి 9 నెలల క్రితం ఇంజినీరింగ్ విద్య చదవడానికి ఫిన్‌లాండ్ దేశానికి వెళ్లాడు. కాగా మే 5న మణిదీప్ అదృశ్యం అయినట్లు తల్లిదండ్రులకు సమాచారం అందింది. ఫిన్‌లాండ్ దేశం అధికారులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 9న గురువారం కొనుక్రిఫ్ ఒడేనేరంత అధికారులు సముద్రతీరంలో నిర్వహించిన గాలింపు చర్యల్లో లభించిన మృతదేహం మే నెలలో అదృశ్యమైన భారతీయ విద్యార్థి మణిదీప్‌రెడ్డిదిగా గుర్తించారు. మణిదీప్ మృతికి గల కారణాలు జాతీయ దర్యాప్తు బ్యూరో పరిశీలిస్తోంది. అయితే ఈ ఘటనలో ఎలాంటి నేరం జరిగినట్లు అనుమానాలు లేవని అధికారులు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలి యాల్సి వుంది. కాగా మణిదీప్ మృతి చెందాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.



మణిదీప్‌రెడ్డి (ఫైల్)

# గాంధీభవన్ వేదికగా తుంగతుర్తి పంచాయితీ

## డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, సర్వోత్తమరెడ్డితో జగ్గారెడ్డి భేటీ

## పిసిసి చీఫ్ మహేశ్‌తో మందుల సామెల్ సమావేశం

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత వివాదాల పరిష్కారానికి టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి శనివారం ఆ నియోజకవర్గ పరిశీలకులుగా డిసిసి చీఫ్ గుడిపాటి నర్సయ్య, నియోజకవర్గం నాయకులు మండల స్థాయి నేతలతో సమావేశం జరిపారు. మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి కుమారుడు నియోజకవర్గం ఇంచార్జీ సర్వోత్తంరెడ్డి కూడా హాజరైనారు. కాంగ్రెస్ పార్టీ నిబద్ధత కలిగిన కార్యకర్తలను దూరం చేసుకోవద్దని పదవులు ముఖ్యం కాదని ఎవరు గాంధేయభావాలతో ఉంటారో వారి నిబద్ధతకు సరైన గుర్తింపు రావాలని సూచించారు. సాయంత్రం నాలుగు గంటలకు జగ్గారెడ్డితో చామల భేటీ అయ్యారు. భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జగ్గారెడ్డి వద్ద కాంగ్రెస్ పార్టీ జెండా మోసినవారికి న్యాయం చేయాలని అనర్హులకు పదవులు ఇవ్వడం వల్ల పార్టీ సంస్థాగతంగా దెబ్బతింటుందని జగ్గారెడ్డికి వివరించినట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. జగ్గారెడ్డి అందరితో వన్‌టువన్‌గా కూర్చొని అభిప్రాయాలు స్వీకరించారు. ఎమ్మెల్యే మందుల సామెల్ అభిప్రాయం కూడా త్వరలో తీసుకొని పార్టీకి తుంగతుర్తి పరిశీలకుడిగా నివేదిక సమర్పించే అవకాశం ఉంది. మరోవైపు టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కలిశారు. తుంగతుర్తి నియోజకవర్గ వివాదం నేపథ్యంలో బొమ్మ మహేష్‌ను కలిసి పరిస్థితి వివరించారు. రెండు రోజుల క్రితం ఆర్వపల్లి సామేలు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.గాంధీభవన్ ముట్టడించి నిరసన తెలిపారు. మండల పార్టీ పదవుల అనర్హులకు ఇస్తున్నారని సంస్థాగతంగా బలహీనపరుస్తున్నారని ఆరోపణలతో స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు గాంధీభవన్‌కు వచ్చారు.

# లింగ సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలి

## మహిళా భద్రతా విభాగం డిజి చారుసిన్హా

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** సమాజంలో వున్న లింగ వివక్షత పూర్తిగా తొలగి పోవాలంటే సమానత్వంపై ఇంటి నుంచే చర్చ మొదల వ్వాలని, అక్కడి నుంచే ప్రారంభం కావాలని మహిళా భద్రతా విభాగం (డబ్ల్యు ఎస్‌డబ్ల్యు) డిజి చారు సిన్హా అన్నారు. పితృ స్వామ్య భావజా లాన్ని మార్చేందుకు ప్రతీ ఇంట్లో అందరు కృషి చేయాలని ఆమె కోరారు. అంబేద్కర్ యూనివ ర్శిటీలోని వీ హబ్‌లో శనివారం నాడు స్టాండ్ విత్ హర్ ఆధ్వర్యంలో జరిగిన ఐదవ విడత చర్చా వేదికలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యా, సినీ, సామాజిక సేవా, మీడియా, పోలీసు విభాగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో చారు సిన్హా లింగ వివక్షపై తనదైన శైలిలో మాట్లాడి ఆహు తులచే భేష్ అనిపించు కున్నారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకు పోతున్న నేటి ఆధునిక కాలంలో వారిపై ఇంకా వివక్ష కొనసాగడం సరైంది కాదని ఆమె అన్నారు. సామాజిక దురాచారాలు, సమానత్వం పేరిట మహిళలకు అనేక రంగాల్లో అవమానం తప్పడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ లకు మొదట తమ కుటుంబాల్లో పూర్తి మద్దతు ఉండాలని చారు సిన్హా తెలిపారు. మహి ళలకు ఆయా రంగాల్లో జరుగు తున్న అన్యా యాలపై చర్చలు జరగ డం మంచి పరిణా మమని ఆమె తెలిపారు. సెంట్రల్ వర్శిటీ డీన్ సునీతారాణి మాట్లాడు తూ మహిళలకు కుటుంబాల నుంచి మరిం త మద్దతు ఉండాలని, స్వేచ్ఛ ఉండాలని కోరారు. లింగ వివక్షను ఇవి రూపుమాపుతాయని ఆమె అన్నారు. సినీనటి సుప్రియ మాట్లాడుతూ లింగ వివక్షత వల్ల మహిళలకు అనేక విషయాలలో అన్యాయం జరుగు తుందని అన్నారు. కుటుంబాల్లో అందరికి స్వేచ్ఛగా ఎదిగే అవ కాశాలు వుండాలని ఆమె తెలిపారు. పిల్లలను విలువలతో కూడిన క్రమశిక్షణతో పెంచడం వల్ల వారు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు అవకాశం వుంటుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు లింగ వివక్షతపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.



అంబేద్కర్ యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భద్రతా విభాగం డిజి చారుసిన్హా

# కార్మికులకు రూ. 5 లక్షల ప్రమాదబీమా సౌకర్యం

## జనసేన ప్రధానకార్యదర్శి తాళ్లూరి రామ్, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్‌గౌడ్

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:**రాష్ట్రంలోని కార్మికులు, శ్రామికుల సంక్షేమానికి కట్టుబడి జనసేన పనిచేస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తెలిపారు. జనసేన సభ్యత్వంతో కార్మికులకు రూ. 5 లక్షలు ప్రమాద భీమా సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్మిక నాయకుల సమావేశం హైదరాబాదులోని జనసేన కార్యాల యంలో శనివారం జరిగింది. సమావేశానికి హాజ రైన కార్మికులు .. జనసేన ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేయాలని, ప్రతీ కార్మికుడికి ఇన్సూరెన్స్ పథకం తీసుకురావాలని, ఆరోగ్య సంరక్షణ విధానాలు, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ పని చేయాలని, సింగరేణిలో మొబైల్ యాప్ వ్యవస్థ, టోల్ ఫ్రీ నెంబర్ విధానం తీసుకు రావాలని, మోటర్ రవాణా వ్యవస్థ సమస్యలు, చిరు వ్యాపారస్తులు, తోపుడు బండ్లపై వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారస్తుల సమస్యలపై దృష్టి పెట్టాలని, కార్మిక సంఘాల ఎన్నికల్లో జనసేన పార్టీ అనుబంధ విభాగాన్ని పోటీకి దింపాలి అనేక అంశాలను పార్టీ దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల ప్రతిపాదనలకు స్పందనగా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ మాట్లాడుతూ.. జనసేన సభ్యత్వంతో కార్మికులకు రూ. 5 లక్షలు ప్రమాదభీమా సౌకర్యం ఉంటుందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో కార్మికవ్యవస్థలో 44 విభాగాలకు సంబంధించిన ప్రధానమైన సమస్యలను జనసేన మేనిఫెస్టోలో పెడతామని ప్రకటించారు. తీవ్ర ప్రభావిత సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడతామని, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర కార్మికుల సమస్యలపై స్వయంగా మాట్లాడతారని, కార్మికులకు జనసేన పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. కార్మికులు, ఉద్యోగులు, శ్రామికుల సంక్షేమానికి కట్టుబడి జనసేన పనిచేస్తుందన్నారు. జనసేన పార్టీ కార్మిక విభాగాన్ని బలోపేతం చేయడం, కార్మికుల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగడం, వివిధ కార్మిక రంగాలకు చెందిన నాయకులను పార్టీతో అనుసంధానం చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జనసేన పార్టీ కార్మిక నాయకులు దారపు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో జనసేన తెలంగాణ నాయకులు నందగిరి సతీష్ కుమార్, కార్మిక విభాగ లీగల్ అడ్వైజర్ డి.ఎస్.ఎన్. మూర్తి, వివిధ రంగాలకు చెందిన కార్మిక నాయకులు ఫ్యాక్టరీ కార్మిక విభాగం నుండి కొసాన అంకబాబు (ఐటీసీ), భద్రాచలం, పుట్టి శ్రీనివాసరావు (ఐటీసీ), కె.అశోక్ కుమార్ (ఎంటీఏఆర్), సీహెచ్.శ్రీరాములు (ఎంటీఏఆర్), రవాణా కార్మిక విభాగం నుండి ఎం.సోమేశ్ (శ్రమశక్తి అవార్డు గ్రహీత), పి.మహేందర్, బి.సుబ్రహ్మణ్యం, జె.రాము గౌడ్, ఇండ్ల కిరణ్, డి.కోటేశ్వరరావు. భవన నిర్మాణ కార్మిక విభాగం నుండి ఇంటి నాగముసీందర్ రావు, జి.మహేష్, నడింపల్లి శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఉద్యోగుల విభాగం నుండి వై.రాజు, సి.శ్రీధర్, ఎన్.నర్సింహా, కె.రవి కుమార్, కె.దేవకుమార్, వి.రవికుమార్, సూరి పాల్గొన్నారు.



# పింఛన్‌దార్ల ఖాతాల్లో పిఎఫ్ వడ్డీ జమ

**న్యూఢిల్లీ, జులై 11:** కోట్లాది మంది వేతన జీవులకు ముఖ్యంగా ప్రైవేట్ రంగంలో పనిచేసే వారికి ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ పీఎఫ్ వడ్డీ డబ్బుల్ని ఈపీఎఫ్ చందాదారులఅకౌంట్లలో జమ చేయడం ప్రారంభించింది. అయితే ప్రస్తుతం వడ్డీ జమ ప్రక్రియ వివిధ దశల్లో కొనసాగుతున్నందున, కొందరి పాస్‌బుక్‌లలో మాత్రం ఈ మొత్తం వెంటనే కనిపించకపోవచ్చు. దీంతో కంగారు పడాల్సిన పని లేదని, జులై 15 నాటికి అందరి ఖాతాల్లో వడ్డీ డబ్బులు క్రెడిట్ అవుతాయని ఈపీఎఫ్ఓ స్పష్టం చేసింది. మీ మొబైల్ నంబర్ మీ యూఏఎన్‌కి లింక్ అయి ఉంటే కొన్ని సులువైన పద్ధతుల ద్వారా మీ అప్డేటెడ్ వడ్డీ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. ఇంటర్నెట్ లేదా స్మార్ట్‌ఫోన్ లేకపోయినా మీ యూఏఎన్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి 9966044425 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే క్షణాల్లో పీఎఫ్ బ్యాలెన్స్ వివరాలు మీ మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ రూపంలో వస్తాయి. ఈ నంబర్‌కు డయల్ చేయగానే రెండు రింగుల తర్వాత కాల్ ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. తర్వాత మెసేజ్ రూపంలో టోటల్ పీఎఫ్ బ్యాలెన్స్, చివరి కాంట్రిబ్యూషన్ వివరాలతో కూడిన మెసేజ్ మీకు అందుతుంది. కాబట్టి ప్రతి నెలా ఎంత పీఎఫ్ కట్ అవుతుందో తెలుసు కాబట్టి పీఎఫ్ బ్యాలెన్స్ మధ్య తేడా గమనించడం ద్వారా మీకు ఎంత వడ్డీ పడిందనేది కూడా తెలుసుకోవచ్చు. ఈపీఎఫ్ఓ పోర్టల్ ద్వారా కూడా బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్ఓ మెంబర్ పోర్టల్‌లో యూఏఎన్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్‌తో లాగిన్ చేయాలి. మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయాలి. అక్కడ పీఎఫ్ పోర్టల్‌లో వ్యూ పాస్‌బుక్‌పై క్లిక్ చేస్తే మీ మొత్తం పీఎఫ్ బ్యాలెన్స్, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంత వడ్డీ జమైందో తెలుస్తుంది. ఉమంగ్ యాప్‌లో లాగిన్ అయి కూడా పీఎఫ్ బ్యాలెన్స్ వివరాల్ని తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో లాగిన్ అయి యూఏఎన్ నంబర్‌ను లింక్ చేయాలి. పీఎఫ్ బ్యాలెన్స్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే గత 3 నెలల లావాదేవీలతో పాటు పూర్తి వివరాలు కనిపిస్తాయి.

## 80 వేల మైనార్టీలకు ఎఐ పాఠాలు

### మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మైనార్టీ విద్యార్థులకు ఆర్టిఫిషియల్లీ ఇంటిలిజెన్స్‌లో (ఏఐ)లో శిఖ ఇవ్వనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో మస్క్ నెక్ట్స్ జనరేషన్, డాక్సా కన్సల్టింగ్ ప్రయివేటు లిమిటెడ్ భాగస్వామ్యంతో 80 వేల మంది మైనార్టీ విద్యార్థులకు ఏఐ పాఠాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థ (టిమ్రీస్) పరిధిలోని 205 పాఠశాలలు, కళాశాలల్లో చదివే దాదాపు 80 వేల మంది విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్లీ ఇంటిలిజెన్స్ రెడీనెస్, డిజిటల్ సేఫ్టీ ప్రోగ్రామ్ అందించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వచ్చేనెల 15 నుంచి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా, సామాజిక బాధ్యతతో కూడిన భాగస్వామ్య విధానంలో పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం అందించనుందని వివరించారు. మైనార్టీ విద్యార్థులు కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలు, అవకాశాలను పొందేలా ఈ కార్యక్రమం రూపొందించామని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషించిన మస్క్ నెక్స్ట్ జనరేషన్ వ్యవస్థాపకురాలు, సీఈవో అన్ని త్రివేది, డాక్సా కన్సల్టింగ్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధి జోసెఫ్ క్రిస్టోఫర్, టిమ్రీస్ కార్యదర్శి బి షఫియుల్లా, అధ్యక్షుడు ఫహీమ్ ఖురేషీ కృషిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.


## ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ. పది కోట్ల గోల్డ్‌స్కాం

### కెపిహెచ్‌బి శాఖ మేనేజర్ ఖాతాదారుల బంగారాన్ని మరో కంపెనీలో తనఖా పెట్టినట్లు ఆరోపణలు

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), జులై 11, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని కెపిహెచ్‌బి కాలనీ ఆరో ఫేజ్‌లోని ముత్తూట్ ఫైనాన్స్ శాఖలో భారీ గోల్డ్ స్కామ్ వెలుగుచూసింది. ఖాతాదారుల బంగారాన్ని అక్రమంగా మరో ఫైనాన్స్ సంస్థలో తనఖా పెట్టి సుమారు రూ.10కోట్ల రుణం తీసుకున్నట్లు శాఖ మేనేజర్‌పై ఆరోపణలు వచ్చాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కెపిహెచ్‌బి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తూట్ ఫైనాన్స్ శాఖలో ప్రియాంక రెడ్డి మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సాధారణంగా గోల్డ్ లోన్లపై 14 శాతం వరకు వడ్డీ ఉంటుందని, అయితే తమ శాఖలో 6 శాతం వడ్డీకే రుణం ఇస్తామని స్థానికులను ఆమె నమ్మించారు. దీంతో సుమారు 40 మంది తమ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. అయితే ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని మేనేజర్ మరో గోల్డ్ ఫైనాన్స్ సంస్థలో తనఖా పెట్టి సుమారు రూ.10 కోట్ల రుణం తీసుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అంతేగాక, ఖాతాదారులు ప్రతి నెల చెల్లిస్తున్న వడ్డీ మొత్తాన్ని కూడా తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించినట్లు వారు తెలిపారు. ఇటీవల కొందరు ఖాతాదారులు తమ బంగారాన్ని విడిపించుకునేందుకు ప్రయత్నించగా, మేనేజర్ వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేయడంతో అనుమానం వ్యక్తమైంది. ఆరా తీయగా తమ బంగారం అక్రమంగా మళ్లించిన విషయం తెలిసిందని బాధితులు తెలిపారు. దీంతో శుక్రవారం సాయంత్రం కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## సినీనటుడు ఆర్యపై కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 11, ప్రభాతవార్త:** ప్రముఖ తమిళ సినీనటుడు, నిర్మాత ఆర్య అలియాస్ జమ్‌షాద్ సెతిరాకత్‌తోపాటు మినీ స్టూడియో, ది షో పీపుల్ సంస్థల ప్రతినిధులపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. అనంతంకాడు సినిమా నిర్మాణం కోసం సినీ నిర్మాణ పరికరాలను సరఫరా చేయాలని తాహెర్ సినీ టెక్నిక్ సంస్థను మినీ స్టూడియో, ది షో పీపుల్, సినీనటుడు ఆర్యలు కోరారు. సకాలంలో చెల్లింపులు చేస్తామని హామీ ఇవ్వడంతో రూ.2.12 కోట్ల విలువైన సినీ పరికరాలు, సేవలను వినియోగించుకున్నారు. రూ.1.80 కోట్లు, అందుకు సంబంధించిన జీఎస్టీ బకాయిలను చాలా రోజులుగా చెల్లించకుండా కాల యాపన చేస్తున్నారు. డబ్బులు చెల్లిస్తామని పలుమార్లు హామినిచ్చి నప్పటికి చెల్లించడంలో విఫలమయ్యారు. బకాయిలు చెల్లించకుండానే సినిమాను వాణిజ్యపరంగా వినియోగించేందుకు ప్రయత్నించడంతోపాటు, సంస్థ మేనే జర్‌ను బెదిరించినట్లు తాహెర్ సినీ టెక్నిక్ సంస్థ అకౌంట్స్ హెడ్ సయ్యద్ జావేద్ అలీ జులై 10న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 316(2), 318(4) కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



సినీనటుడు ఆర్య(ఫైల్)

# ఒటిటి చిత్రాలకూ సెన్సార్ బోర్డు సర్టిఫికేషన్

## కంటెంట్‌ను నియంత్రించేందుకు కేంద్రం మార్పులు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** థియేటర్లలో విడుదలయ్యే సినిమాల మాదిరిగానే, ఓటీటీ చిత్రాలకు కూడా సెన్సార్ బోర్డు సర్టిఫికేషన్‌ను తప్పనిసరి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇటీవల విడుదలైన కొన్ని చిత్రాల వివాదాల నేపథ్యంలో, ఓటీటీ కంటెంట్‌ను నియంత్రించడానికి ఐటీ చట్టంలో మార్పులు తీసుకురావాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. ప్రస్తుతానికి ఓటీటీలకు సెన్సార్ బోర్డు నిబంధనలు లేవు. దీనికి బదులుగా, 2021 ఐటీ రూల్స్ ప్రకారం ఓటీటీలు సొంతంగా నియంత్రణ పాటించాలి. అయితే ఈ నిబంధనల్లో మార్పులు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుని దానికి సంబంధించి ప్రతిపాదనల రూపకల్పన చేస్తోంది. ప్రముఖ పంజాబీ నటుడు, సింగర్ దిల్జీత్ దోసాంజ్ నటించిన సట్లెజ్ సినిమా వివాదమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. అయితే, దర్శకుడు హనీ ట్రెహన్ తెరకెక్కించిన సట్లెజ్ పంజాబ్‌కు చెందిన మానవ హక్కుల ఉద్వేగభరిత ఉద్యమకారుడు జస్వంత్ సింగ్ ఖల్రా జీవిత కథ ఆధారంగా రూపొందింది. 1980 నుండి 1990ల కాలంలో పంజాబ్లో జరిగిన అపహరణలు, అక్రమ కాల్పుల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. అయితే, ఈ సినిమాకు థియేట్రికల్ విడుదల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏకంగా 127 కట్స్ విధించడంతో పాటు పేరును కూడా పంజాబ్ 95 నుంచి సట్లెజ్‌గా మార్చాలని కోరింది. ఇన్ని కటింగ్లతో సినిమాను విడుదల చేయడం ఇష్టం లేని మేకర్స్, థియేటర్ విడుదలను పక్కన పెట్టి ఎలాంటి సెన్సార్ కట్స్ లేకుండా నేరుగా జీ5 ఓటీటీ ప్లాట్ఫారమ్‌లో డిజిటల్ రిలీజ్ చేశారు. కాగా ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌కు ప్రస్తుతానికి సెన్సార్ బోర్డు అనుమతి అవసరం లేదు. దీనిని ఆసరాగా చేసుకుని సెన్సార్ బోర్డు తిరస్కరించిన కటింగ్‌లను కూడా ఓటీటీలో స్ట్రీమింగ్ చేయడంతో కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. దీంతో సినిమా డిజిటల్ వేదికపై విడుదలైన కొద్ది సమయంలోనే అది వివాదానికి దారితీసింది. దేశ భద్రత, శాంతిభద్రతల అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జోక్యం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటూ, విడుదలైన సుమారు 48 గంటల్లోనే సంబంధిత ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి సినిమాను తొలగించారు. ఈ ఘటన తర్వాత ఓటీటీ విడుదలలపై కూడా ముందస్తు పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో బలపడినట్లు తెలుస్తోంది. దీంతో ఇకపై ఓటీటీలో నేరుగా విడుదలయ్యే సినిమాలకు కూడా సెన్సార్ సర్టిఫికేషన్‌ను తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తోంది. అంతేకాకుండా, ఈ విధానాన్ని కేవలం సినిమాలకే పరిమితం చేయాలా, లేక వెబ్‌సిరీస్‌లను కూడా అదే పరిధిలోకి తీసుకురావాలా అనే అంశంపై ప్రభుత్వం వివిధ వర్గాలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

## కళ్యాణలక్ష్మిలో మార్పులు

### చెక్కుల పంపిణీ బంద్

### ఆర్థిక శాఖ వద్ద ప్రతిపాదనల ఫైలు


**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విధానంలో త్వరలోనే కీలక మార్పులు రానున్నాయి. ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక ఆసరాగా నిలిచే రూ. 1,00,116 సాయాన్ని ఇకపై చెక్కుల రూపంలో కాకుండా, నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోంది. ఇందుకు సంబంధించి ఆర్థిక శాఖ వద్ద ప్రతిపాదనల ఫైలు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఒక ప్రత్యేక పోర్టల్‌ను కూడా తీసుకురావడానికి కసరత్తు జరుగుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత విధానంలో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎమ్మార్వో, ఆర్డీవోల వెరిఫికేషన్, స్థానిక ఎమ్మెల్యేల ఆమోదంవంటి సుదీర్ఘ ప్రక్రియ వల్ల తీవ్ర ఆలస్యం జరుగుతోంది.

# సత్తుపల్లి సింగరేణిలో ఉద్రిక్తత

## బాయిబాట కొచ్చిన కవితకు చుక్కెదురు

## కవిత, కార్మిక నాయకులను అడ్డగించిన పోలీసులు

## గేటు బద్దలగొట్టి లోపలికొచ్చిన కార్మికులు



**సత్తుపల్లి, జులై 11, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి సింగరేణి జేవీఆర్ ఓసీ2లో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన బాయిబాట కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. కార్మికుల సమస్యలు తెలుసుకోవటానికి ఎస్ఎంఎస్ యూనియన్ నాయకులతో శనివారం సత్తుపల్లి జేవిఆర్‌ఓసి 2 కు వచ్చిన టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవితకు సింగరేణ ిఅధికారులు గేట్లకు తాళాలు వేసిలోపలికిఅనుమతించకపోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం టీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కవిత గేట్లు తోసుకుని లోపలికి వెళ్లారు. సింగరేణిలోనిఅమ్మవారి దేవాలయంలో టిఆర్ఎస్ అధినేత్రి కవిత ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై తీవ్ర విమర్శలు చేశారు. సత్తుపల్లి సింగరేణి యాజమాన్యం, కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. హెచ్ఎంఎస్ యూనియన్ నిజాలు చెబుతుంటే వాటిని జీర్ణించుకోలేక పోలీసులను అడ్డం పెట్టుకున్నారని కవిత విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం గేట్లు బద్దలు కొట్టి అయినా లోపలికి రావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. హెచ్ఎంఎస్ యూనియన్‌ను లోనికి రాకుండా గేట్లకు తాళాలు వేశారని, కార్మికులకు అండగా నిలవాల్సిన, ఐఎన్టీ యూసీ, ఏఐటియుసి, యూనియన్లు యాజమాన్యం కోసంపనిచేస్తున్నాయని మండిపడ్డారు. ఏఐటీయూసీ యూనియన్ సిగ్గుపడాలని, దమ్ముంటే కార్మికుల హక్కులను కాపాడాలని సవాల్ విసిరారు. సింగరేణి ఆసుపత్రిని కేవలం రెండు పడకలతో నడుపుతున్నారని, కార్మికుల సంక్షేమం, వెల్ఫేర్, అభివృద్ధిని పూర్తిగా నిరక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇల్లందు, మణుగూరులో ఉన్న పరిస్థితి సత్తుపల్లికి రాకూడదని, కొత్తగా వచ్చే సింగరేణి గనులను ప్రైవేట్‌కు అప్పగించవద్దని కవిత డిమాండ్ చేశారు.కార్మికుల పక్షాన ప్రశ్నించేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం సరైన విధానం కాదని, హెచ్ఎంఎస్ యూనియన్ తరఫున జీఎంను లేబర్ కోర్టుకు ఈడుస్తామని తెలిపారు. కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను అణగదొక్కుతోందని, ఆ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్ యూనియన్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈనెల 20 నుండి రిలే నిరాహార దీక్షలకు దిగుతాం... సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రకటన చేయలేకపోతే ఈనెల 20 నుంచి హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు గాందేయవాద పద్ధతిలో చేయటానికి నిర్ణయించామని టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎంతోమంది సింగరేణిలో రిటైర్మెంట్ కు వస్తున్న దృష్ట్యా డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఎంతోమంది నిరాశతో ఉన్నారని ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల యొక్క సమస్యలను అర్థం చేసుకొని ఈనెల 20వ తారీకు లోపు ప్రకటన చేయకపోతే రిలే నిరాహారక దీక్ష ద్వారాకాంగ్రెస్ సర్కార్ మెడ లు వంచి తీరుతామని ఈసందర్భంగా కవిత హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు బోడ జనార్ధన్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు, సారన్న, సెంట్రల్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, టిఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్చార్జి గుట్టు కరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వనం నాగేందర్, కిషన్ నాయక్, సత్తుపల్లి ఇన్చార్జి జాగృతి సాగర్, ఎస్ఎంఎస్ నాయకులు ఆంజనేయులు, ఆస్కార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లోని భగత్‌నగర్‌కు చెందిన బండారి మారుతి, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామానికి చెందిన సొక్కం అంజయ్య సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాలలో సౌభాగ్య ఇండస్ట్రీస్ నడిపిస్తున్నారు. ధాన్యం పక్కదారి పట్టించడంతో వారిని సుల్తానాబాద్‌పోలీసులు అరెస్టుచేసి జైలుకూడు తినిపించారు. స్టీఫెన్ రవీంద్ర చొరవతో లీగల్‌గైడ్‌లైన్స్ పుస్తకాలు తెలంగాణలోని పోలీసుస్టేషన్‌లు, తహసిల్, సివిల్ సప్లయ్ అధికారులకు సుమారు వెయ్యి పుస్తకాలు అందుబాటులోకి రావడంతో గతంలో రైసుమిల్లర్లు అక్రమాలు చేసి అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ పొందినట్లు పొంద లేకపోతున్నారు. లీగల్‌ఎక్స్‌పర్ట్స్‌తో రూపొందించిన ఏకరూప గైడ్‌లైన్స్‌తో శాస్త్రీయంగా కేసు నమోదు చేసి కోర్టుల్లో వీగిపోకుండా చర్యలు చేపట్టారు. ఆస్తుల వేలం కూడా మొదలైంది. నల్లగొండ సూర్యపేటలో సిఎంఆర్ ధాన్యం ఇవ్వనివేలం వేసినబియ్యం అందించని రైసు మిల్లర్ల ఆస్తులు అటాచ్ చేశారు. నాలుగవేల కోట్ల ఆస్తులు స్వాధీనంకు మార్గం సుగమం చేశారు. రాబోయే 2026-27 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ఎలాంటిఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా చూడడానికి, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఈరోజు 'మిషన్ కె100' ను స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. కొత్త దిగుబడి రాకముందే గోదాములను సిద్ధం చేసే ఉద్దేశ్యంతో, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థకి అప్పగించడంపై సివిల్ సప్లయిశాఖ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. తద్వారా నిధులను సమకూర్చుకోవడంతో పాటు గోదాముల అద్దె భారాన్ని తగ్గించుకునే లక్ష్యంతో, ధాన్యాన్ని ఒక క్రమపద్ధతిలో, దశల వారీగా వేలం వేయడంపై ఇది ప్రధానంగా దృష్టి సారిస్తుంది. భారీ స్థాయిలో ధాన్యం వచ్చే కొనుగోలు కేంద్రాలను ఆధునీకరించడమే మిషన్ కె100లక్ష్యంగా పెట్టుకొంది.

# పౌరసరఫరాల ప్రక్షాళనతో అవినీతి నిర్మూలన

**భాగ్యనగర్ భాస్కర్‌కుమార్**

పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎకసెక్కాలు చేసినట్లు.. తెలంగాణ పౌరసరఫరాలశాఖ అక్రమార్కులకు స్వర్గధామంగా మారింది. తెలంగాణ పౌరసరఫరాలశాఖ రైతుల నుంచిధాన్యం సేకరణ చేయడంతోపాటు ఒక కోటి ఐదులక్షలకు పైగాకుటుంబాలకు తలసరి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. మరోవైపు పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి వంట గ్యాస్ ప్రజలకు సరఫరా చేయడంలో అత్యంత కీలకపాత్రదారైన పౌరసరఫరాల శాఖకు తెలంగాణ ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో రూ.7366 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వం వేల కోట్లు పేద ప్రజల కోసం బడ్జెట్‌లో పెట్టినా అవి చివరకు అక్రమార్కుల జేబులు నిపండానికి మాత్రమే దోహదపడుతున్నాయి. అక్రమార్కులను పట్టుకొన్నా పౌరసరఫరాల చట్టాలలో ఉన్న లొసుగులతో ఎంత పెద్ద నేరం చేసినా చిన్నపాటి శిక్షలతో బయటపడి మళ్ళీ అదే నేరం చేయడం రివాజుగా మారింది. పౌరసరఫరాల శాఖ ధాన్యం సేకరణ అంశం ఇటు రైతులను అటు ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసే తంతుగా మారింది. రబీ సీజన్‌లో 72.30 ఎంఎల్‌టి ధాన్యం సేకరణ చేసి 14,006కోట్ల రూపాయలు 10.78లక్షలమంది రైతులకు చెల్లించారు. ఇంత పెద్ద ఆర్థిక యజ్ఞమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఉద్దేశ్యపూర్వకంగానే ఆలస్యం చేసి విక్రయ కేంద్రాలలో కుప్పలుగా పేరుకుపోయాక తూకం వేసి రైతులను దోపిడీ చేసేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తాలి పావును కదుపుతారు. ధాన్యం విక్రయానికి వచ్చిన రైతుల వద్ద కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 50 రూపాయలు వసూలు చేస్తారు. అందులో 35 రూపాయలు హమాలీలకు చెల్లిస్తున్నామని మిగతా 15 రూపాయలు తాగునీరు, జనుము తాడు (సుతిలి) సమకూర్చుకోవడానికి ఖర్చు పెడ్తున్నామని సెంటర్ నిర్వాహకులు రైతులకు చెబుతూ దోపిడిని వ్యవస్థీకృతం చేశారు. టార్పాలిన్ కవర్లకు రోజుకు ఐదు రూపాయలు అద్దెకూడా వసూలు చేసుకొనే బిజినెస్ మొదలైంది. ధాన్యం తూకం వేశాక వాహనాలు సకాలంలో రాకపోవడంతో రైతులే సొంత ఖర్చులతో వాహనాల్లో ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఈ సమయంలో సొంత వాహనంలో తరలించినా వాహనానికి కొనుగోలు కేంద్ర నిర్వాహకులు డబ్బులు చెల్లించాల్సి ఉండగా చాలా ప్రాంతాల్లో చెల్లించడం లేదు. దీంతో రైతులు ట్రక్కుల డబ్బులు సొంత జేబులో నుంచి ఖర్చు చేయాల్సి వస్తుంది. మరోవైపు ప్రభుత్వం ఇస్తున్న ట్రక్ డబ్బులు అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి. ధాన్యం తరలించే డ్రైవర్లు కూడా రైతు నుంచి బస్తాకు ఐదు రూపాయల చొప్పున బత్తా పేరుతో దోపిడీ చేస్తున్నారు. ఇక తాలు, సడెం, చేట, గన్నీబ్యాగ్




బరువు అంటూ క్వింటాలుకు సుమారు పదికిలోల వడ్లు అదనంగా తూకం వేస్తారు. తెలంగాణ వ్యాప్తంగా అదనపు కలెక్టర్లకు నుంచి మొదలు కొని పౌరసరఫరాలశాఖ రెవెన్యూ క్షేత్రస్థాయి సిబ్బందికి రైసుమిల్లర్లతో ఉన్న స్నేహబంధంతో మిల్లు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయిస్తూ బహిరంగ మార్కెట్లో అమ్ముకోవడానికి దోడిదారులు వెతుక్కొంటున్నారని ఆరోపణలున్నాయి. ఇలా సిఎం ఆర్ధ్యానం వేల కోట్ల విలువైనవి దారిమళ్లించి నీకింతా నాకింత అని పంచుకొన్నారు. దీనితో అధికారులను కూడా రైస్‌మిల్లర్లు సవాల్ చేసే స్థాయికి ఎదిగారు. రైస్ మిల్లుల్లో ఉన్న ధాన్యం తనిఖీ కోసం వెళ్లిన అధికారుల లెక్కలు కాకి లెక్కలు తప్పితే ఒరిజినల్‌గా లెక్కించే విధానం వారి వద్ద లేదు అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిఎంఆర్ బియ్యాన్ని ఇవ్వడానికి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇస్తున్నారు. బియ్యం కొంటామని వీధుల్లో ఉదయం బైక్‌పై మైక్‌తో అనౌన్స్ చేస్తూ తిరిగే కొనుగోలుదారు మొదలు కొని రేషన్‌డీలర్లు, ఎంఎల్ఎస్ పాయింట్ల ఇంచార్జ్‌లు వీరికి రేషన్ బియ్యం సమకూర్చే వనరులుగా మారిపోయారు. సిఎంఆర్ ఎగ్గొట్టిన మిల్లర్లకు క్రిమినల్ కేసులు పెట్టి ఆస్తుల వేలం వేస్తున్న ప్రభుత్వం వారి అక్రమాలకు అండగా నిలిచిన కొంత మంది అధికారులపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు పౌరసరఫరాలశాఖపై వినిపిస్తోంది. దీనికితోడు పంచనామా రిపోర్టు, ఎఫ్ఐఆర్ ఛార్జీషీటు రిమాండ్ రిపోర్టు, రికార్డు రికవరీ వంటి అంశాలకు శాస్త్రీయంగా కోర్టుల్లో నిలబడేలా నివేదికలు రూపొందించే విధానం ఇప్పటివరకు లేకుండా పోవడం అక్రమార్కులకు ఇప్పుడు ఊతమిస్తోంది. పౌరసరఫరాలశాఖ చట్టాలు వినియోగించుకోవడంలో సరైన నైపుణ్యంలేని ఉద్యోగుల కారణంగా ఏడేళ్ల శిక్షపడే కేసుల్లో కూడా బెయిల్ వచ్చింది. పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వచ్చాక పరిస్థితి మారిపోయింది. పౌరసరఫరాలశాఖ కేసులు కోర్టుల్లో వీగిపోకుండా, నిందితులకు ముందస్తు బెయిల్ ఇవ్వకుండా ఒక లీగల్‌టీం ఏర్పాటు చేసి మార్గదర్శకాలను రూపొందించడమే కాకుండా పోలీసు, సివిల్ సప్లయ్‌శాఖ సిబ్బందికి పంచనామా రిపోర్టు, ఎఫ్ఐఆర్ ఛార్జీషీటు రిమాండ్ రిపోర్టు, రికార్డు రికవరీ వంటి అంశాలకు శాస్త్రీయంగాకోర్టుల్లో నిలబడే విధంగా నివేదికలు రూపొందించే శిక్షణ ఇచ్చారు. మూడేళ్ల క్రితం పెండింగ్‌లో ఉన్న యాసంగి సీజన్‌కు సంబంధించిన బకాయిలను ఆగస్టు చివరిలోగా తుదిగడువుగా నిర్ణయించినా మిల్లర్లకు నోటీసులతో లీగల్ చర్యలు పడుతుండడం తీసుకొనేందుకు సివిల్ సప్లయ్ కమీషనర్ కఠిన నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో 348 రైసుమిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు, 128 మిల్లుయజమానులపై ఆర్ఆర్ యాక్టుల నమోదు చేశారు. కోర్టు కేసుల్లో విజయం సాధించడానికి చట్టపరంగా బలోపేతం అవుతున్నా, పౌరసరఫరాలశాఖ అంతర్గతంగా ఇప్పటికి కాలం చెల్లిన జీపిఎస్ యంత్రాలను ఇంకా వాడుతున్నారు. దాని స్థానంలో ప్రతి బండికి గోదాముల్లో కేమెరాలను బిగించడం వల్ల సగం అక్రమాలు తగ్గే అవకాశం ఉంది. వడ్లు బియ్యం తరలించే వాహనాలకు జీపిఎస్ బదులుగా అదే ధరకు అందుబాటులో ఉన్న వెబ్ కెమెరాలు బిగించడం మంచిది. ప్రస్తుతం ఏఐ విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. దీన్ని ఉపయోగించి మిల్లుల్లో జరుగుతున్న మోసాలను అరికట్టే అవకాశముంది. ప్రతి మిల్లులో సార్ టెక్స్ యంత్రాలు ఉన్నాయి. వాటికి నియంత్రిస్తున్న కంప్యూటర్లను బేరా యంత్రాలను ఏఐతో అనుసంధానం చేసే ధాన్యం ఎంతవేశారు, ఎంత మిల్లింగ్ వచ్చిందని ఎప్పటికప్పుడు లెక్కపెట్టే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి మిల్లును కమాండ్ కంట్రోల్ తరహాలో అనుసంధానం చేసి లెక్కలు ఎప్పటికప్పుడు సెంట్రల్ సర్వర్లో నమోదైతే అక్రమాలకు తావుఉండదు. చౌక ధరల బియ్యం రీసైకిల్ చేసే ఇవ్వకుండా నియంత్రించడానికి ఒక క్వింటాలు ధాన్యం మిల్లింగ్ చేసే ఎంత కరెంటు బిల్లువస్తుందో ఆ రేకారు ఆ మిల్లు సీఎంఆర్ కోటా పెట్టిన మిల్లింగ్ అయిన ఖర్చు అయిన విద్యుత్ వినియోగాన్ని లెక్కిస్తే ఇట్టే దొంగతనాన్ని దొరకబట్టే అవకాశం ఉంది. అధికారులు అలా చేయకపోవడంతోయథేచ్ఛగా సీఎంఆర్ బియ్యంకు రేషన్ బియ్యం వాడుతున్నారు. రేషన్‌దుకాణాల్లో తూకాల్లో మోసాలు కూడా పెరిగిపోయాయి. తూనికల కొలతలశాఖ అధికారులు తీసుకొన్న జీతాలకు న్యాయంచేయడానికి రేషన్ షాపుల్లో తూకాలను తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో ఎలక్ట్రానిక్ కాంటాల్లో రిమోట్ కంట్రోల్‌తో తూకాన్ని నియంత్రించే ఏర్పాట్లు వచ్చాయి. ఇది మార్కెట్లో రూ.1500లకే లభిస్తుంది. ఇది ప్రతి దుకాణదారు రేషన్ షాపుల దుకాణాలు బిగించుకొని వినియోగదారులను మోసం చేస్తున్నా నియంత్రించడంలో అధికారులు విఫలమౌతున్నారు. తెలంగాణలో మహాలక్ష్మి పథకంలో భాగంగా వంట గ్యాస్ సబ్సిడీ చాలావరకు అందడంలేదని మహిళలుఆరోపిస్తున్నారు. రూ.500కు వంటగ్యాస్ ఇస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం చెబుతున్నా కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ 46.90పైసలు మాత్రమే పడుతున్నాయని వినియోగదారులు అంటున్నారు. అర్హులైన తెల్లరేషన్ కార్డుదారులకు రూ.500కు వంటగ్యాసు సిలెండర్లు ఏడాదికి 12ఇస్తారు. సబ్సిడి కావాల్సినవారు ఇకెవైసి చేయాల్సి ఉంటుంది. వార్షిక ఆదాయం పది లక్షలలోపు ఉన్నవారికి సబ్సిడిలభిస్తోంది. ఈ పథకంలో లేని వారు బుక్‌చేస్తే సర్వర్ఒటిపి రాకపోవడంతో ఎక్కువధర పెట్టి బయట కొనుగోలు చేయాల్సివస్తోందని అంటున్నారు. ●

# గుడి దొంగలు!

**ఎ.వి.వి ప్రసాద్**

ఉత్తరాఖండ్

గుడిని మింగేవారు కొందరైతే గుడిలోని లింగాన్ని మింగే వారు మరికొందరంటారు. ఆ ఇద్దరూ ఒకేచోట ఉంటే! మొత్తం ప్రపంచాన్నే మింగేయగలరన్న మాట. దేవాలయాలకు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే పేరు. అవి క్రమంగా ఆర్థిక కేంద్రాలుగా కూడా మారుతూండడంతో దొంగల కన్ను కూడా ఇప్పుడు వాటిపైనే ఎక్కువగా పడుతోంది. వారు బయటి దొంగలుకాదు.. ఇంటి దొంగలే.వారికైతేనే గుడి ఆనుపాన్లు ఎక్కువగా తెలుస్తాయి. చాలా తేలికగా స్వాహా చేయగలుగుతారు. అయోధ్య రామాలయ కుంభకోణం వివాదం ఇంకా కొలిక్కి రాకుండానే బద్రీనాథ్ ఆలయం వార్తల్లోకి రావడం చూస్తే ఎన్నెన్ని ఆలయాల్లో ఇంకెన్నెన్ని కుంభకోణాలు జరుగుతున్నాయో అనే అనుమానం తప్పక కలుగుతుంది. ఉత్తరాఖండ్‌లోని అలకనంద నదీ తీరాన ఉన్న బద్రీనాథ్ ఆలయానికి భక్తులు తండోపతండాలుగా వస్తూంటారు. దానికి తగినట్లుగానే బద్రీనారాయణునికి లభించే విరాళాలు, కానుకలు కూడా విశేషంగానే ఉంటాయి. అందుకే అక్కడా దొంగల కన్ను పడింది. భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయనీ, గుడిలోని ఇంటి దొంగలు కొన్ని కోట్ల మేర స్వాహా చేశారనీ గత వారం వార్తలు గుప్పుమనడంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా ఈ ఆలయం కూడా అందరి నోళ్లలో నానుతోంది. అక్రమాల ఆరోపణలు రాగానే ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే ప్రమోద్ నౌటియార్ అనే ఆలయ ఉద్యోగిని సస్పెండ్ చేసింది. బద్రీనాథ్, కేదార్నాథ్ ఆలయ కమిటీ (బికెటిసి) చైర్మన్‌కు ప్రైవేటు సెక్రటరీగా చేసిన ఆ ఉద్యోగి సారథ్యంలోనే మొత్తం కుంభకోణమంతా సాగిందన్నది వింటే గుడులలో అరాచకాలు ఎలా మితిమీరుతున్నాయో అర్థమవుతుంది. పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వం నియమించిన ముగ్గురుసభ్యుల కమిటీ ఆ ఆరోపణలన్నీ నిజమేనని ప్రాథమికంగా నిర్ధారించగానే ఆ ఉద్యోగిపై వేటు పడింది. 'భైరవ్ సేన' అనే సంస్థ బద్రీనాథ్ ఆలయంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు చేయడంతో తుట్టె కదిలింది. ధామి ప్రభుత్వం గత మంగళవారం త్రిసభ్య కమిటీని నియమించి 15 రోజుల్లో నివేదిక ఇస్తుందని తెలిపింది. సిసి టీవీ ఫుటేజిని పరిశీలించగా ఆరోపణలు నిజమేనని తేలింది. నౌటియాల్ నాయకత్వంలో కొందరు కౌంటింగ్ సిబ్బంది చాలా కాలం నుంచి చేతివాటం ప్రదర్శిస్తున్నారనీ, పెద్ద మొత్తంలోనే సొమ్ము కాజేశారనీ వెల్లడయింది. అయితే దీని వెనుక ఇంకాఎవరెవరు ఉన్నారో తేలవలసిఉంది. భైరవ్ సేన ఆరోపణల ప్రకారం ఆలయం నుంచి దాదాపు 90 కోట్ల విలువైన కానుకలు, నగదు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం చాలా కాలం నుంచే గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నా బికెటిసి పెద్దలకు ఎంతమాత్రం అనుమానం రాకపోవడమే విచిత్రం.దర్యాప్తు కమిటీకి నాయకత్వం వహిస్తున్న గరేవాల్ కమిషనర్ఆనంద్ స్వరూప్ ప్రాథమికంగా చెబుతున్న వివరాలను బట్టి చూస్తే బద్రీనాథ్ ఆలయం నుంచి భారీగానే స్వాహా అయినట్లు తెలుస్తుంది. కోట్లాది భక్తులు పవిత్ర క్షేత్రంగా భావించే బదరీనారాయణుని సన్నిధిలోనే ఇంతపెద్ద కుంభకోణం జరిగితే ఇక మిగిలిన క్షేత్రాల విషయం చెప్పేదేముంది! ఇటువంటిదే గతవారం వెలుగు చూసిన మరో కుంభకోణం మధ్యప్రదేశ్‌లోని బగళాముఖి ఆలయం వ్యవహారం. అగర్ మాల్వా జిల్లాలోని బగళాముఖి ఆలయంలో విరాళాల అక్రమాలు పెద్దమొత్తంలోనే జరిగిన వార్త కూడా ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఈ గుడిలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఉండగానే,ఓ ప్రైవేటు కమిటీ కూడా మొదలయింది. అది భారీగానే విరాళాల వసూళ్లు మొదలు పెట్టింది. వాటికి రసీదులు ఉండవు. భక్తితోనో, భయంతోనో ప్రజలు ఇచ్చే విలువైన కానుకలు గుడికి చేరకుండా పక్కదారి పడుతూంటాయి.ఈ కథ చాలాకాలం నుంచేసాగుతోందట. నడిపేవారు 'పెద్దమనుషులు' కావడంతో భక్తులు కూడా నోరెత్తకుండా కానుకలు సమర్పించుకొని 'తల్లీ! నీ సంపదను నువ్వే రక్షించుకోవా'లంటూ మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయంమొత్తానికి బయటకు రావడంతో కలెక్టర్ నాలుగు రోజుల క్రితం విచారణ కమిటీని నియమించారు.ప్రైవేటు కమిటీ వసూలు చేస్తున్న వెండి, బంగారాలు ఏమవుతున్నాయో కనిపెట్టడానికి నియమించిన ఈ కమిటీ ఏంచెబుతుందో, ఎవరిపై అభియోగాలు మోపుతుందో చూడాలి. పవిత్రతకు నిలయాలుగా భావించే ఆలయాల్లో ఇలా వెలుగు చూస్తున్న అక్రమాలు ఒకటీ రెండూ కావు. మరోవంక అయోధ్య బాలరాముని ఆలయం కుంభకోణం వ్యవహారం కూడా రోజుకో కొత్త మెరుపుతో సాగుతూనే ఉంది. దర్యాప్తు జరుపుతున్న సిట్‌కే కొన్ని విషయాలు అంతుచిక్కడం లేదంటే ఆ కుంభకోణం ఎంత లోతుగా పాతుకుపోయిందో అర్థమవుతుంది. కనీసం 180 రోజుల సిసి టీవీ ఫుటేజి ఉండాలనే నిబంధన ఉన్నా కేవలం 45 రోజులదే లభ్యమవుతున్నదిట. అంటేఅవసరమైన ఆధారాలన్నీ ముందుగానే మాయంచేశారన్న మాట. అంత పకడ్బందీగా అయోధ్య ఆలయంలోనే చౌర్యం జరిగితే ఇంకెక్కడ జరగదనుకోవాలి! సిట్ ప్రాథమిక నివేదిక ప్రకారం ఎనిమిది మందిని తొలుత అరెస్టు చేశారు. రామజన్మభూమి తీర్థ క్షేత్రట్రస్టు ప్రధాన కార్యదర్శిచంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా చేసిన రాజీనామాలను గతవారం ట్రస్టు ఆమోదించింది కానీజరిగిన కుంభకోణంపై ఏ చర్యలు తీసుకొంటుందో చెప్పనేలేదు.అరెస్టయిన అవినాశ్ శుక్లాయే ఈ కేసులో ప్రధాన నిందితుడని సిట్ తేల్చింది. 70 సార్లు నగదును దారి మళ్లించినట్లు కూడా తేలింది. 200కోట్లు పైనే దారిమళ్లిన అయోధ్య కుంభకోణం అసలు గుట్టుతేలాలంటే సిబిఐ రంగంలోకి దిగవలసిందే. గుడులకు ఆదాయం ఇప్పుడు కోట్లల్లో ఉంటోంది. అందువల్ల దానిపై నిఘా కూడా ఆస్థాయిలోనే ఉండాలి. అందుకు ప్రభుత్వాలు, ప్రజలు ధర్మదృష్టితో కదలాలి. ●



బద్రీనాథ్ ఆలయం

# జలప్రళయానికి డ్రాగన్ బీజం

**గన్ని మోహన్**

చైనా

ఆసియాలోనే అతిపెద్ద దేశంఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న చైనా పొరుగున ఉన్న దేశాల భూభాగాలను చేజిక్కించుకోడానికి సకలవిద్యలు ప్రయోగిస్తుందన్నది తెలియంది కాదు. నిన్నమొన్నటివరకూ ఇరుగు పొరుగుదేశాలను ఎగదోసి భారత్‌పై పెత్తనం చేయాలని చూసిన డ్రాగన్‌కు భారత్ చెక్‌పెట్టడంతో ఒక్కసారిగా అవాక్కయింది. అటుచొరబాట్లు, ఇటు ఆక్రమణలతోపాటు ఇప్పుడు తాజాగా జలయుద్ధానికి ప్రణాళికలు వేసింది. చైనా చేపట్టి ప్రారంభించిన ఈప్రాజెక్టుపై భారత్ ఎప్పటి నుంచో అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. టెక్టానిక్ ప్లేట్ల కదలికలు ఎక్కువ ఉండటం వల్ల భూకంప ప్రభావిత ప్రాంతంగా కూడా హెచ్చరించింది. అయితే చైనా మాత్రం దేశ విద్యుత్ అవసరాలకు అనుగుణంగానే ఈప్రాజెక్టు చేపట్టినట్లు చెప్పుకుంటోంది. భారత్‌కు అత్యంత సమీపంలోని టిబెట్ సరిహద్దులో 1.5 లక్షలకోట్ల వ్యయంతో అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించింది. భారత్‌లో బ్రహ్మపుత్రనదిగా ప్రవహించే ఈనది అస్సాం మీదుగా బంగ్లాదేశ్‌లో జమునానది పేరుతో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రాజెక్టు పరీవాహక రాష్ట్రాలకు ఈ మెగా ప్రాజెక్టువల్ల అత్యంత ముప్పు పొంచి ఉందని, పైగా ఈప్రాజెక్టు భూ ప్రకంపనల ప్రాంతంలో ఉందన్న హెచ్చరికలు ఇప్పుడు రెండు దేశాలకు భవిష్యత్ ముప్పును సూచిస్తున్నాయని చెప్పాలి. ప్రపంచంలోనే అత్యంత పెద్దదిగా భావించే త్రీగోర్జెస్ డ్యామ్‌కంటే పెద్దదిగా ఇప్పుడు చైనా మెగా ప్రాజెక్టు నిలుస్తోంది. ఈ ప్రాజెక్టు భూకంప ప్రభావిత ప్రాంతంలో చేపడుతోందని శాస్త్రవేత్తలు చెపుతున్నా జిన్‌పింగ్ సర్కారు చెవికెక్కడం లేదు. ఏడాదికి 300 బిలియన్ కిలోవాట్ అవర్స్‌విద్యుత్ ఉత్పత్తిసామర్థ్యం ఈ ప్రాజెక్టుకుంది. టిబెట్ ప్రాంతంలో బ్రహ్మపుత్ర నదికి యార్లుంగ్ సాంగ్పో అని పేరు అదే భారత్‌లో బ్రహ్మపుత్ర నదిగా వస్తోంది. ఇప్పుడు తాజాగా కడుతున్న ఈ ప్రాజెక్టునుంచి భారీ వరదలు ప్రకృతి విపత్తుల సమయంలో డ్యామ్ నుంచి నీటిని విడుదలచేస్తే అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ వంటి ఈశాన్యరాష్ట్రాలకు జలప్రళయం తప్పదు. భారత్ పరంగా ఈప్రాజెక్టు నుంచి ముప్పు ఉంటుందని పలుసార్లు హెచ్చరించినా కూడా చైనా ఎక్కడా లక్ష్యపెట్టకుండా డ్యామ్ నిర్మిస్తోంది. జలాశయం చుట్టూ ఉన్న ప్రాంతం బలహీనంగా ఉందని, అందువల్ల ఎక్కుడముంపు విలయం ఉంటుందని హెచ్చరించినా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. హిమాలయాల్లో భూకంపాలు తరచూ వచ్చే ప్రాంతంలో పైజన్ ప్రాజెక్టు ఉందని సంప్ పేరిట నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ఎప్పటికీ భారత్‌కు ప్రమాదమే. ఈ ప్రాజెక్టు ప్రాంతంలోనే పదేళ్లక్రితం టిబెట్‌లో 6.9తీవ్రతతో భూకంపం సంభవించింది. అందుకు ధీటుగా అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత్‌కూడా మెగా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలిస్తే జలప్రళయానికి బీజం వేసినట్లుగా ఉంది. విద్యుదుత్పత్తి లక్ష్యమే కాకుండా వర్షాకాలంలో ఏర్పడేభారీ వరదలకు ఎగువప్రాంతంలోని మిగులు నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించేందుకు చైనా ఎంతమాత్రం వెనుకాడదు. భారత్ సరిహద్దుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో మాత్రమే నిర్మిస్తున్న ఈ మెగా హైడల్ ప్రాజెక్టు వల్ల భారత్‌లోని ఈశాన్య ప్రాంతానికి ఎప్పటికీ ముప్పే ఉంటుందని పాలకులకు తెలిసినప్పటికీ చైనా మాత్రం తన మెగా ప్రాజెక్టుతో దూకుడుగా ఉంది. ఇప్పటికే నేపాల్ వైపు సరిహద్దుల్లో గ్రామాలనే నిర్మిస్తున్నట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేసాయి. అదేవిధంగా సైన్యం, మిలిటరీ వాహనాల రాకపోకలకు వీలుగా భారత సరిహద్దుల్లోనే రహదారులను నిర్మిస్తోంది. వీటన్నింటినీ ఎప్పటి కప్పుడు భారత్ వ్యతిరేకిస్తున్నప్పటికీ డ్రాగన్ భిన్న వ్యూహాలతో ముందుకు సాగుతున్నది. నిన్న మొన్నటివరకూ ఇరాన్‌కు సహకరించిందని, మిలిటరీ సాయం చేసిందన్న ఆరోపణలు ఎదుర్కొన్న చైనాతో దగ్గరయ్యేందుకు ఇప్పుడు అమెరికా కూడా ఉవ్విళ్లూరుతోంది. చడీచప్పుడు కాకుండా తన దేశ సరిహద్దులను విస్తరించడంలో చైనా పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. నాటి మావోజెడాంగ్ నుంచి నేటి జిన్‌పింగ్ వరకూ ఈ విస్తరణ కాంక్ష కొనసాగుతూనే ఉంది. సరిహద్దుల ఒప్పందం జరగకపోవడం ఈశాన్యంలోని అరుణాచల్ మాదేనని చెప్పుకోవడం ఈ విస్తరణ కాంక్షల్లోభాగమే. ఆరువేల చదరపు కిలో మీటర్లకు పైగా తమ ప్రాంతం అనిచెప్పుకుంటూ వస్తున్న చైనా ఈ ప్రాంత విస్తరణ కోసమే సైనిక స్థావరాలతోపాటు మిలిటరీ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు, ఇప్పుడు తాజాగా జలవిద్యుత్ మెగా ప్రాజెక్టులు నిర్మించింది. కొండచరియలను బలోపేతం చేసుకోవాలని, రిటైనింగ్ గోడలు నిర్మించి ప్రాజెక్టు పటిష్టతను మరింత పెంచుకోవాలని సొంత శాస్త్రవేత్తలు హెచ్చరించినప్పటికీ చైనా మాత్రం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. ప్రత్యేకించి చైనా ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉన్న భూగర్భ సర్వేశాఖ నిర్వహించిన అధ్యయనంలోనే ప్రాజెక్టు ప్రాంత కింద చురుకైన భూకంప ఫాల్ట్‌లైన్ వెళుతోందని వెల్లడించింది. పైజన్ ఫాల్ట్ ప్రాంతం ఈ భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు కింద నుంచే కొనసాగుతోంది. దీనివల్ల ఇక్కడ నిర్మించే ఆనకట్టలు వంతెనలు, రహదారులు, సొరంగాలు ఇతర మౌలిక వనరుల నిర్మాణ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ ఫాల్ట్‌లైన్ వల్లనే పునాదుల బలంతగ్గిస్థిరత్వం కూడా దెబ్బతింటుందని చైనా శాస్త్రవేత్తలే హెచ్చరించారు. అయినా కూడా చైనా పాలకులకు ఇవేమీ పట్టడంలేదు. జలవిద్యుత్ ఉత్పత్తికోసమే ఈ ప్రాజెక్టు పూర్తిచేసామని, ఇతర దేశాలకు ఎలాంటి ప్రభావం ఉండదని సమర్థించుకుంటున్న చైనా ప్రత్యేకించి భారత్‌వైపే ఎక్కువ ఫోకస్ పెట్టిందనడంలో ఎలాంటి సందేహంలేదు. తాజాగా ఈ మెగా జలవిద్యుత్ ప్రాజెక్టుతో ఈశాన్య రాష్ట్రాలకు చెక్‌పెట్టే వ్యూహంతోనే చైనా వ్యవహరిస్తున్నదని నిస్సందేహంగా చెప్పవచ్చు. ●



జలవిద్యుత్

# రాజధాని పేరు రాజకీయ నినాదమా?




రుద్రరాజు శ్రీనివాస రాజు

ఒక రాష్ట్రానికి రాజధాని అనేది కేవలం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం మాత్రమే కాదు. అది ఆ రాష్ట్ర పరిపాలనకు కేంద్ర బిందువు, ఆర్థికాభివృద్ధికి చోదకశక్తి, పెట్టుబడిదారులకు విశ్వాసానికి ప్రతీక, ప్రజల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే శాశ్వత వ్యవస్థ. అలాంటి రాజధాని అంశం ప్రతి ఎన్నికకు ఒక రాజకీయ నినాదంగా మారితే, నష్టపోయేది ఏ పార్టీ కాదు మొత్తం రాష్ట్రం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన రాజధాని వివాదం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అమరావతే ఏకైక రాజధాని అనే వాదన, మరోవైపు మావిగాన్, విజయవాడ, దొనకొండ వంటి కొత్త ప్రతిపాదనలు. ఈ నేపథ్యంలో అసలు ప్రశ్న ఒక్కటే రాజధాని మార్పు నిజంగా అంత సులభమా? 2014లో రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్‌ను పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పేర్కొన్నారు. అనంతరం అప్పటి ప్రభుత్వం శాసనసభ తీర్మానం ద్వారా అమరావతిని రాజధానిగా నిర్ణయించింది. అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే, వేలాది మంది రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో ల్యాండ్ పూలింగ్ ద్వారా 30 వేల ఎకరాలకు పైగా భూమిని స్వచ్ఛందంగా అప్పగించారు. ప్రభుత్వంతో చట్టబద్ధమైన అభివృద్ధి ఒప్పందాలు చేసుకుని భూములను ఇచ్చారు. ప్రతిఫలంగా అభివృద్ధి చేసిన ప్లాట్లు, మౌలిక సదుపాయాలు, రాజధాని అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలపై వారు విశ్వాసం ఉంచారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన వచ్చింది. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో శాసన, కార్యనిర్వాహక, న్యాయ రాజధానులను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే ఈ ప్రతిపాదన రాజకీయంగా ఎంత చర్చకు దారితీసిందో, అంతకంటే ఎక్కువగా న్యాయపరమైన వివాదాలకు కూడా కారణమైంది. రాజధాని అభివృద్ధి ఆగిపోవడం వల్ల పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు. భూములు ఇచ్చిన రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.రాజధాని మార్పుకు మొదటి పెద్ద ప్రతిబంధకం రైతులతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం. ఇది ఎన్నికల హామీ కాదు. ప్రభుత్వఉత్తర్వులు, చట్టబద్ధమైన అభివృద్ధి ప్రణాళికలు, భూసమీకరణ ఒప్పందాల ఆధారంగా జరిగిన ప్రక్రియ. ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని చూపించి రైతుల నుంచి భూములు తీసుకుంది. అలాంటి పరిస్థితిలో తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ లక్ష్యాన్నే పూర్తిగా మార్చేస్తే, అది ఒప్పంద నమ్మకాన్ని దెబ్బతీసినట్లవుతుంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వానికైనా ప్రజలు భూములు ఇవ్వడానికి వెనుకాడే పరిస్థితి ఏర్పడుతుంది.అమరావతి రైతులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పులో,ప్రభుత్వం రైతులతో చేసుకున్న ఒప్పందా లను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొంది. రాజధాని అభివృద్ధి విషయంలో ప్రభుత్వం తన బాధ్యత లను విస్మరించకూడదని స్పష్టం చేసింది. ఈ తీర్పు మీద తదుపరి న్యాయపరమైన పరిణామాలు ఎలాఉన్నా, రైతుల ఒప్పందాలకు న్యాయపరమైన ప్రాధాన్యం ఉందనే విషయం స్పష్టమైంది. ఇటీవల కేంద్రప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో సవరణ చేసి అమరావతి పేరును రాజధానిగా చేర్చిందని, రాష్ట్రపతి ఆమోదం గెజిట్ ప్రకటన వెలువడిందని ప్రభుత్వం పేర్కొంటోంది. చట్టపరంగా రాజధాని పేరు స్పష్టంగా నమోదై ఉండటం వలన భవిష్యత్తులో దానిని మార్చాలంటే కేవలం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం సరిపోదు. మళ్లీ పార్లమెంటులో చట్ట సవరణ అవసరమయ్యే అవకాశం ఉంటుంది. అంటే రాష్ట్ర రాజకీయ సంకల్పం ఒక్కటే సరిపోదు.కేంద్రప్రభుత్వ మద్దతు, పార్లమెంట్ ఆమోదం కూడా అవసరమవుతుంది.అయితే పార్లమెంట్‌లో ప్రధాన ప్రతి పక్షంతోసహా అనేక రాజకీయ పక్షాలు అమరావతిని సమర్ధించాయి. అయితే మరలా పార్లమెంట్‌లో రాజధాని మార్పుకు ఇవి ముందుకు వచ్చే అవకాశం ఉందా? ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి గణనీయమైన నిధులు కేటాయించింది. కేంద్రహామీతో ఆర్థిక సంస్థల నుంచి రుణాలు కూడా సమకూరాయి. ఇలాంటి పరిస్థితిలో నిర్మాణంలో ఉన్న రాజధానిని పూర్తిగా మార్చాలని ప్రతిపాదిస్తే అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఇప్పటికే ఇచ్చిన నిధుల పరిస్థితి ఏమిటి? తీసుకున్న రుణాల బాధ్యత ఎవరిది? కొనసాగుతున్న ప్రాజెక్టుల భవిష్యత్తు ఏమిటి?కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఎలా ఉంటుంది? ఇవి రాజకీయ ప్రశ్నలు మాత్రమే కాదు, ఆర్థిక, పరిపాలనా ప్రశ్నలు కూడా. కొనసాగుతున్న ప్రాజెక్టుల భవిష్యత్తు ఏమిటి? కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఎలా ఉంటుంది? ఇవి రాజకీయ ప్రశ్నలు మాత్రమే కాదు, ఆర్థిక, పరిపాలనా ప్రశ్నలుకూడా. ఒక ప్రాంతం రాజధానిగా ప్రకటించిన తర్వాత పెట్టుబడులు రావడం ప్రారంభమవుతుంది. రోడ్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ఐటీ సంస్థలు, వాణిజ్య సముదాయాలు, నివాస ప్రాజెక్టులు ఇవి అన్నీ దీర్ఘకాలిక ప్రణాళికలతో వస్తాయి. రాజధాని తరచూ మారుతుందనే భావన ఏర్పడితే పెట్టుబడిదారులు సహజంగానే వెనక్కి తగ్గుతారు.పెట్టుబడులకు రాజకీయ స్థిరత్వం ఎంత అవసరమో, విధాన స్థిరత్వం కూడా అంతే అవసరం. ప్రతి ప్రభుత్వం రాజధాని మార్చితే? ఇలా ప్రతి ఎన్నిక తర్వాత రాజధాని మారితే రాష్ట్ర పరిపాలన స్థిరత్వం ఎక్కడ ఉంటుంది? రాజధాని అనేది ఐదేళ్ల రాజకీయ అజెండా కాకూడదు. అది కనీసం యాభై సంవత్సరాల దూరదృష్టితో నిర్మించాల్సిన వ్యవస్థ. ప్రతిపక్షం రాజధాని నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తే, ప్రజాస్వామ్యంలో దానికి స్పష్టమైన మార్గాలున్నాయి.దానికై నిష్పాక్షిక విచారణ జరగాలి. సాక్ష్యాలు ఉంటే దర్యాప్తు జరగాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రజాధనం దుర్వినియోగమై ఉంటే తిరిగి రాబట్టాలి. కానీ అవినీతి ఆరోపణలకు పరిష్కారం రాజధానినే మార్చడంకాదు. తప్పు జరిగి ఉంటే దానిని సరిదిద్దాలి. మొత్తం వ్యవస్థనే మార్చేయడం సరైన ప్రజాపాలన కాదు.ప్రభుత్వాలు మారడం ప్రజాస్వామ్యంలో సహజం. కానీ ప్రభుత్వం ఇచ్చిన చట్టబద్ధమైన హామీలపై ప్రజలకు విశ్వాసం లేకపోతే, భవిష్యత్తులో ఏ అభివృద్ధి ప్రాజెక్టు కూడా ముందుకు సాగదు. పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టారు. ఆర్థికసంస్థలు రుణాలు ఇవ్వడంలో వెనుకడుగు వేస్తాయి. అందుకే రాజధాని అంశంలో రాజకీయాల కంటే ప్రజా విశ్వాసమే ముఖ్యమైనది. ముగింపు రాజధాని మార్పుఅనేది కేవలం ఒక ప్రకటనతో జరిగిపోయే విషయం కాదు. దానికి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, ఒప్పందపరమైన, ఆర్థిక, పరిపాలనా, రాజకీయ అంశాలు అన్నీ ముడిపడి ఉంటాయి. ప్రత్యేకించి రైతులతో జరిగిన భూసమీకరణ ఒప్పందాలు, న్యాయస్థానాల తీర్పులు, కేంద్ర నిధులు, రుణాలు, కొనసాగుతున్న నిర్మాణాలు, పెట్టుబడిదారుల విశ్వాసం, పార్లమెంట్ స్థాయిలో జరిగిన చట్టపరమైన మార్పులు ఇవన్నీకలిసి రాజధాని మార్పును అత్యంత సంక్లిష్టమైన అంశంగా మారుస్తాయి. అందువల్ల రాజధాని గురించి చర్చజరిగితే అది ప్రాంతాలమధ్య పోటీగాకాకుండా, రాష్ట్రభవిష్యత్తు, ప్రజా విశ్వాసం, చట్టబద్ధత, అభివృద్ధి అనే నాలుగుసూత్రాల ఆధారంగా జరగాలి. రాజధాని ఒక రాజకీయ నినాదంకాదు.అది తరతరాల భవిష్యత్తును నిర్ణయించే రాష్ట్ర నిర్మాణానికి పునాది. ఆ పునాదిని ప్రతి ఎన్నికకు మార్చడంకంటే, దానిని బలోపేతంచేయడం రాష్ట్రప్రయోజనాలకు మరింత అనుకూలమైన మార్గం.ఇప్పటికైనా రాజధాని రాజకీయాలకు ముగింపుపలికి, అభివృద్ధి రాజకీయాలకు శ్రీకారం చుట్టవలసిన సమయం ఆసన్నమైంది. ●



# భారత్‌లో భారీగా న్యూజిలాండ్ పెట్టుబడులు



## వచ్చే 15 యేళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు హామీ

## 10 ఒప్పందాలు సహా 18 కీలక నిర్ణయాలు

## ఇండోపసిఫిక్ ప్రాంత భద్రతపై ఉభయ ప్రధానుల చర్చలు

## సముద్ర భద్రతలో వ్యూహాత్మక భాగస్వామ్యం

**ఆక్లాండ్,జులై 11:** భారత్, న్యూజిలాండ్ తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్ చేసుకున్నాయి. రాబోయే నాలుగేళ్లలో రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత విస్తరించేందుకు వ్యూహాత్మక భాగస్వామ్య రోడ్‌మ్యాప్ 2030ని ఆవిష్కరించాయి. 2030 నాటికి వస్తువులు, సేవల రంగాల్లో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సుమారు రూ.35 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాయి. రాబోయే 15 యేళ్ల పాటు భారత్‌లో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ హామీ ఇచ్చింది. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న, ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో విస్తృత చర్చలు జరిపారు. ఈ భేటీలో 10 ఒప్పందాలతో సహా మొత్తం 18 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇద్దరు ప్రధానులు ఇండోపసిఫిక్‌ప్రాంత భద్రత, స్థిరత్వంపై విస్తృతంగా చర్చించారు. స్వేచ్ఛా యుతమైన, అందరికీ అందుబాటులో ఉండే, అభివృద్ధి చెందే ఇండోపసిఫిక్ ప్రాంత నిర్మాణానికి కలిసి పనిచేయాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటిం చారు. ప్రతి దేశం సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం, అంతర్జాతీయ నిబంధనల ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయడం అత్యంత అవసరమని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ సముద్ర చట్టాలకు అనుగుణంగా సముద్ర మార్గాల్లో నౌకల రాకపోకలు, విమానాల స్వేచ్ఛాయుత ప్రయాణం నిరంతరంగా కొనసాగాల్సిన అవసరాన్ని ఇరు దేశాలు నొక్కి చెప్పాయి. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందం సూత్రాలను గౌరవించాలని అభిప్రాయపడ్డాయి. ఇండోపసిఫిక్‌లో పెరుగుతున్న వ్యూహాత్మక సవాళ్ల దృష్ట్యా సముద్ర భద్రత రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని భారత్, న్యూజిలాండ్ నిర్ణయించాయి. దీనికోసం ప్రత్యేక మారిటైమ్ సెక్యూరిటీ డైలాగ్ ఏర్పాటు చేయాలని అంగీకరించాయి. ఈ వేదిక ద్వారా సమాచారమార్పిడి, సమన్వయం, సంయుక్త చర్యలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే పరస్పర లాజిస్టిక్ సహకార ఒప్పందం ద్వారా ఇరు దేశాల నౌకాదళాల మధ్య కార్యాచరణ సామర్థ్యం మరింత పెరుగుతుందనిఅధికారులు భావిస్తున్నారు.

**వాణిజ్యానికి కొత్త ఊపు**

ఇటీవల కుదిరిన భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) అమలుకు వేగం తీసుకురావాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ ఒప్పందం త్వరగా అమల్లోకి వచ్చేలా అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రధానులు అంగీకరించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వస్తు, సేవల వాణిజ్యాన్ని 700కోట్ల న్యూజిలాండ్ డాలర్లు, అంటే సుమారు రూ.35 వేల కోట్లకు పెంచే లక్ష్యాన్ని నిర్దేశించుకు న్నారు. పెట్టుబడులు, సాంకేతికత, వ్యవసాయం, విద్య, ఆవిష్కరణలు, సేవల రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు.

**ఐక్యరాజ్యసమితి సంస్కరణలకు మద్దతు**

ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితిలో సమగ్ర సంస్కరణలు అవసరమని మోడీ,లక్సన్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సంస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయా లంటే ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వాటి నిర్మాణంలో మార్పులు అవసరమని పేర్కొన్నారు.

**కస్టమ్స్, పర్యాటక రంగాల్లో కీలక నిర్ణయాలు**

విశ్వసనీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు కస్టమ్స్ ప్రక్రియలను సరళీకృతం చేసే అథరైజ్డ్ ఎకనామిక్ ఆపరేటర్స్ మ్యూచువల్ రికగ్నిషన్ అరేంజ్‌మెంట్ అమలుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పర్యటక రంగంలో అవగాహన ఒప్పందాన్ని స్వాగతించిన ఇరు దేశాలు, భారత్, న్యూజిలాండ్ మధ్య ప్రత్యక్ష నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు విమానయాన సంస్థలు ముందుకు రావాలని కోరాయి.

**వ్యవసాయం, పాడి పరిశ్రమల్లో సహకారం**

ఉద్యానవనం, అటవీ, పశుసంవర్ధక, పాల ఉత్పత్తి రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించారు. కివీ పండ్లు, యాపిల్స్, తేనె ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నారు. భారత్‌లో కివీ పరిశోధన, ఉత్పత్తి కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుకు కూడా సహకరించనుంది న్యూజిలాండ్.

పశుసంవర్ధక, పాడి పరిశ్రమలపై ప్రత్యేక అవగాహన ఒప్పందం కూడా కుదిరింది. ప్రధాని నరేంద్ర మోడీ మూడు దేశాల విదేశీ పర్య టనలో చివరి దశగా ఆక్లాండ్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో ఇండోపసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.



## నన్ను చంపితే ఇరాన్ పూర్తిగా ధ్వంసమే

### వెయ్యి క్షిపణులను లోడ్‌చేసి పెట్టాం
### తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

**వాషింగ్టన్, జులై 11:** అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో హెచ్చరిక చేశారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే వెయ్యి క్షిపణులను లోడ్ చేసి పెట్టామని వెల్లడించారు. ఆ వెంటనే వేలాదిగా విరుచుకుపడతాయని, అందుకు సంబంధించి సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్న దానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకుముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్‌పై బాంబుల వర్షంకురిపించాలని సూచనలు జారీచేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. హార్ముజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్‌పై దాడులు చేయడం.. ఆ వెంటనే ఆదేశంపై అమెరికా క్షిపణులవర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధ మేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్‌చేసిన వ్యాఖ్యలనుకూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. 'యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్నిఉల్లంఘిస్తారో..అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగాఉంటాం' అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

### ఇరాన్ అణుకేంద్రాల వద్ద
## మళ్లీ కార్యకలాపాలు
### పశ్చిమాసియాలో భగ్గుమన్న ఉద్రిక్తతలు

**టెహ్రాన్, జులై 11**: పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. ఈ సమయంలో ఇరాన్ అణు కేంద్రాల వద్ద మళ్లీ కార్యకలాపాలు మొదలయ్యాయని, ఈ విషయం ఉపగ్రహ చిత్రాల ఆధారంగా తెలిసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇటీవల అమెరికా దాడుల్లో అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటిని పునర్నిర్మించేందుకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఇనిస్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ ఈ చిత్రాలను విశ్లేషించింది. హార్ముజ్‌లో వాణిజ్య నౌకలపై దాడుల నేపథ్యంలో ఇరాన్‌తో డీల్ ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దానికిముందే, జూన్ చివర్లోనే ఇరాన్ ఈ అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మాణ పరికరాలు, వాహనాల కదలికలు, దెబ్బతిన్న నిర్మాణాల్లో మార్పులు వంటివి అణు కేంద్రాల వద్ద కనిపించాయి. దీంతో అణు కార్యకలాపాల పునుద్ధరణ కోసం ఇరాన్ ప్రయత్నాలు ప్రారంభించిందా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే నష్టాన్ని అంచనా వేసేందుకు శిథిలాలను తొలగించే చర్యకూడా అయి ఉండొచ్చని తెలుస్తోంది. స్పష్టంగా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయన్నది మాత్రం తెలియరాలేదు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని, శుద్ధి చేసిన యురేనియాన్ని వారి వద్ద ఉంచుకోకూడదన్న కీలక షరతులతోనే తమ మధ్య ఒప్పందం కుదిరిందని అమెరికా చెబుతోంది. హార్ముజ్‌పై నియంత్రణ కోల్పోతే అణు కార్యక్రమం వంటి కీలకాంశాల్లో అగ్రరాజ్యానికి తలొగ్గాల్సి వస్తుందనే ఆందోళన ఇరాన్‌లో ఉంది. ఈ క్రమంలోనే తన పట్టు నిలుపుకొనేందుకు హార్ముజ్‌ను ఇరాన్ ఒక ఆయుధంగా వాడుకోవాలని చూస్తోందని, తన అనుమతి లేకుండా ప్రయాణిస్తోన్న నౌకలపై దాడులు చేస్తోందనే వాదనా ఉంది. తాజా ఘర్షణలకు అదే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### మహిళలకు ఓటు హక్కు
## కల్పించినదేశం న్యూజిలాండ్
### ఆక్లాండ్ సదస్సులో ప్రధాని మోడీ ప్రశంసలు

**ఆక్లాండ్,జులై 11:** మహిళలకు మొట్టమొదట ఓటు హక్కు కల్పించిన దేశం న్యూజిలాండ్ అని నేడు న్యూజిలాండ్ సమాజానికి మహిళలు పెద్ద ఎత్తున సేవలందిస్తున్నారని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. భారతదేశం కూడా మహిళా నేతృత్వ అభివృద్ధి అనే మంత్రంతో మహిళలకు కొత్త అవకాశాల తలుపులు తెరుస్తోంది. న్యూజిలాండ్‌లో వీధులు కూడా భారతీయ నగరాలను గౌరవిస్తాయి. ఎక్కడో ఖండాలా, ఎక్కడో బొంబాయి హిల్స్, ఎక్కడో కోరమండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ ఇలా ఎన్నో పేర్లు ఉన్నాయి. అక్కడ నివసిస్తున్న మీరుకూడా పూర్తిగా ఒక కివీగా మారిపోయారు. నేను ఏ న్యూజిలాండ్ నాయకుడిని కలిసినా, ఆయన మిమ్మల్నందరినీ ప్రశంసిస్తారు. ఆ ప్రశంస మీకే దక్కుతుంది, నేను గర్వంగా తల ఎత్తుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రధాని మోడీ బాల్యాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఒక సాధారణ నేపథ్యం నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగారు. ఆయన లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేయడంలో సహాయపడ్డారు. ఆయన మన కాలంలోని అత్యంత ముఖ్యమైన నాయకులలో ఒకరు, న్యూజిలాండ్‌కు నిజమైన స్నేహితుడని కొనియాడారు.



## జమిలి ఎన్నికలు 2029 నుంచే
### జెపిసి ఛైర్మన్ జెపి చౌదరి

**న్యూఢిల్లీ, జూలై 11:** లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ 2029లో కచ్చితంగా సాకారమవుతుందని పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జెపిసి) చీఫ్, కేంద్ర మాజీ మంత్రి పిపి చౌధరి ఆశాభావం వ్యక్తంచేశారు. ఒక దేశంఒకే ఎన్నిక బిల్లుపై గోవా సిఎం ప్రమోద్ సావంత్, మంత్రి వర్గంతో చర్చల కోసం గోవాలో జెపిసి సమావేశ మైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లా డారు. వివిధ అవకాశాలు, ఆలోచనలపై అధ్యయనం చేస్తున్నామని అన్ని రాజకీయ పార్టీలకు ఆమోదయోగ్యమైన విధానం రూపకల్పనకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఒకేసారి ఎన్నికలకు పార్టీలు, కొందరు సిఎంలు స్వచ్ఛందంగా అంగీ కరిస్తే కొన్నిరాష్ట్రాల ఎన్నికలను ముందుగానే.. అంటే2029లో నిర్వహించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. జమిలి ఎన్నికలను ఎలా నిర్వహిస్తే బాగుంటుంది ఎదురయ్యే సవాళ్లు ఏమిటి వాటిని ఎలా పరిష్కరించాలో గోవా ముఖ్యమంత్రి అభిప్రాయాలు తెలుసుకున్నామనితెలిపారు. జెపిసి ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణా, ఢిల్లీల్లో పర్యటించిందని రాజ్యాంగ నిపుణులు, విద్యావేత్తలు, పౌరసమాజం సంస్థలు తదితరులను కలిసిందనిచెప్పారు. తదుపరి లోక్‌సభ ఎన్నికలుజరిగే 2029నాటికి ఒక దేశం ఒకే ఎన్నిక కార్యరూపం దాలుస్తుందన్న సంకేతాలు అందుతున్నాయని తెలిపారు.

## బహామాస్‌లో కుప్పకూలిన విమానం



### 10 మంది స్పాట్‌లోనే మృతి, పలువురికి గాయాలు

**నసావు,జులై 11:** కరీబియన్ దేశమైన బహామాస్ దీవుల్లో ఒక ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక చిన్న ప్రైవేట్ విమాన ప్రమాదంలో ఏకంగా 10 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ప్రమాదం నార్త్ ఆండ్రోస్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఇది బహామాస్ రాజధాని నసావుకు పశ్చిమ దిశలో సముద్ర తీరానికి సమీపంలో ఉంటుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక రక్షణ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విమానంలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడినట్లు బహామాస్ ప్రధాన మంత్రి ఫిలిప్ బ్రేవ్ డేవిస్ మొదట ప్రకటించినప్పటికీ ఆ తర్వాతజరిగిన అత్యవసర ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, తీవ్ర గాయాలకారణంగా ఆవ్యక్తికూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు ధృవీకరించారు. మరణించిన వారి వివరాలను అధికారులు ఇంకా అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ తీరని విషాదం దేశమంతా ఎంతో సంతోషంగా పండుగ జరుపుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం ఆ దేశాన్ని తీవ్ర శోకసంద్రంలో ముంచేసింది. ఈ ఘటనపై బహామాస్ ప్రధాన మంత్రి ఫిలిప్ బ్రేవ్ డేవిస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బహామాస్ ప్రజలంతా దేశ 53వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా జరుపుకుంటున్న తరుణంలో ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరమని, ఈ పండుగ రోజు కాస్తా దేశానికి పెద్ద శోకదినంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విమానం రాజధాని నసావులోని ప్రసిద్ధ లిండన్ పిండ్లింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికులతో బయలుదేరింది. ఇది సాన్ ఆండ్రోస్ వైపు వెళ్తుండగా మార్గమధ్యంలోనే అదుపుతప్పి నార్త్ ఆండ్రోస్ సమీపంలో కుప్పకూలిపోయింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక లోపం తలెత్తిందా లేక వాతావరణం అనుకూలించలేదా అనే కోణంలో దర్యాప్తు సంస్థలు ఆధారాలు సేకరిస్తున్నాయి. ఒకే రోజులో రెండు ప్రమాదాలు ఈ ఘోర ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే బహామాస్ ఇంధన, యుటిలిటీస్, ఏవియేషన్ మంత్రిత్వ శాఖ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రమాదానికి గురైన విమాన సంస్థ ఫ్లెమింగో ఎయిర్‌కు చెందిన ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికేట్‌ను ప్రభుత్వం తక్షణమే సస్పెండ్ చేసింది. అంటే ఆ సంస్థకు చెందిన అన్ని విమానాల సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. విమాన ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుగుతున్నందున, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఈ ముందస్తు జాగ్రత్త చర్య తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే కేవలం ఈ ఒక్క ప్రమాదమే కాకుండా, ఫ్లెమింగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన మరో విమానంలో కూడా భద్రతా లోపం తలెత్తడం ఈ సస్పెన్షన్‌కు దారితీసింది.

## ముందుగా వందేమాతరం, తర్వాత జనగణమన

### గీతాలను తప్పక ఆలపించాలి ఆ తర్వాతే రాష్ట్ర గీతం
### స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ,జులై 11**: జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందే మాతరం, రాష్ట్ర గీతాల ఆలాపన విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు ఈ మేరకు ఈ నెల 9న ఆదేశాలు పంపింది. అధికారిక కార్యక్రమాలలో జాతీయ చిహ్నాల గౌరవాన్ని కాపాడటం, ఏకరూపతను పాటించడంకోసం ఈ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులలో ఇప్పటికే ఉన్న ఆదేశాలను పునరుద్ఘాటిస్తూ, కొన్ని కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. జాతీయ గీతం పాడేటప్పుడు లేదా దాని సంగీతం వినిపించినప్పుడు ప్రేక్షకులు తప్పనిసరిగా నిలబడి అటెన్షన్‌లో ఉండాలి. అయితే, వార్తా చిత్రాలు (న్యూస్‌రీల్స్) లేదా డాక్యుమెంటరీల ప్రదర్శన సమయంలో జాతీయ గీతం వస్తే, ప్రదర్శనకు అంతరాయం కలగకుండా ఉండేందుకు నిలబడాల్సిన అవసరం లేదని మినహాయింపు ఇచ్చింది. ఇది ఎప్పటి నుంచో ఉన్న నిబంధన అయినప్పటికీ, దీన్ని మరోసారి గుర్తుచేసింది. అధికారిక కార్యక్రమాల్లో రాష్ట్ర గీతంతో పాటు జాతీయ గేయం, జాతీయ గీతం కూడా ఆలపించాల్సి వస్తే, పాటించాల్సిన క్రమంపై హోంశాఖ స్పష్టతనిచ్చింది. దీని ప్రకారం.. ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమనలను పూర్తిగా ఆలపించాలి. ఈ రెండు పాడడం పూర్తయ్యాక మాత్రమే ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అధికారిక రాష్ట్ర గీతాన్ని పాడాల్సి ఉంటుంది. జాతీయ గౌరవాన్ని కాపాడేందుకే ఈ ప్రాధాన్యత క్రమాన్ని నిర్దేశించినట్లు కేంద్రం పేర్కొంది. విదేశీ ప్రముఖులు, ప్రతినిధులు హాజరయ్యే కార్యక్రమాల విషయంలోనూ ప్రోటోకాల్‌ను హోం శాఖ వివరించింది. గౌరవ వందనం స్వీకరించే విదేశీ అతిథి ఉన్నప్పుడు, మొదట ఆ దేశ జాతీయ గీతాన్ని పూర్తిగా ప్లే చేసి, ఆ తర్వాత భారత జాతీయ గీతాన్ని ప్లే చేయాలి. విదేశీ దౌత్య కార్యాలయాలు నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలకు కూడా ఇదే తరహా నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది.

బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతీయ గేయం హోదాను కలిగి ఉండగా, రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన జాతీయ గీతంగా గుర్తింపు పొందిందని ఈ ఆదేశాల్లో మరోసారి గుర్తుచేశారు. ఈ యేడాది ఫిబ్రవరిలో వందేమాతరం పూర్తి ఆలాపనపై ఇచ్చిన ఆదేశాలకు కొనసాగింపుగా తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జాతీయ గీతం, గేయాలకు సంబంధించిన అధికారిక పాఠాలు, సరైన ఉచ్చారణ, లిపి వంటి వివరాలు తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని హోం శాఖ తెలిపింది. జెండా వందనం వంటి అంశాలలో ప్రజల విచక్షణకే వదిలేస్తున్నామని, సందర్భం లేకుండా విచక్షణారహితంగా జాతీయ గీతాన్ని పాడటం లేదా ప్లే చేయడాన్ని మానుకోవాలని సూచించింది. దేశ సాంస్కృతిక వారసత్వం, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, జాతీయ చిహ్నాల పట్ల గౌరవాన్ని, దేశ ప్రజలలో ఐక్యతను పెంపొందించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

## ఆస్ట్రేలియాలో పెచ్చుమీరుతున్న జాత్యహంకారం

### ట్రక్కుడ్రైవర్లకు విద్వేషకారుల హెచ్చరికలు


**కాన్‌బెర్రా, జులై 11:** భారత్, ఆస్ట్రేలియాలు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతానికి కృషి చేస్తున్నప్పటికీ అక్కడ భారతీయులు ఎదుర్కొంటున్న తీవ్రమైన జాత్యహంకార సమస్య ఎవరి దృష్టికి రాకుండా ఉండిపోయింది. ఆస్ట్రేలియాలోని భారతీయ ట్రక్కు డ్రైవర్లపై జాత్యహంకార దాడులు, దూషణలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.

వారిని చంపుతామని లేదా అంతకంటే ఘోరంగా హింసిస్తామని చాలా మంది బెదిరింపులకు దిగుతున్నారు. వీరిలో చాలా మందికి ఇప్పటికే ఆస్ట్రేలియా పౌరసత్వం ఉన్నప్పటికీ జాత్యహంకార దూషణలకు గురవుతున్నారు. ఆస్ట్రేలియాలో రవాణా రంగానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ట్రక్కులు నడకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చాలా సాఫీగా సాగిపోతున్నట్టు కనిపించే ఈ రంగం వెనుక పరిష్కారం లేని ఓ పెద్ద సమస్య దాగి ఉంది. ఇది వలస డ్రైవర్ల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తాము ఎదుర్కొంటున్న జాత్యహంకార దూషణలను, వ్యవస్థాగత దోపిడీని భారతీయ డ్రైవర్లు ఎబిసి న్యూస్‌తో పంచుకున్నారు. డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉన్న సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి తాము సేవలను అందిస్తున్నందుకే ఈ వివక్ష ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. ఆస్ట్రేలియా రవాణా రంగంలో ప్రస్తుతం భారతీయ డ్రైవర్లు అత్యంత ముఖ్యమైన వలస శ్రామిక శక్తిగా మారారు.

అయినప్పటికీ వీరు నిరంతరం వేధింపులకు గురవుతున్నారు. పిప్పల్ సింగ్ అనే భారతీయ ట్రక్కు డ్రైవర్ కమ్యూనికేషన్ రేడియో ద్వారా తమకు వచ్చిన బెదిరింపులను రికార్డ్ చేశారు. 'ఇక్కడ త్వరలోనే అంతర్యుద్ధం రాబోతోంది మేము భారతీయ పురుషులందరినీ చంపేస్తాం పిల్లలను పాతిపెట్టి, మహిళలను అమ్మేస్తాం శ్వేతజాతీయుల ఎదుట మురికి భారతీయులు నిలబడలేరు' అని ఓ ఆస్ట్రేలియన్ చేసిన బెదిరింపులు అందులో రికార్డయ్యాయి.'మంచి భారతీయుడు అంటే చచ్చినవాడే అని మరొకడు మాట్లాడాడు. ఇటువంటి బెదిరింపులతో చాలా మంది భారతీయ ట్రక్కు డ్రైవర్లు ప్రస్తుతం రేడియోను ఉపయోగించడం మానేశారు. సోషల్ మీడియాలోనూ డ్రైవర్లను ఎగతాళి చేస్తూ జాత్యహంకార మీమ్స్ షేర్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా ఆస్ట్రేలియాలో అత్యంత వేగంగా పెరుగుతున్న వలసదారుల సమూహంలో భారతీయులు మొదటి స్థానంలో ఉన్నారు. వీరిలో చాలామంది రవాణా రంగంలో దీర్ఘకాలంగా ఉన్న కార్మికుల కొరతను తీరుస్తున్నారు. అంతర్జాతీయ రోడ్డు రవాణా సంఘం అంచనా ప్రకారం 2024లో అనుభవజ్ఞులైన డ్రైవర్లు పదవీ విరమణ చేయడం, ఆస్ట్రేలియా యువత ఈ వృత్తిపై ఆసక్తి చూపకపోవడంతో సుమారు 28వేల మంది భారీ వాహన డ్రైవర్ల కొరత ఉంది. భారత్‌లో వ్యవసాయం, రవాణా పరిశ్రమతో అనుబంధం కారణంగా, చాలా మంది సిక్కు, పంజాబీ వలసదారులకు ట్రక్కు డ్రైవింగ్ సహజంగానే అలవడింది.'ఇది నా రక్తంలోనే ఉందని జస్విందర్ అనే ట్రక్కు డ్రైవర్ అన్నారు. ఇండియాలో మా నాన్నకు సొంత రవాణా సంస్థ ఉండేది, అందుకే నాకు మొదటి నుంచీ ట్రక్కులంటే చాలా ఇష్టం అని ఆయన చెప్పారు.

# సంక్షిప్త వార్తలు

## వెనెజులా విలయం.. నాలుగు వేలు దాటిన మృతులు



**కారకస్, జులై 11:** వెనుజులాలో గత నెల 24న సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో ఇప్పటివరకు 4వేలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. 16,740 మంది గాయపడగా.. భవన శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నారు. ఇంకా చాలా మంది జాడ తెలియరాలేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు శుక్రవారం కారకస్‌లో 3.0 తీవ్రతతో భూకంపం సంభవించడంతో స్థానికంగా ఉన్న భవనాలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## పెళ్లివిందులో మటన్‌లేదని ఘర్షణ


**పాట్నా,జులై 11:** బీహార్‌లో ఓ నిఖా విందులో హింస చోటుచేసుకున్నది. వధూవరులకు చెందిన కుటుంబసభ్యులు కొట్టుకున్నారు. విందు సమయంలో ఈ ఘటన జరిగింది. పెళ్లి విందులో మటన్ పెట్టలేదని వరుడి వర్గం వాగ్వాదానికి దిగింది. అయితే ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. సహ్రస జిల్లాలోని సిమ్రి భక్త్యార్‌పూర్ గ్రామంలో ఈ కొట్లాట జరిగింది. అమ్మాయి, అబ్బాయి తరపున బంధులు తన్నుకున్న ఘటనలో మొత్తం 12 మంది గాయపడ్డారు. విందులో మటన్ పెడుతామని చెప్పిన అమ్మాయి తరపున కుటుంబీకులు హామీ ఇచ్చారు, కానీ భోజనంలో చికెన్ పెట్టడాన్ని వ్యతిరేకించారు.

## బెటాలియన్ కమాండింగ్ అధికారిగా భారత సంతతి యువతి



**న్యూఢిల్లీ:** భారతీయ సంతతికి చెందిన 17 ఏళ్ల అమ్మాయి రిద్ధి చౌహాన్ అమెరికాలో దూసుకెళుతోంది. న్యూయార్క్‌లోని తన స్కూల్‌లో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నది. నేవీ జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్‌కు ఆమె లీడర్ అయ్యింది. ప్రస్తుతం అమెరికా యువతకు ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు. న్యూయార్క్‌లోని బెంజిమన్ కార్డోజో హై స్కూల్‌కు నేవీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అయ్యారు. ఎన్‌జేఆర్‌ఓటీసీ ప్రోగ్రామ్‌లో హయ్యస్ట్ ర్యాంక్ స్టూడెంట్‌గా నిలిచిందామె. ఆ గ్రూపులోఉన్న సుమారు 300మంది క్యాడెట్లకు ఆమె నాయకత్వం వహిస్తున్నది. బెటాలియన్ ఆపరేషన్స్, ట్రైనింగ్, స్టూడెంట్ వెల్ఫేర్ చూసుకుంటా, అకాడమిక్ చదువులోనూ నిమగ్నమవుతోంది.

## ప్రశాంత్‌కిశోర్‌పై అభ్యర్థిని మార్చిన బిజెపి



**పాట్నా,జులై 11:** బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక పోరు నాటకీయ మలుపు తీసుకున్నది. నామినేషన్ దాఖలు చేసిన ఒక రోజు తర్వాత తన అభ్యర్థిని బిజెపి ఆకస్మికంగా మార్చింది. జన సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్‌పై సాధారణ నేతను పోటీకి దించింది. అభిషేక్ బంటీ స్థానంలో నీరజ్ కుమార్ సిన్హాను తమ అభ్యర్థిగా బిజెపి ప్రకటించింది. దీంతో తొలిసారి ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రశాంత్ కిషోర్‌తో నీరజ్ కుమార్ సిన్హా తలపడనున్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నికైన తర్వాత బంకీపూర్ స్థానాన్ని ఖాళీ చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. బిజెపికి కంచుకోట అయిన ఈ స్థానంలో పోటీ చేసే అభ్యర్థిగా తొలుత అభిషేక్ బంటీ పేరు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం సీఎం సమ్రాట్ చౌదరి, పార్టీ అగ్ర నేతల సమక్షంలో ఆయన అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. వ్యక్తిగత కారణాల్ల వల్ల ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నట్లు అభిషేక్ బంటీ వెల్లడించారు.

# అధిష్ఠానం ఆదేశిస్తే హరీశ్‌పై పోటీ చేస్తా

## రేవంత్‌రెడ్డి 117 సీట్లు గెలిచేలా ఆట మొదలుపెట్టారు

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చిట్‌చాట్

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** 'నేను సంగారెడ్డిలో పోటీ చేయను అన్నాను కానీ, వేరే చోట పోటీ చేయనని చెప్పలేదు, అధిష్ఠానం హరీశ్‌పై పోటీ చేయమంటే సిద్ధమే సిద్దిపేట ఎన్నిక బరిలో నిలబడి పోటీ చేయమంటే తప్పకుండా చేస్తాను' అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శనివారం విలేఖరులతో చిట్‌చాట్ చేస్తూ ఎంత పెద్దపులి అయినా వేటగాడి వ్యూహంలో పడాల్సిందేననీ ఓట్ల రాజకీయం కూడా అంతేనని అన్నారు. తాను రెండు సార్లు ఓడిపోయాననీ పొలి టిక్స్‌లో కౌంటర్ ఎన్‌కౌంటర్ సహజమని అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం మహిళకు ఉన్నా, జనరల్‌కు ఉన్నా నిర్మలనే అభ్యర్థి అని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో పలువురు ఎమ్మెల్యేలు అలర్టు అవడమే కాకుండా తమ తీరు మార్చుకుంటున్నారనీ అన్నారు. సిఎం చెప్పిన తర్వాత కూడా తీరు మారకపోతే సీటు ఇవ్వాల్లో లేదో రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. అపోజిషన్ ఎప్పుడూ రూలింగ్ పార్టీని ఎటాక్ చేస్తుందిరాజకీయ నీతి కూడా అదే అని ప్రతిపక్ష విమర్శలను స్వాగతిస్తూ అన్నారు. కేసిఆర్ మొదటిసారి సిఎం అయినప్పుడు కూడా బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని సర్వేలు చెప్పాయి అని గుర్తుచేశారు. యాక్టివ్ లేని వాళ్లని సిఎం రేవంత్ అలెర్ట్ చేస్తున్నారని అలెర్ట్ చేసిన తర్వాత కూడా తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. మేమే తోపులు అంటే నడవదు పెద్ద పెద్ద తోపులను కూడా పక్కన పెట్టిన సందర్భాలు ఉన్నాయి అని అన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తోపు కాదు సిఎం, టిపిసిసి చీఫ్, ఇంచార్జీ మాత్రమే తోపులు అని ఆయన వివరించారు. రాజకీయాల్లో పర్మినెంట్ గా ఎవరూ తోపులు ఉండరని రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టాడని, ఇక 117 సీట్లు గెలిపించుకునే ప్లాన్ రేవంత్ రెడ్డి వేశాడు అని ఆయన చెప్పారు. రేవంత్ వ్యూహాలు, నిర్ణయాలకు మా మద్దతు ఉంటుందనీ అన్నారు. రేవంత్ ఆలోచనలతో మాకు ఏకాభిప్రాయం ఉంటుందనీ తెలిపారు. ఇంతముందు ఎన్నికల గురించి ఆలోచించడం సరైన ఆలోచన అన్నారు. రెండోసారి ప్రభుత్వం తెచ్చేందుకు నిర్ణయాలు తీసుకునే హక్కు రేవంత్‌కు ఉందనీ ఆయనఅన్నారు. ఎవరి సర్వేలు వారికి అనుకూలంగా చేస్తారు సర్వేలను చూసి టెన్షన్ పడాల్సిన అవసరం లేదు అని జగ్గారెడ్డి ఉద్ఘాటించారు. ఎమ్మెల్యేల పనితీరు దృష్టిలో పెట్టుకొనే సీఎం పలువురికి సూచనలు ఇస్తున్నారనీ అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# ఓటర్ల జాబితా సవరణలో పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలి

### అవగాహన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

**ఆసిఫాబాద్, జూలై 11, ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బిఎల్ఏ, కార్యకర్తలకు ఓటర్ల జాబితా సవరణపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అధ్యక్షత వహించారు. జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, తప్పుల సవరణలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ప్రత్యేక సవరణపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సర్ పేరుతో కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం చేసే కుట్రలను తిప్పి కొట్టే బాధ్యత ప్రజలే తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ మాట్లాడుతూ సర్ ను పూర్తిస్థాయిలో చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లను ప్రత్యేకంగా నియమించిందని, వీరి ద్వారానే జిల్లాలో 56 ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేసి అర్హత కలిగిన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు.

# దేశానికి దార్శనికత్వం ఇచ్చే నాయకత్వం యువతలో ఉండాలి

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** యువత విశాల ప్రజారాశులతో కలిసి పనిచేస్తే దేశం నడిపించే నాయకత్వలక్షణాలు అభివృద్ధి చెందుతాయనీ దేశసమగ్రతకు దార్శనికత్వం ఇస్తారనీ టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం రీసెర్చర్, పబ్లిసిటీ కోఆర్డినేటర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన నేషనల్ టాలెంట్ హంట్ ప్రాథమిక ఇంటర్వ్యూ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్య క్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో ఆయన ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యార్హతలు, నైపు ణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యం, ప్రజా అవగాహన, సంస్థాగత పని తీరుపై అవగాహన వంటి అంశాలను పరిశీలించారు. ప్రతిభ, క్రమ శిక్షణ, అంకితభావంతో పనిచేసే యువతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. సమాజ సేవ పట్ల నిబద్ధ తతోపాటు ప్రజలతో మమేకమై పనిచేసే సామర్థం ఉన్న యువతను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడమే ఈ టాలెంట్ హంట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మహేష్ కుమార్‌గౌడ్ తెలిపారు.



స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన సేఫ్టీ కిట్ వివరాలు తెలుసుకున్న సిఎండి జితేష్ వి పాటిల్

# ప్రతి ఉద్యోగి భద్రత సంస్థకు ముఖ్యమే

### విద్యుత్ ప్రమాదాల నివారణకు మరింత సాంకేతికత

### టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి పాటిల్

**హైదరాబాద్, జులై 11,ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో ప్రమాదాలను పూర్తిగా నివారించడం, క్షేత్రస్థాయి ఉద్యోగుల భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరికరాల వినియో గాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా టీజీఎస్పీడీసీఎల్ పనిచేస్తుదని ఆసంస్థ సిఎండి జితేష్‌విపాటిల్ అన్నారు. ఈమేరకు శనివారం మింట్‌కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'సురక్ష 2026-సేఫ్టీ ఎక్స్‌పో వర్క్‌షాప్'ను జితేష్ వి. పాటిల్ ప్రారం భించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ వ్యవస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి ప్రాణం సంస్థకు అమూల్యమని, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా అతివిశ్వాసానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు.

భద్రత అనేది కేవలం నిబంధనల పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రతి ఉద్యోగి ఆచరణలో భాగం కావాలని సూచించారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని 21 సర్కిళ్ల నుంచి హాజరైన ఫోర్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు మరియు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది విద్యుత్ ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఫోర్‌మెన్‌లు తమ బృందాలకు నాయకత్వం వహిస్తూ, భద్రతా ప్రమాణాల అమలును పర్యవేక్షించాలని, లైన్ ఇన్‌స్పెక్టర్లు ప్రతి పనిలో భద్రతా నిబంధనలు పాటించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సైన్యంలో కమాండర్ తన సిబ్బందిని రక్షి ంచినట్లే, విద్యుత్ శాఖలో ఫోర్‌మెన్‌లు లైన్ ఇన్‌స్పెక్టర్లు తమ సిబ్బంది ప్రాణ భద్రతకు బాధ్యత వహిం చాలన్నారు. ఏ పని ప్రారంభించే ముందు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడిందా, రివర్స్ ఫీడింగ్, ఇన్వర్టర్లు, యూపీఎస్‌లు, జనరేటర్లు లేదా ఇతర ప్రత్యామ్నాయ విద్యుత్ వనరుల ద్వారా విద్యుత్ ప్రవాహం లేదని నిర్ధారించుకోవడం తప్పనిసరి అని తెలిపారు.

ఉద్యోగుల ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన ప్రతి భద్రతా పరికరం, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ మౌలిక సదుపాయాలను అందించేందుకు సంస్థ పూర్తి కట్టుబాటుతో పనిచేస్తోందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నర్సింహులు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి. శివాజీ, డైరెక్టర్ (కమర్షియల్ హెచ్‌ఆర్) చక్రపాణి, డైరెక్టర్ (ఫైనాన్స్) పి. కృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) రవి కు మార్, వివిధ జోన్లు మరియు సర్కిళ్లకు చెందిన చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ అధికారులు, ఫోర్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, ఆర్టిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ పిసిసి చీఫ్ జి.ఎస్.రావు మృతికి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సంతాపం



జి.ఎస్.రావు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** మాజీ పిసిసి అధ్యక్షులు, కొవ్వూరు మాజీ శాసనసభ్యులు జి.ఎస్. రావు మరణం పట్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జి.ఎస్. రావు కాంగ్రెస్ పార్టీ అభి వృద్ధికి, ప్రజాసేవకు విశేష కృషి చేసిన సీనియర్ నాయకులని కొనియాడారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజకీయ జీవితంలో ఆయన ప్రదర్శించిన నిబద్ధత, విలువలు, ప్రజల పట్ల అంకితభావం యువ నాయకులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.జి.ఎస్. రావు మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# ఫాసిస్టు శక్తులను నెహ్రూ-గాంధీ భావజాలంతో ఎదుర్కొనాలి

### 'మిరాయి' జాతీయ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** నెహ్రూ-గాంధీ భావజాలాన్ని ప్రతి యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని రాజ్యాంగ విలువలను కాపా డుతూ, ఫాసిస్టు శక్తులను ఎదుర్కొనే స్ఫూర్తిని యువతలో పెంపొందించాలని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం జవహర్ బాల్‌మంచ్ రెండు రోజుల 'మిరాయి' జాతీయ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ నాయకుల్లో నాయకత్వ లక్షణాలు, సంస్థాగత నైపు ణ్యాలు సేవాభావాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ శిక్షణ శిబిరం ప్రధాన లక్ష్యమనీ చెప్పారు. జవహర్ బాల్‌మంచ్‌కు తన పూర్తి మద్దతును ప్రకటించడంతో పాటు, తెలంగాణలో నిర్వహించనున్న తదుపరి జాతీయ బాలల శిబిరానికి కూడా సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.నేటి తరానికి భారతదేశ ఆలోచన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకాంగ్రెస్ సిద్ధాంతాలను చేరవేయాల్సి న అవసరం ఉందని ఆయన అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి జవహర్ బాల్‌మంచ్ జాతీయ సమన్వయకర్తలు, రాష్ట్ర చైర్మన్లు ఈ రెండురోజుల 'మిరాయి' శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారనీ వారికి అన్ని వసుతులు కల్పించామని తెలిపారు. ఈ శిక్షణ శిబిరానికి జవహర్ బాల్ మంచ్ జాతీయ అధ్యక్షులు జి.వి. హరి అధ్యక్షత వహించగా, తెలంగాణ జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర చైర్మన్ అడ్వకేట్ మామిడి రిషికేశ్ రెడ్డి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.




శనివారం జవహర్ బాల్‌మంచ్ రెండురోజుల 'మిరాయి' జాతీయ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన తర్వాత మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్

# పెట్టుబడిదారీ విధానం యుద్ధాలను ప్రోత్సహిస్తోంది

### సోషలిజంతోనే సమానత్వ సమాజ సాధ్యం

### సిపిఐ జాతీయ కార్యదర్శి బాలచంద్ర కాంగో

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** పెట్టుబడీదారి విధానం యుద్ధాలను ప్రోత్సహిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో అన్నారు. సోషలిజమే శాంతికి పునాది అని, శాస్త్రీయ సోషలిజం ద్వారానే సమానత్వ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్‌లో శనివారం ప్రారంభమైన సిపిఐ సెంట్రల్ పార్టీ స్కూల్ ఫర్ స్టూడెంట్ అండ్ యూత్ క్యాడర్స్ ప్రారంభోత్సవ సభకు బాలచంద్ర కాంగో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ప్రపంచ శాంతి, సమానత్వం, సామాజిక న్యాయం, మానవ విముక్తికి సోషలి జమే ప్రత్యామ్నాయమని బాలచంద్ర కాంగో స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాలను ప్రోత్స హిస్తూ, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చ గొడుతూ, కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశాలపై ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో సోషలిస్టు భావ జాలమే ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని, శాంతిని నెలకొల్ప గలదన్నారు. శాంతిని కోరుకునే ప్రతి యువకుడు, ప్రతి విద్యార్థి శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతాన్ని అధ్యయనం చేసి ప్రజా ఉద్యమాల్లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ విధానం అసమానతలను, నిరుద్యోగాన్ని, పేదరికాన్ని, దోపిడీని మరింత తీవ్రతరం చేస్తోందన్నారు. దానికి ప్రత్యామ్నాయం ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకున్న సోషలిస్టు సమాజ నిర్మాణమేనని అన్నారు. అందుకోసం యువత సిద్ధాంత పరంగా దృఢంగా తయారై, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసే కమ్యూనిస్టు కార్యకర్తలుగా ఎదగాలని సూచించారు. మార్క్సి జం- లెనినిజం, కమ్యూ నిస్టు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలపై లోతైన అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ శిక్షణను సద్వి నియోగం చేసు కుని మంచి సిద్ధాంత పరమైన కమ్యూనిస్టులుగా రాటుదేలి, ప్రజల కోసం నిరంతరం పోరాడే నాయకత్వంగా ఎదగాలని బాలచంద్ర పిలుపు నిచ్చారు. ప్రపంచశాంతి, ప్రజా స్వామ్యం, లౌకికత, సామాజిక న్యాయం, శాస్త్రీ య సోషలిజం విలువలను కాపాడే బాధ్యత యువతపై ఉందని, ఈ పార్టీ స్కూల్ ఆ దిశగా ఒక ముఖ్య మైన ముందడుగని పేర్కొంటూ దేశవ్యాప్తంగా ప్రజాఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ తరగతులలో సీపీఐ సెంట్రల్ పార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ అనీల్ రాజాంవాలే, ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కిం గ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పాల్గొన్నారు.

# 10వ రోజుకు చేరిన తెలుగు వర్సిటీ విద్యార్థుల ఆందోళన



ఉద్యమదీక్షలో విద్యార్థులు, మేధావులు, సిబ్బంది

**హైదరాబాద్ (నాంపల్లి), జులై 11, ప్రభాతవార్త :** ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల నుండి తెలుగు విశ్వ విద్యాలయం నాంపల్లి ప్రాంగణాన్ని పరిరక్షించాలంటూ తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు చేస్తున్న వివిధ రీతుల్లో నిరసన ప్రదర్శనలు, రిలే నిరాహారదీక్షలు 10వ రోజుకు చేరినా అటు ప్రభుత్వం నుండి ఇటు విశ్వవిద్యాలయ విసి, రిజిస్ట్రార్‌ల నుండి ఎటు వంటి అనుకూల స్పందన కరువైందని, వారు నిమ్మకునీరెత్తినట్లు వ్యవ హరిస్తున్నారని ఉద్యమ కారులైన విద్యార్థులు వాపోతూ విజయం సాధించేవరకు తగ్గేది లేదని, ఉధృతి మరింత పెంచుతామని హెచ్చరి స్తున్నారు. ఈ రోజు 2వ శనివారం సెలవురోజు అయినా జర్నలిజం, భాషాశాస్త్ర విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు అధిక సంఖ్యలో దీక్షబూనారు. సేవ్ నాంపల్లి క్యాంపస్, తెలుగు విశ్వవిద్యాలయం జోలికొస్తే ఖబడ్దార్ అంటూ నినాదాల హెచ్చరికలు మిన్నంటాయి. విద్యార్థులు గళమెత్తితే కబ్జాదారులు పారిపోరా అంటూ జర్నలిజం విద్యార్థులు పాటలు పాడుతూ, వార్తలు చదువుతూ, కవితల రూపంలోనూ నిరసనలు స్టూడియో రూపంలో వేసిన ఒక సెట్ నుండి తెలిపారు. సీనియర్ అధ్యాపకురాలు డా. హసీనా తమ తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడుకోదానికి విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి అందరూ సంపూర్ణ మద్దతు పలకాలని అన్నారు. సకల కళలకు, వినూత్న కోర్సులకు నిలయమైన విశ్వవిద్యాలయానికి బాచుపల్లి, నాంపల్లి క్యాంపస్‌లే కాక మరిన్ని ఏర్పాటు చేసినా తక్కువేనని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఆవేదనను ఆందో ళనను అర్థం చేసుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాఠాలు నేర్పిన జయధీర్ తిరు మలరావు విద్యార్థుల ఆందోళన ఆవేదాన్ని అర్థం చేసుకోవాలన్నారు.

# ఉచిత చేప, రొయ్య పిల్లల పథకాన్ని రద్దు చేయొద్దు

### 20న జిల్లా కలెక్టరేట్ల ముందు మత్స్యకారుల ధర్నాలు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇప్పటి వరకు అమలు చేస్తున్న ఉచిత చేప, రొయ్య పిల్లల పథకాన్ని రద్దు చేయొద్దని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పథకాన్ని రద్దు చేయాలనే ఆలోచనపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలుచేపట్టాలని సంఘం నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం నేతలు శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నరసింహా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి బక్కి బాలమణి, తేలు ఇస్తారి రాష్ట్ర కమిటీ సభ్యులు తడబోయిన కృష్ణమూర్తి, గులాబ్ సింగ్, మహావీర్ సింగ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధ్యక్షురాలు కరిలి నవనీత, సాల వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుండి 18 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో బైక్ ర్యాలీలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

# వికసిత్ భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతోన్న మోడీ ప్రభుత్వం

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథరావు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే గొప్ప లక్ష్యంతో దేశంలోని అన్ని రాష్ట్రాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ రావు అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిని దృష్టిలో ఉంచుకుని, ఇటీవల తాడిచెర్ల 2 కోల్ బ్లాక్‌ను ఎలాంటి వేలంపాట (ఆక్షన్) లేకుండా, డైరెక్ట్ అలకేషన్ బేసిస్ ద్వారా కేంద్ర ప్రభుత్వం మన సింగరేణి సంస్థకే అప్పగించిందన్నారు. గతంలో యూపిఏ ప్రభుత్వం ఉన్నప్పుడు తాడిచెర్ల 1 కోల్ బ్లాక్‌ను సింగరేణికి ఇస్తే, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సింగరేణితో ఆ బొగ్గు గనిని నడపడం చేతకాదని చేతులెత్తేసి వెనక్కి ఇచ్చేసిందన్నారు. ఆ తర్వాత దాన్ని జెన్‌కో ద్వారా ఒక ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టారు. కానీ ఈ రోజు సింగరేణి సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గును, విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందన్నారు. దానికి సంబంధించిన బకాయిలను మాత్రం సకాలంలో చెల్లించడం లేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు దాదాపు 54,000 కోట్ల రూపాయల బకాయిలు పడిందన్నారు. ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్లే సింగరేణిలో ప్రస్తుతం తీవ్రమైన ఫైనాన్షియల్ క్రైసిస్ (ఆర్థిక సంక్షోభం) ఏర్పడిందన్నారు. దీనివల్ల సంస్థ కొత్త ఎక్విప్‌మెంట్‌ను కొనలేకపోతుందని, సరికొత్త టెక్నాలజీపై ఇన్వెస్ట్ చేయలేకపోతుందన్నారు. చివరికి సింగరేణిలో రాత్రింబగళ్లు కష్టపడే కార్మికులకు, వారి కుటుంబాలకు కనీస మూలిక వసతులు కూడా కల్పించలేని దుస్థితి నెలకొందని అన్నారు.

# రైతు డిస్కం ఏర్పాటుకు ఓకే

### విద్యుత్ పంపిణీ లైసెన్స్ మంజూరు

### మోటర్లకు మీటర్లు ఉండవు

### నాలుగు నెలల్లో కార్యకలాపాలు

### స్పష్టం చేసిన విద్యుత్ నియంత్రణ కమిషన్

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మూడో ఉచిత విద్యుత్ డిస్కం తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఆర్పీడిసిఎల్) కు విద్యుత్ నియంత్రణ కమిషన్ ఒకే చెప్పింది. ఈ మేరకు దీనికి సంబంధించి శనివారం విద్యుత్ నియంత్రణ మండలి కొత్త డిస్కంకు విద్యుత్ పంపిణీ లైసెన్స్ మంజూరు చేసింది. విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 14తో పాటు, సెక్షన్ 131 ప్రకారం కు లైసెన్స్ మంజూరు చేసినట్లు ప్రకటించింది. ఈ ఉత్తర్వులు నేటి నుంచి నాలుగు నెలల తర్వాత రైతు డిస్కం వ్యాపార కార్యకలాపాలు ప్రారంభమయ్యే తేదీగా వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టంలోని సెక్షన్ 131 ప్రకారం చట్టబద్ధమైన ట్రాన్స్ఫర్ స్కీమ్‌ను జారీ చేసిన తర్వాతే ఈ లైసెన్స్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. విద్యుత్ చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు పెట్టుకున్న దరఖాస్తులను కూడా విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆమోదించింది. కొత్త ఉచిత డిస్కం కార్యకలాపాలు ప్రారంభమైన తేదీ నుంచి బదిలీ అయ్యే వినియోగదారుల వర్గాలను ఈ రెండు డిస్కంల పరిధి నుంచి తొలగిస్తూ వాటి లైసెన్సులను సవరించింది. మిగతా వినియోగ దారులకు సేవలు అందించే బాధ్యతలు, భౌగోళిక పరిధిలో ఎలాంటి మార్పు ఉండదని తేల్చిచెప్పింది. మార్పిడి ప్రక్రియ సజావుగా జరిగేలా కమిషన్ పలు కీలక ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్ 131 ప్రకారం ట్రాన్స్ఫర్ స్కీమ్ జారీ చేసి సంబంధిత ఆస్తులు, అప్పులు, వినియోగదారులను ఈ కొత్త విద్యుత్ పంపిణీ సంస్థకు బదలీ చేయాల్సి ఉంటుందని తెలిపింది. రైతు డిస్కం మూడు నెలల్లో లోడ్ అంచనాలు, లైన్ నష్టాల తగ్గింపు, ఇంటర్ఫేస్ మీటరింగ్, సిబ్బంది, ఆర్థిక అంశాలతో కూడిన సమగ్ర వ్యాపార ప్రణాళికను కమిషన్‌కు సమర్పించాలి. ఉత్తర, దక్షిణ, ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య ఆపరేషన్ మెయింటెనెన్స్, వినియోగదారుల డేటా బదిలీ, విద్యుత్ సరఫరా, ఎనర్జీ అకౌంటింగ్ తదితర అంశాలపై అవగాహన ఒప్పందాలు, సేవా ఒప్పందాలు, బల్క్ సప్లై ఒప్పందాలు కుదుర్చుకుని కమిషన్ ఆమోదానికి సమర్పించాలి. అంతేకాకుండా ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సర మిగిలిన కాలానికి టారిఫ్, ప్రభుత్వ సబ్సిడీ పంపిణీపై విద్యుత్ పంపిణీ సంస్థలు నియంత్రణ కమిషన్‌ను ఆశ్రయించాలని పేర్కొంది. దీంతోపాటు, 2027-28 టారిఫ్ ప్రతిపాదనలను నవంబర్ 30, 2026లోపు సమర్పించాలని వెల్లడించింది.

రైతు డిస్కం కనీసం రెండు విని యోగ దారుల ఫిర్యాదుల పరిష్కార వేదికలను ఏర్పాటు చేయాలని, అప్పటి వరకు ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించిన ప్రస్తుత ఫోరంలే బదిలీ అయ్యే వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరిస్తాయని వివరించింది. మార్పిడి ప్రక్రియలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సహా, కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరును ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయరాదని సూచించింది. రైతు డిస్కం పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే వరకు ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలే యథావిధిగా దరఖాస్తులు స్వీకరించి కొత్త కనెక్షన్లు మంజూరు చేయాలని ఆదేశించింది. ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వ హామీని కమిషన్ తన ఉత్తర్వుల్లో నమోదు చేసింది. రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా ఈ విధానంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. అలాగే వ్యక్తిగత వ్యవసాయ పంప్సెట్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా ఉత్తర్వుల్లో నమోదు చేసింది. ఇతర డిస్కంల మాదిరిగానే టారిఫ్, సేవా ప్రమాణాలు, వినియోగ దారుల హక్కులు, నివేదికల సమర్పణ తదితర అన్ని అంశాల్లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి పర్యవేక్షణలో పనిచేస్తుందని వెల్లడించింది. ఇక ఈ కొత్త డిస్కం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ విద్యుత్‌కు సంబంధించి వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ, సంయుక్త రక్షిత తాగునీటి పథకాలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, అలాగే ప్రత్యేక పంపిణీ ట్రాన్స్ఫార్మర్ల ద్వారా విద్యుత్ పొందుతున్న మున్సిపల్ తాగునీటి కనెక్షన్లకు సేవలు అందించనుంది.

# నేరగాళ్ల ప్రవర్తనపై జైళ్ల శాఖ అజమాయిషీ ఏదీ?

## కిరాతకులపై కొరవడిన పోలీసు నిఘా

## షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన రాజ్‌కుమార్ ఉదంతంలో పోలీసు, జైళ్ల శాఖ డొల్లతనం వెల్లడి

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** నేరాలు చేసి అరెస్టయి జైళ్లకు వెళ్లిన వారిపై పోలీసులతో పాటు జైళ్ల శాఖ నిఘా పూర్తిగా కొరవడింది. కరుడుగట్టిన నేరగాళ్ల విషయంలో ఇది ఇప్పటికే అనేకమార్లు రుజువవగా తాజాగా షాబాద్‌లో ఫోక్సో కేసులో అరెస్టయి నెలన్నర పాటు జైల్లో వుండి శుక్రవారం బెయిల్‌పై వచ్చిన రాజ్‌కుమార్ అనే నేరగాడు ఒక్కసారిగా కిరాతకుడిగా మారి ఆరుగురిని హత్య చేయడం సంచలనం రేపిం ది. రాజ్‌కుమార్ హత్య చేసిన వారిలో ఫోక్సో కేసుకు సంబంధించిన బాధిత మైనర్ బాలికతో పాటు ఆమె కుటుంబానికి చెందిన మరో ఇద్దరు వున్నారు. దీంతో పాటు రాజ్‌కుమార్ భార్య ఇద్దరు బిడ్డలను కూడా దారుణంగా చంపాడు. రాజ్‌కుమార్ వ్యవహారంలో మొదట పోలీసుల వైఫ ల్యం వుండగా అతన్ని నెలన్నర రోజుల పాటు దగ్గర నుంచి గమనించిన జైళ్ల శాఖ అధికారుల వైఫల్యం మరింతగా వుందని చెప్పాలి. ఈ తర హా ఘటనలు గతంలో జరిగినా వాటి నుంచి పోలీసులు పాఠాలు నేర్వక పోవడం గమనార్హం.

ఏ వ్యక్తి పుట్టుకతోనే నేరగాడు కాదని సామాజిక పరిస్థితులతో పాటు ఇతర కారణాలు అతన్ని నేరగాడుగా మారుస్తాయని పోలీసు అధికారులు చెబుతుంటారు. ఈ విషయం అలావుంచితే నేరగాడుగా మారిన వ్యక్తిపై నిఘా వుంచాల్సిన విషయంలో పోలీసులు విఫలమవు తుండడం ఆ యా ప్రాంతాలలో శాంతి భద్రతలకు తావిస్తోంది. షాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఆరు హత్యలు ఇందుకు ఉదాహరణ. రాజ్‌కుమార్ అ నే (28) వ్యక్తి మైనర్ బాలికను వేధించిన ఘటనలో ఫోక్సో కేసులో నిందితుడుగా నెలన్నర పాటు జైల్లో వున్నాడు. అంతకు ముందు అతను మైనర్ బాలికను పలుమార్లు వేధించిన క్రమంలో దీనిపై సమాచారం వున్నా పోలీసులు పెద్దగా స్పందించలేదని ఆరోపణలు వున్నాయి. తాము ఫిర్యాదు చేసినా రాజ్‌కుమార్‌పై పోలీసులు కఠినంగా వ్యవహరించలేదని బాధిత బాలిక కుటుంబీకులు చెబుతున్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకుని వుంటే నేడు ఇంత ఘోరం జరిగి వుండేది వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో రాజ్‌కుమార్‌పై ఫోక్సో కేసు నమోదు చేయక ముందు పోలీసులు అతన్ని హెచ్చరించి వుంటే ఈ పరిస్థితి దాపురించేది కాదని స్థానికులు అంటున్నారు. ఇక ఫోక్సో కేసులో అరెస్టయి నెలన్న ర పాటు జైల్లో వున్న రాజ్‌కుమార్ ప్రవర్తనపై జైళ్ల శాఖ పెద్దగా నిఘా వుంచలేదని తెలుస్తోంది. జైల్లో సాధారణ ఖైదీలతో పాటు వున్న ఇతను ఎలా ప్రవర్తించేవాడు...? తోటి ఖైదీలతో ఎలా వుండేవాడు...? తనపై కేసు పెట్టిన వారి గురించి ఏమనుకునే వాడు...? అనే దాని గురించి జైళ్ల శాఖ ఆరా తీసివుంటే అతనికి బెయిల్ రాకుండా చేయగలిగే వారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. జైల్లో అతని ప్రవర్తన ఎలా వుందనే దానిపై జైళ్ల శాఖ నుంచి కోర్టు నివేదిక కోరాలని వారంటున్నారు. ఒకవేళ అతను జైల్లో కిరాతకంగా, క్రూరంగా ఆలోచించి వున్నా, ప్రవర్తన స రిగ్గా లేకున్నా దీనిపై జైళ్ల శాఖ పోలీసులకు సమాచారం ఇచ్చి వుండాల్సిందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

దీనివల్ల బెయిలుపై విడుదల అవగానే అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చి బుద్ధిగా మసలుకునేలా చేసే అవకాశం వుండేదని వారంటున్నారు. ఇలా రా జ్‌కుమార్ విషయంలో మొదట పోలీసులు విఫలమవగా అనంతరం జైళ్ల శాఖ వైఫల్యం చెందింది. రాజ్‌కుమార్ విషయం అలావుంచితే జీడిమె ట్ల పరిధిలో ఏడాది క్రితం ఓ మైనర్ బాలిక తన ప్రేమను కాదన్నందుకు కన్నతల్లిని ప్రేమికుడు, అతని స్నేహితుడితో కలిసి దారుణంగా చంపే సిన ఘటన ఇటువంటిదే. తన కూతురును ప్రేమ పేరుతో ఒక యువకుడు వేధిస్తున్న విషయమై హతురాలు ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేసినపుడు వారు స్పందించి వుంటే ఈ ఘోరం జరిగి వుండేది కాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. నేరగాళ్ల విషయంలోనే కాదు కిరాతక నేరస్తుల విషయంలోనూ పోలీసులు అనేకసార్లు పూర్తిగా విఫలమైన ఉదంతాలు అనేకం వున్నాయి.

నాలుగేళ్ల క్రితం మైలార్‌దేవుపల్లిలో మూడు హత్యలకు పాల్పడిన బేగరి ప్రవీణ్ ఉదంతంలో ఇలాగే జరిగింది. అంతకు ముందు 2003 నుంచి 2022 వరకు 18 మంది మహిళలను హత్య చేసిన సైకో కిల్లర్ రాములు, తెలుగు రాష్ట్రాలో సంచలనం రేపిన హాజీపూర్ సైకో కిల్లర్ శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లాలో 17 హ త్య కేసుల్లో నిందితుడుగా వున్న ఎరుకల శ్రీనుల విషయంలోనూ పోలీసు శాఖ, జైళ్ల శాఖలు ఉదాసీనంగా వ్యవహరించడం గమనార్హం. ఇక కొన్ని సార్లు జైళ్ల శాఖ అతి మంచితనంవల్ల అనేకమంది నేరగాళ్లు హత్యలవంటి నేరాల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నా ముందుగానే విడుద లవు తూ మళ్లీ నేరాలు చేస్తున్నారు.

# జనాభాకు అనుగుణంగా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు

## ప్రపంచ జనాభా దినోత్సవం రోజున సమితి అవార్డులు

**న్యూయార్కు, జులై 11:** ప్రతి యేటా జూలై 11న నిర్వహిస్తున్న ప్రపంచ జనాభా దినోత్సవం ఈ ఏడాది థీమ్ నేటి యువజనాభా ఆకాంక్షలకు భవిష్యత్తు కార్యాచరణ సందేశంతో 2026 ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించారు. యూఎన్ పాపులేషన్ అవార్డు2026 వ్యక్తిగత విభాగంలో



సెనెగల్‌కు చెందిన ప్రొఫెసర్ సెరిగ్నే మాగ్యే గుయేకు, సంస్థాగత విభాగంలో బురుండికి చెందిన ఫౌండేషన్ బాన్ యాక్షన్ ఉముగిరనేజాకు లభించింది. ఈ అవార్డు ను ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1981లో ఏర్పాటు చేసిం ది. జనాభా పెరుగుదల, తగ్గుదల వల్ల కలిగే లాభనష్టాలను అవగాహన పరిచేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1987, జులై 11 నాటికి ప్రపంచ జనాభా 500 కోట్ల (5 బిలియన్లు)కు చేరుకుంది. ప్రస్తుతం ప్రపంచ జనాభా 830 కోట్లకు చేరుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జనాభా పెరుగుదల మానవజాతి మనుగడపై చూపే ప్రభావాల గురించి అవగాహన కల్పించేందుకు 1989లో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం ఈ దినోత్సవాన్ని ప్రతిపాదించింది. 1990 నుంచి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రజలకు.. చిన్న కుటుంబాలు, సుస్థిర అభివృద్ధి ప్రాముఖ్యతను వివరించడం, కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించడం. యూఎన్‌డీపీ ప్రతి ప్రపంచ జనాభా దినోత్సవానికి ఒక థీమ్‌ను ఏర్పాటు చేస్తుంది.

# దేశంలో తొలి సిఎంపి ప్యాడ్ టెక్నాలజీస్ హబ్

## టీవర్క్స్‌లో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై11:** సెమీకండక్టర్ల తయారీ రంగంలో తెలంగాణ మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో చిప్‌ల తయారీలో అత్యంత కీలకమైన కెమికల్ మెకానికల్ పాలిషింగ్ (సీఎంపీ) ప్యాడ్ టెక్నాలజీకి సంబంధించిన దేశంలోనే తొలి హబ్ హైదరాబాద్‌లో ఏర్పాటైంది. జపాన్‌కు చెందిన తోహో కోకి సీసాకుషో కంపెనీ లిమిటెడ్ సహకారంతో టీవర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తెలంగాణను దేశంలోనే ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ లక్ష్య సాధనలో తాజాగా ప్రారంభించిన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సెమీకండక్టర్ చిప్‌ల తయారీలో వాఫర్‌ను సమతలంగా మార్చేందుకు ఉపయోగించే ఈ సీఎంపీ ప్యాడ్లను ప్రస్తుతం పూర్తిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ హబ్ ఏర్పాటుతో ఇప్పటివరకు విదేశాలకే పరిమితమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ తొలిసారిగా దేశంలో హైదరాబాద్ వేదికగా అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు ఈ కేంద్రం ద్వారా శిక్షణతో పాటు పరిశోధనలు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. ప్రముఖ విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈల భాగస్వామ్యంతో వచ్చే 18 నుంచి 24 నెలల్లో సీఎంపీ ప్యాడ్లను దేశంలోనే తయారు చేసేలా సంయుక్త పరిశోధనలు చేపడతామని వివరించారు. సెమీకండక్టర్ రంగంలోని అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు జపాన్ లాంటి దేశాలతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు.

# వియత్నాంలో బోటు ప్రమాదం..

## తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై11:** వియత్నాంలో జరిగిన బోటు ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపంలో పర్యటనకు వెళ్లిన భారతీయులు బోటు ప్రమాదంలో మృతిచెందారనే సమాచారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. వియత్నాం పర్యటనకు వెళ్లిన తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు పర్యాటకులు అక్కడ బోటు ప్రమాదంలో మరణించారనే సమాచారంపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను తెలుసుకోవడంతో పాటు సహాయక చర్యలను ముమ్మరం చేయడంలో కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు వియత్నాంలోని భారతీయ ఎంబసీ కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రమాదంలో తెలుగువారు ఉన్నారని ప్రాథమిక సమాచారం అందిన నేపథ్యంలో పూర్తి సమాచారం తెలుసుకోవాలని సిఎం సూచించారు.

# నా తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటా

## ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ



**టెహ్రాన్, జులై 11:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం చేశారు. టెలిగ్రామ్ ద్వారా విడుదల చేసిన సందేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తండ్రి మృతికి కారకులైన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మొజ్తబా హెచ్చరించారు. ఇది దేశ ప్రజల డిమాండ్ అని, తన నాయకుడితో పాటు అమరులైన వారి తరఫున హంతకులపై ప్రతీకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా ఈనెల 9న జరిగిన తన తండ్రి అంత్య క్రియలకు కూడా హాజరు కాలేకపోయారు. తనను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో మొజ్తబా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

**బీరూట్, జులై 11:** ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. దక్షిణ లెబనాన్‌లో పలు పట్టణాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేపట్టింది. దీంతో మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. దక్షిణ లెబనాన్‌లోని పలు పట్టణాలపై ఇజ్రాయెల్ శనివారం భారీ ఎత్తున వైమానిక, ఫిరంగి దాడులు నిర్వహించింది. సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ దాడులు చోటుచేసుకున్నాయి. ఇజ్రాయెల్‌లెబనాన్ సరిహద్దు వెంబడి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. దిర్ సిర్యాన్, అల్‌ఖంతారా పట్టణాలపై ఇజ్రాయెల్ సైన్యం ఫిరంగి దాడులు చేసింది. అనంతరం దక్షిణ లెబనాన్‌లోని అల్‌మన్‌సౌరీ పట్టణంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు మరోసారి వైమానిక దాడులు జరిపాయి. ఈ పట్టణంపై ఇది మూడో వైమానిక దాడిగా స్థానిక మీడియా వెల్లడించింది.

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను దోపిడీ చేస్తున్న ఏజెన్సీలు

## మూడు, నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో తీవ్రమైన దోపిడి జరుగుతుందని, తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 4,800 కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.కళ్యాణ్ నాయక్ అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు 2 లక్షల 21 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సేవలందిస్తున్నారు. అయితే ఈ ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించాల్సిన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు, మూడు నుంచి నాలుగు నెలల పాటు జీతాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అంతేకాకుండా ఉద్యోగులకు రావాల్సిన పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన ప్రయోజనాలను సైతం అందించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉద్యోగి కోసం కేటగిరీల వారీగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేస్తున్నప్పటికీ, ఆ మొత్తాన్ని ఉద్యోగులకు ఇవ్వకుండా భారీ ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయి. ఒక కేటగిరీ 1 ఉద్యోగికి ప్రభుత్వం బేసిక్ వేతనం రూ.15,600, పిఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టి తదితర ఖర్చులు కలిపి సుమారు రూ.22,136 వరకు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి చెల్లిస్తుందని, కానీ ఆ ఉద్యోగికి చేతికి అందుతున్న జీతం కేవలం రూ.13,600 ప్రాంతంలో మాత్రమే ఉంటుందన్నారు. అంటే ఒక్కో ఉద్యోగిపై రూ.9,000 నుంచి రూ.9,500 వరకు కమిషన్, పిఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టి పేర్లతో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు తమ జేబుల్లో వేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఒక ఉద్యోగికి పూర్తి మొత్తాన్ని చెల్లిస్తున్నప్పటికీ, ఉద్యోగికి అందాల్సిన డబ్బు అందడం లేదన్నారు. ఇది ఒకటి, రెండు ఏజెన్సీల విషయం కాదు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వేలాది ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల్లో ఇలాంటి అక్రమాలు కొనసాగుతున్నాయని ప్రభుత్వ అధికారులే ముఖ్యమంత్రికి నివేదికలు ఇచ్చారు. అంతేకాకుండా, గతంలో ప్రధాన కార్యదర్శి శాంతకుమారి సమర్పించిన నివేదికలో కూడా అనేక ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు జీతాల చెల్లింపులు, పిఎఫ్, ఈఎస్ఐ అమలులో తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారని సమాచారం. ప్రభుత్వం స్వయంగా సమీక్ష నిర్వహించి అక్రమాలు జరుగుతున్నాయని అంగీకరిస్తే, ఇప్పటి వరకు బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 2 లక్షల 21 వేల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఒక్కో ఉద్యోగి కోసం పూర్తి మొత్తాన్ని విడుదల చేస్తున్నప్పటికీ, ఉద్యోగులకు కేవలం రూ.13 వేల నుంచి రూ.14 వేల మధ్య మాత్రమే జీతాలు అందుతున్నాయి. మిగిలిన మొత్తం ఏజెన్సీలు అక్రమంగా స్వాహా చేస్తున్నాయని ఆరోపించారు.

# మా అమ్మాయి పెళ్లికి రండి

## పిసిసి చీఫ్ మహేశ్‌ను ఆహ్వానించిన బండ్ల గణేష్



**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని కలిసిన ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ ఆయన కూతురు వివాహానికి ఆహ్వా నించారు. శనివారం గాంధీభవన్‌లో బండ్ల గణేష్ టిపిసిసి చీఫ్‌కు వివాహపత్రిక అందజేసి సమకాలీన అంశాలపై ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకున్నారు. బండ్లగణేష్ గత కొద్దిరోజులుగా తన కూతురు వివాహ పత్రికలు కాంగ్రెస్ ప్రముఖులను వ్యక్తిగతంగా కలిసి అందజేస్తూ ఆహ్వానిస్తున్నారు.



# తెలంగాణలో పెట్టుబడులకు ఎమిరేట్స్ ఆసక్తి

## సిఎం రేవంత్‌రెడ్డితో ఎమిరేట్స్ వైస్‌ప్రెసిడెంట్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై11:** రాష్ట్రంలో పెట్టుబడులకు ఎమిరేట్స్ సంస్థ ఆసక్తి చూపుతోందని, ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ ఏ380 సర్వీసులను ప్రారంభించడానికి ఎమిరేట్స్ విమానయాన సంస్థ సుముఖత వ్యక్తం చేసిందని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం ఎమిరేట్స్ విమానయాన సంస్థ (ఇండియా, నేపాల్) వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ విమానయాన సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఎమిరేట్స్ ఏ380 సర్వీసులను ప్రారంభించడంతో పాటు సంస్థ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్ రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వాటి ప్రాధాన్యతను వివరిస్తూ, రాష్ట్రంలో ఎమిరేట్స్ ఎంఆర్ఓ ఆపరేషన్స్‌ను కొనసాగించాలని కోరారు.

# జానకి మృతికి సిఎం రేవంత్‌రెడ్డి సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై11:** ప్రముఖ గాయని ఎస్. జానకి మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దక్షి ణ భారత సినీ సంగీత ప్రపంచంలో జానకి తన గళమాధుర్యం తో సంగీతాభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. అనేక చిత్రాల్లో పాత్ర సన్నివేశాలకు, సందర్భాలకు అనుగుణంగా నవరసాలను పలికిస్తూ పాడిన పాటలు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశాయని పేర్కొ న్నారు. ఆమె తెలుగు వారు కావడం తెలుగు ప్రజలకు గర్వకారణమని పేర్కొ న్నారు. 50 వేలకు పైగా పాటలు పాడి ఎన్నో జాతీయ పురస్కారాలు అందుకున్నారని గుర్తుచేశారు.

**జానకి మరణం పట్ల కెసిఆర్ సంతాపం**

సినీ నేపథ్య గాయని ఎస్.జానకి (శిష్ట్ల శ్రీరామమూర్తి జానకి) మరణం పట్ల తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు సంతాపం ప్రకటించారు.

# బొగ్గు గ్యాసిఫికేషన్‌లోకి సింగరేణి అడుగులు

## పెట్రోలియం డైరెక్టర్ జనరల్ శ్రీకాంత్‌తో సిఎండి బుద్ధప్రకాష్ భేటీ




**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** సింగరేణిని బహుముఖంగా విస్తరించాలన్న ఉద్దేశ్యంతో బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి ప్రవేశించే అవకాశాలను సింగరేణి సమగ్రంగా పరిశీలిస్తోందని సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో పెట్రో లియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ (హైడ్రోకార్బన్స్) డాక్టర్ నాగులపల్లి శ్రీకాంత్‌తో శనివారం జరిగిన సమావేశంలో కోల్ గ్యాసిఫికేషన్‌పై సింగరేణి చేపడుతున్న చర్యలను సీఎండీ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో రోజుకు 400 టన్నుల సామర్థ్యంతో అమ్మోనియం నైట్రేట్ మెల్ట్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ అధ్యయనం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు పెట్టుబడిపై రాబడి ఆశాజనకంగా లేదని, మరింత మెరుగు పరిచేందుకు ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడం, కేంద్ర ప్రభుత్వ వయ బిలిటీ గ్యాప్ ఫండింగ్ వినియోగం, స్వదేశీ సాంకేతికత వంటి ప్రత్యా మ్నాయాలను పరిశీ లిస్తున్నట్లు చెప్పారు.

ఇదే విషయంపై తాల్చేర్, ఎంసీఎల్-బీహెచ్‌ఈఎల్, జేఎస్పీఎల్ తదితర కోల్ గ్యాసిఫి కేషన్ ప్రాజెక్టులను అధ్యయనం చేయడానికి ఈ నెలలో సింగరేణి అధికారుల బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. అలాగే భీమారం, చెన్నూరు సౌత్, నైనీ ప్రాంతాల్లో సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్ అవకాశాలపై సాంకేతికఆర్థిక విశ్లేషణ కొనసా గుతోంద న్నారు. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ విషయంలో కూడా బెల్లం పల్లి, రామగుండం ప్రాం తాల్లోని లోతైన బొగ్గు నిల్వల్లో ఐదు బ్లాక్‌లను గుర్తించినట్లు తెలిపారు. తొలి పైలట్ ప్రాజెక్టును బెల్లంపల్లి డిప్‌సైడ్ బ్లాక్లో చేపట్టేందుకు డ్రిల్లింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయని, సీఎంఐఎఫ్ఆర్ శాస్త్ర వేత్తల సాంకేతిక మార్గదర్శకత్వంలో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, పోట్రు గౌతమ్, ఈడీ బి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# స్టేట్ సివిల్ సర్వీస్ ఏర్పాటు చేయాలి

## సర్కార్‌కు గ్రూప్1 ఆఫీసర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రూప్1 సర్వీస్‌లతో స్టేట్ సివిల్ సర్వీస్ ఏర్పాటు చేయాలని తెలంగాణ గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసి యేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ గ్రూప్1 ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్య క్షులు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ కేరళ, ఒడిశా, గుజరాత్ వంటి రాష్ట్రాల తరహాలోనే తెలంగాణలో కూడా తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ను తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న పంచాయత్ రాజ్, మున్సిపల్ శాఖల సీనియర్ గ్రూప్1 అధికారులను జిల్లాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లుగా నియమిం చాలని కోరారు. అలాగే అన్ని శాఖల్లోని గ్రూప్1 అధికారులకు కాలపరిమితితో కూడిన పదోన్న తులు, అన్ని సర్వీసులకు సమాన వేతనాలు ఉండేలా చూడాలన్నారు. ప్రస్తుతం ఐఏఎస్ పదోన్నతులలో కేవలం రెవిన్యూ శాఖనే స్టేట్ సివిల్ సర్వీస్‌గా పరిగణిస్తున్నారని, దీనివల్ల గ్రూప్ 1 పరిధిలోని ఇతర శాఖల అధికారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రూప్1 ఆఫీసర్స్ అసోసియేషన్ తరఫున పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. త్వరలో ముఖ్యమంత్రి, సిఎస్, ఇతర సంబంధిత అధికారులను కలిసి తమ విజ్ఞప్తులను వారి దృష్టికి తీసుకుని వెళ్ళాలని ఈ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో గ్రూప్1 ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హన్మంత్ నాయక్, ఇతర గ్రూప్ 1 అధికారులు సయ్యద్ యాసిన్ ఖురేషి, అరవిందరెడ్డి, భవాని, రమేష్‌కుమార్, పద్మజ, మైత్రి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్ ఘటనకు బాధ్యుడైన వ్యక్తిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి

## అత్యంత దారుణ ఘటన : మహిళా కమిషన్ చైర్‌పర్సన్



**హైదరాబాద్ (బేగంపేట) జులై 11, ప్రభాతవార్త:** షాబాద్ ఘటనకు బాధ్యుడైన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. షాబాద్ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఫ్యూచర్ సిటీ పోలీసు కమీషనర్ తరుణ్ జోషి, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ లకు ఛైర్‌పర్సన్ నేరుగా ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెల్సుకున్నారు. మరో సారి ఇలాంటి ఘటనలకు పాల్పడాలనే ఆలోచన రావాలంటేనే వెన్నులో వణుకు పుట్టేలా నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. జరిగిన ఘటనతో మహిళలు ఎవరూ భయభ్రాంతులకు గురి కావద్దని, బాధిత మహిళలకు మహిళా కమిషన్ అండగా ఉంటుందన్నారు.

# హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్‌కు నూతన రూపు

## అమృత్‌స్టేషన్ పథకం కింద ఆధునీకరణ పూర్తి

## ప్రారంభోత్సవానికి సిద్ధం

**హైదరాబాద్ (తార్నాక), జులై 11, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ప్రపంచ స్థాయి ప్రయాణికుల సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ స్టేషన్ పథకం కింద హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.26 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు ముగియడంతో స్టేషన్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు ప్రధాన ద్వారంగా గుర్తింపు పొందిన హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ప్రతిరోజూ వేలాది మంది ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, కాంట్రాక్ట్ కార్మికులు, సాధారణ ప్రయాణికులకు కీలక రవాణా కేంద్రంగా సేవలందిస్తోంది. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్టేషన్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. అమృత్ స్టేషన్ పథకం కింద స్టేషన్‌కు కొత్త ప్రవేశ ద్వారం, ఆకర్షణీయమైన స్టేషన్ భవనం, విశాలమైన పోర్టికో, ఆధునిక ఫసాడ్, ల్యాండ్‌స్కేపింగ్, ఫసాడ్ లైటింగ్ ఏర్పాటు చేశారు.

ఇప్పటికే ఉన్న రెండు మీటర్ల వెడల్పు ఫుట్ ఓవర్ బ్రిడ్జికి అదనంగా 12 మీటర్ల వెడల్పుతో కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించారు. ప్రస్తుతం ఉన్న రెండు లిఫ్టులకు తోడు మరో రెండు లిఫ్టు, రెండు ఎస్కలేటర్లు ఏర్పాటు చేసి ప్రయాణికుల రాకపోకలను మరింత సౌకర్యవంతం చేశారు. ప్లాట్‌ఫారాలను ఆధునీకరించి అదనపు షెడ్లు, విశాలమైన వెయిటింగ్ హాల్, కొత్త శౌచాలయాలు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచారు.



స్టేషన్ ముఖద్వారం

దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఆధునిక శౌచాలయం, సులభ రాకపోకలకు అనుకూలమైన సదుపాయాలు కల్పించారు. ప్రయాణి కులకు స్పష్టమైన సమాచారాన్ని అందించే విధంగా కొత్త సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని ఈ సబర్బన్ స్టేషన్‌లో ప్రస్తుతం ప్రతిరోజూ 3,000 మంది ప్రయాణికులు ప్రయా ణిస్తుం డగా, సికిందరాబాద్, హైదరాబాద్, ఉమ్దానగర్, ఫలక్‌నుమా, మేడ్చల్, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాలకు రోజుకు 62 సబర్బన్ రైళ్లు సేవ లందిస్తున్నాయి. అమృత్‌స్టేషన్ పథకం ద్వారా హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌కు అత్యాధునిక హంగులు జోడించడంతో, హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు ఇది మరింత ప్రతి ష్ఠాత్మక రవాణాకేంద్రంగా మారనుందని రైల్వేఅధికారులు తెలిపారు.

# వ్యవసాయంలో భవిష్యత్ నాయకులు

## వ్యవసాయ పరిశోధనా అకాడమీ డైరెక్టర్ ఆర్. మీనాక్షి

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** వ్యవసాయ పరిశోధన నిర్వహణలో అనుభవజ్ఞులైన నాయకులు, విధాన నిపుణుల అపారమైన అనుభవాల నుండి నేర్చుకోవడం ద్వారా, వ్యవసాయ శాస్త్రంలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నాయకులను తీర్చిదిద్దగలమని జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ అకాడమీ (ఎన్ఏఎఆర్) డైరెక్టర్ డాక్టర్ ఆర్. మీనాక్షి సుందరం అన్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ అకాడమీ తన స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా (ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్) రిట్రీట్‌ను శనివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన సేవా ఫౌండేషన్ కోర్సు యొక్క పాఠ్యప్రణాళిక, రూపకల్పన, వ్యవధిని మెరుగుపరచడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో పాఠ్యప్రణాళికను మెరుగుపరచడం కోసం అనుభవజ్ఞుల నుండి సూచనలు సేకరించడమే ఈ రిట్రీట్ లక్ష్యమన్నారు.

# అంతరాలయం అనుమతించనపుడు టిక్కట్లెందుకు జారీ చేసారు?

### సిబ్బందిపై భక్తుల ఆగ్రహం: సమాధానం చెప్పలేని అధికారులు

### సర్వర్ డౌన్‌తో తిప్పలు

**శ్రీకాళహస్తి,జులై 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులు గత రెండు నెలలుగా ఆన్‌లైన్ సేవలతో తిప్పలు పడుతున్నారు.దీనికి తోడు అధికారులు రోజుకొక నిర్ణయంతో భక్తుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు.శనివారం శనిశ్వరాభిషేకానికి వచ్చిన భక్తులు ఆన్‌లైన్ మాత్రమే ఆఫ్‌లైన్ లేదనటంతో అభిషేకాలు పూజలు జరిపించుకోకుండానే వెనుదిరిగారు.ఇక భక్తులకు సుదర్శనం కోసం ఏర్పాటు చేసిన సేవల్లో 'అంతరాలయ దర్శనం' ఒకటి. అంతరాలయ



దేవస్థానం జారి చేసిన అంతరాలయ టిక్కెట్టు

దర్శనం రూ.500లు ఖరారు చేసారు.శనివారం అంతరాలయ దర్శనం కోసం పలువురు భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి స్వామి దర్శనానికి వచ్చారు. అయితే భక్తులు రద్దీ అధికమయ్యారని 'అంతరాలయ దర్శనం' రద్దు చేసారు. ఆన్‌లైన్‌లో అంతరాలయ టిక్కెట్లు జారి చేసారు. కానీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దాంతో టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు స్వామి గర్భగుడి వద్ద సిబ్బంది సమీరా అన్నారు.దాంతో భక్తులు ఆసహనానికి గురయ్యారు. తిరుగబడ్డారు. అనుమతించనపుడు టిక్కెట్లు ఎందుకు జారి చేసారని నిలదీసారు. సిబ్బంది మాకు సంబంధం లేదంటే భక్తులు ఎవరిని అడగాలో తెలియక ఇబ్బంది పడ్డారు. అయితే అంతరాలయ దర్శనం కావాలంటే మధ్యాహ్నం 3గంటల వరకు ఆగాలని ఉచిత సలహా ఇచ్చారు. అంతరాలయ దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు సిబ్బందితో గొడవ పడుతుంటే 'పిఆర్‌ఓ' కార్యాలయం నుంచి బ్రాచ్ గుంపులు గుంపులుగా రాజమార్గంలో వెళుతుంటే భక్తులు ఆగ్రహానికి హద్దుల్లేకుండా పోయింది.

**సమన్వయం లేని అధికారులు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కొరవడింది. భక్తులకు సేవల టిక్కెట్లను ఆన్‌లైన్‌లో జారి చేసి అనుమతించకపోవటంతో గొడవ ప్రారంభం అయ్యింది.భక్తులు స్వామి గర్భగుడివద్ద గొడవ పడగా భక్తుల్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోమని ఉచిత సలహా ఇచ్చారు.అంతే కుర్చుల్లేక నుంచి బయటకు వెళ్ళి కార్యాలయం వెతుక్కొని వెళ్ళి ఫిర్యాదు చేయటం సాధ్యమా?అని ప్రశ్నించారు.అయితే అక్కడ ఉన్న ఒకయనకుడు ఎఇకు ఫోన్‌చేస్తే నాకేం సంబంధం అని జవాబు వచ్చింది. అయితే రద్దీ సమయాల్లో ఇఒ లేనపుడు డిప్యూటిఇఒ పర్యవేక్షించాలి. అయితే ఆయన ఎక్కడా కనబడరు. కార్యాలయం నుంచి కాలు బయట పెట్టరు. సమస్యలను పట్టించుకోరు. ఇక ఎఇలు ఒకరిపై ఒకరు ఇలా సమన్వయం కొరవడి భక్తి భావంతో వచ్చిన భక్తుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు.

## తిరుమల సమాచారం



# 17న ఆణివార ఆస్థానం

### ఎల్లుండి కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం

### రేపు విఐపి బ్రేక్‌కు సిఫార్సులు తీసుకోరు

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17వతేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 14వతేదీ మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు.రానున్న మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. 17న ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. 14వతేదీ అష్టదళ పాదపద్మారాధన సేవరద్దుచేశారు. సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించరు. మంగళవారం విఐపి బ్రేక్ రద్దు చేశారు.



# తిరుమల కొండపై విపరీతమైన రద్దీ

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం కావడంతో తిరుమలలో క్యూ కాంప్లెక్స్‌లు దాటి క్యూలైన్లు బాటగంగమ్మఆలయం వరకు విస్తరించాయి. పెరిగిన భక్తులతాకిడితో కొండ కిటకిటలాడుతోంది.వారాంతం వరుస సెలవులతో శనివారం ఉదయానికి కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 24నుండి 30 గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని, భక్తులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారంరాత్రి వరకు 73,265 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం 4.26 కోట్ల రూపాయలు ఆదాయం లభించింది. ఆదివారం కూడా ఈ రద్దీ కొనసాగనుంది.



# ప్రాణదాన పథకానికి వైద్యుడి విరాళం

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు,ట్రస్టులలో ఎస్వీప్రాణదానం కూడా ప్రధానమైంది. ఎంతోమంది పేదలకు పలు రకాల అత్యాధునిక వైద్యం అందించేందుకు ఈ ట్రస్ట్ దోహదపడుతుంది. ఈ ట్రస్ట్‌కు తిరుపతికి చెందిన నారాయణాద్రి ఆస్పత్రి అధినేత డాక్టర్ సునందకుమార్ రెడ్డి, ఉషారాణి దంపతులు శనివారం 10లక్షల రూపాయల విరాళాన్ని ఇచ్చారు. ఈ విరాళాలను డాక్టర్ సునందకుమార్‌రెడ్డి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

# అలిపిరిమెట్ల మార్గంలో చిరుత

### మళ్లీ సంచారంతో భక్తుల్లో భయం

**తిరుమల,జులై 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నుండి తిరుమలకు గోవింద నామస్మరణతో కాలినడకన వచ్చే అలిపిరి మెట్లమార్గంలో అతి సమీపంలో శుక్రవారం రాత్రి చిరుత సంచరించడంతో కాలినడక భక్తులు వణికిపోయారు. ఈ మార్గంలో తిరుమలకు వస్తున్న భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మెట్ల మార్గానికి అతి సమీపంలో చిరుత ప్రత్యక్షం కావడంతో భయంతో బిగుసుకుపోయారు. కేకలు వేస్తూ, శబ్దం చేస్తూ దాన్ని తరిమికొట్టే ప్రయత్నం చేశారు. రాత్రి వేళ చిరుత సంచారంతో వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భద్రత చర్యలు చేపట్టారు .

శనివారం తెల్లవారు జామున తిరుమలకువస్తున్న శ్రీవారి భక్తులు అలిపిరి నడకమార్గంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి అతి సమీపంలో పొదల్లో చిరుతను గుర్తించారు. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అటూ ఇటు పరుగులు తీశారు. ఆనుపరాడ్లతో శబ్దంచేశారు. చిరుత కదలికపై నిఘా పెట్టారు. అలిపిరి కాలినడక మార్గంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఇదివరకే అమర్చిన ట్రాఫ్‌కెమెరాలతో చిరుత సంచారాన్ని కనిపెడుతున్నారు. గతంలో లాగే తిరుమల కాలినడక మార్గాల్లో మళ్ళీ చిరుతల సంచారం మొదలైందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది అలిపిరి నడక దారిలో చిరుత సంచరించిన విషయం తెలిసిందే. 350వ మెట్టు సమీపంలో, అలిపిరి ఎస్వీజూ పార్క్ మార్గంలో, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీ క్యాంపస్ ఆవరణలో చిరుతల సంచారం ఉంది.

అటవీప్రాంతంలో నీరు,ఆహారం దొరకక దారి తప్పిన చిరుతపులులు ఏకంగా ఘాట్‌రోడ్లపై, కాలినడక మార్గాల్లో భక్తులకు కనిపిస్తున్నాయి. అటవీప్రాంతం వదలి భక్తుల సంచారం ప్రాంతాల్లో వచ్చేస్తుండటంతో భయంతో వణికిపోతున్నారు. సాధారణంగా శేషాచలంఅటవీప్రాంతంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక,ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో లింకురోడ్డు దాటిన తరువాత గతంలో చిరుతల జాడ ఉండేది. గతంలో మొదటిఘాట్‌లోనేగాక రెండోఘాట్‌లోనూ, కాలినడక మార్గంలోనూ ఆగస్ట్, సెప్టెంబర్‌మాసాల్లో భక్తులపై చిరుతపులులు దాడిచేయడం, ఏకంగా చిన్నారులను హతమార్చిన ఘటనలు విధితమే. శేషాచలం అటవీప్రాంతం తిరుమల సప్తగిరులను ఆనుకుని ఉండటం, తిరుపతివైపు మంగళం, కరకంబాడి, మామండూరు, కుక్కలదొడ్డివరకు వ్యాపించిఉంది. ఇటు చంద్ర గిరి, శ్రీవారిమెట్టు, ఏ.రంగపేట, భాకరాపేట, పీలేరువరకు శేషాచలం అడవులు ఉన్నాయి. ప్రధానంగా తిరుపతివైపు కపిలతీర్థం, మంగళం, కరకంబాడివైపు ఉన్న అటవీప్రాంతంలో చిరుతపులులు, ఎలుగుబంట్లు. ఏనుగులు సంచారం ఎక్కువగా ఉంది.

# అలిపిరి ఆర్చికి ఆధ్యాత్మిక శోభ ఏదీ?

### మహామండపం తరహాలో మార్పులు ఎప్పుడు!

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు ప్రవేశించే ప్రధాన ద్వారం అలిపిరి ఆర్చికి కొత్త ఆధ్యాత్మిక శోభ తీసుకువచ్చేందుకు టిటిడి నిర్ణయించినా ఆ పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. ఇందుకోసం నిర్ణయించిన ప్రణాళికలు కూడా అమలుకు నోచుకోలేదు. తిరుమల క్షేత్రం వైభవాన్ని అలిపిరిలోనే భక్తులు తెలుసుకునేలా బేస్‌క్యాంప్ ఏర్పాటుతోబాటు మహామండపంలోకి వచ్చేలాగా అనుభూతి కలిగించేలా కొత్త డిజైన్లతో మార్పులు చేయాలని ఏడాదిక్రిందట ఆమోదించినా పనులు మాత్రం మొదలుకాలేదు.ఏకంగా ఈ నూతన నిర్మాణ బాధ్యతలను ఆర్కిటెక్ ఆనందసాయికి టిటిడి పాలకమండలి అప్పగించింది. ఇప్పటికే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పేరును తిరుపతి(రేణిగుంట)లోని



విమానాశ్రయానికి మార్పుచేస్తూ టిటిడి పాలకమండలి కేంద్రానికి ప్రతిపాదనలతో నివేదించిన విషయం విదితమే. తిరుపతి విమానాశ్రయం,అలిపిరి ప్రవేశద్వారం ఆర్చ్‌కు కొత్తరూపు తీసుకువచ్చేలా టిటిడి నిర్ణయం అభినందించదగినదైనా ఆ దిశగా మార్పులు మాత్రం జరగలేదు. తిరుమల ఐకానిక్‌గా ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేందుకు టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వాటి డిజైన్లలో పేరెన్నికగన్న ఆర్ట్‌డైరెక్టర్, టెంపుల్స్ ఆర్కిటెక్ ఆనందసాయి బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న ప్రయాణీకుల సంఖ్య పెరిగిన నేపధ్యంలో విమానాశ్రయంలోనూ తిరుమల శోభ కనిపించేలా మార్పుచేయనున్నారు. అలిపిరిలో మొదట ఉన్న గరుడవిగ్రహం కూడలిలోని ఆర్చిని ఆధునీ కరించాలని ఆలోచనతో టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గతంలో కాలినడకన అలిపిరి నుండి తిరుమలకు చేరుకున్నఆనందసాయి అలిపిరి నుండి ఆనందనిలయం వరకు చేపట్టాల్సిన అభివృద్ధి, ఆధ్యాత్మిక వాతావరణంపై చర్చించారు.రోజువారీగా లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తుంటే ఇందులో 20వేలమంది కాలినడక మార్గాల్లో, 60వేలమంది వరకు భక్తులు వాహనాల్లో ఘాట్‌రోడ్లపై ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో భక్తులు ఒక అనుభూతిచెందేలా మార్పులు జరగనున్నాయి. అలిపిరి వద్ద ఒక ఆధ్యాత్మికంగా మహామండపంలోకి ప్రవేశిస్తున్నామనే భావన భక్తులకు కలిగించేలా అలిపిరి ఆర్చి మార్పులు చేసే పనులు మొదలుపెట్టాలని భక్తులు కోరుతున్నారు.

# రెండేళ్లయినా పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించరా!

### రాష్ట్ర ఎస్‌టియు అధ్యక్షులు మల్లు రఘునాధరెడ్డి ధ్వజం

**చిత్తూరు, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు పిఆర్‌సి ఛైర్మన్‌ను సైతం నియమించలేదని రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షులు మల్లు రఘునాధరెడ్డి ధ్వజమెత్తారు. చిత్తూరులోని ఎస్టీయు జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్టీయు కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షులు మల్లు రఘునాధరెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా సత్వరం పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడంతో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో వున్న 5 డిఎలను మంజూరు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు చేసి అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వీసులోని ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష లేకుండా పార్లమెంటులో విద్యాహక్కు చట్టానికి చట్ట సవరణ చేయడానికి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంను ఒప్పించడానికి కృషి చేయాలన్నారు. అలాగే ఈ నెల 14వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ఎదుట ర్యాలీ, పికెటింగ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత గంటామోహన్‌ను తూర్పు రాయలసీమ




ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇన్‌ఛార్జీగా నియమించి ఎస్టీయు తరపున భవిష్యత్తులో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని తీర్మానం చేసి రాష్ట్ర సంఘానికి ప్రతిపాదనలు పంపారు. ఈ సమావేశంలో ఎస్టీయు నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, షేక్ ఇలియాజ్, పురుషోత్తం, దేవరాజులు, యువరాజు, హేమచంద్రారెడ్డి, బొబ్బిలిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

### సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్ కీలకం: కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, జూలై 11, ప్రభాతవార్త - కలెక్టరేట్ :**వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్, అదనపు ఎస్పీ సౌజన్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయస్థానాలపై కేసుల భారం అధికంగా ఉండటంతో అనేక కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. దీనివల్ల కక్షిదారులు సమయం, ధనం కోల్పోవాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకే రాజీ మార్గమే రాజమార్గం అనే భావనతో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు పక్షాలు పరస్పర అంగీకారంతో రాజీకి వస్తే ఇద్దరికీ ప్రయోజనం చేకూరడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థకు ఇళ్ల




పన్ను, వ్యాపార పన్ను, నీటి పన్ను తదితరాల రూపంలో సుమారు రూ.100 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించినప్పుడే ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అభివృద్ధి పనులు, ప్రజా సేవలను సమర్థవంతంగా అందించగలవని చెప్పారు. నేషనల్ లోక్ అదాలత్‌కు ముందు పంపిన నోటీసులకు స్పందించి శుక్రవారం సాయంత్రానికే సుమారు రూ. 1 కోటి పన్నుల బకాయిలు వసూలయ్యాయని వెల్లడించారు. మిగిలిన బకాయిదారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానం ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, భారతదేశంలో కూడా ప్రజలు దీనిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ, కుటుంబ, ఆస్తి, సివిల్ వివాదాల పరిష్కారం న్యాయవ్యవస్థ ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. అలాంటి వివాదాలకు లోక్ అదాలత్ అత్యంత సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు.

# కుప్పం చిగురుగుంట 'బంగారు'గనులపై చిగురిస్తున్న ఆశలు

### గనుల ప్రారంభానికి ఊపిరి పోసిన సిఎం చంద్రబాబు ప్రకటన !!

### ముగిసిన టెండర్ల బిడ్ గడువు.. త్వరలోనే టెండర్లు ఖరారు..?

### వేలాదిమందికి ఉపాధి అవకాశాలు.. గనులు తెరచుకుంటే 'స్వర్ణకుప్పమే'

**కుప్పం, జూలై 11 ప్రభాతవార్త:** కుప్పం చిగురుగుంట బంగారు గనులకు త్వరలో మహర్దశ పట్టడం ఖాయంగా కన్పిస్తోంది. దాదాపు పాతికేళ్ల అనంతరం బంగారు గనులు తెరచుకునేందుకు మార్గం సుగమం అవుతోంది. చిగురుగుంట గనుల నిర్వహణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన టెండర్ల బిడ్ ప్రక్రియ రెండు రోజుల క్రితం ముగిసింది. రేపో మాపో టెండర్లు ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవలే సిఎం చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పం పర్యటనలో చిగురుగుంట బంగారు గనుల్ని మళ్లీ ప్రారంభిస్తామని ప్రకటించడంతో గనుల ప్రారంభంకు మరలా సిఎం ఊపిరిపోశారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో బంగారు గనులు తెరచుకుంటాయని ఆశలు చిగురిస్తున్నాయి.

**1978లో మొదలై 2001లో మూత :** చిగురుగుంట బంగారు గనుల్లో బంగారం తవ్వకాలను 1978లో ఎంఇసిఎల్ అనే సంస్థ ప్రారంభించింది.ఈ సంస్థ 1982వరకు కార్యకలాపాలు కొనసాగించింది. అనంతరం 2001వరకు ఈ గోల్డ్‌మైన్స్‌ను భారత్ గోల్డ్‌మైన్స్ సంస్థ(బిజిఎంఎల్) నిర్వహించింది. చిగురుగుంటకు సమీపంలోనే కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్(కెజిఎఫ్) బంగారు గనులు, భారత్ గోల్డ్ మైన్స్(బిజిఎంఎల్) సంస్థలు ఉండేవి. చిగురు గుంట గనుల్లో తీసిన ముడి ఖనిజాన్ని కెజిఎఫ్‌కు తరలించి అక్కడ శుద్ధి చేసి బంగారాన్ని వేరుచేసేవారు. అప్పట్లోనే చిగురుగుంట గనుల్లో వేలాది మంది ఉపాధి అవకాశాలు పొందేవారు. అయితే రాను రాను గనుల్లో బంగారు నిక్షేపాలు తగ్గడం, ముడి ఖనిజం వెలికి తీసేందుకు అయ్యే వ్యయం అధికంగా ఉండడంతో చిగురుగుంట గనులతోపాటు కోలార్ గోల్డ్‌ఫీల్డ్ (కెజిఎఫ్) గనులు సైతం 2001లో మూతపడ్డాయి. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఈగనులను మూసేసింది.

**2011లో మైసూర్ జియోచే మరలా పరిశోధన :** 2001లోమూతపడ్డ చిగురుగుంట బంగారు గనుల ప్రాంతంలో మరలా మైసూర్ జియో సంస్థ ముడి బంగారం నిల్వలు ఉన్నాయా లేదా అనే అంశంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో 400 హెక్టార్ల ప్రాంతంలో పరిశోధనలు చేసింది. గనుల ప్రాంతంలో చిన్నపాటి బావులు తీసి వాటి ద్వారా ముడి బంగారం ఏమేర ఉందో నిర్ధారణ చేసి ఆ నిక్షేపాలను అప్పట్లో దేశరాజధాని న్యూఢిల్లీలోని ల్యాబ్‌కు పంపింది. ఈ ప్రాంతంలో ముడి బంగారు ఖనిజం ఉందని నిర్ధారణ అయ్యాక కేంద్రం తదుపరి చర్యలు చేపట్టింది. కాగా చిగురుగుంట ప్రాంతంలో 20లక్షల టన్నులు, బిసానత్తం వద్ద 1లక్ష టన్నులకు పైగా ముడి ఖనిజ నిల్వలు ఉన్నట్లు సమాచారం.

**2018లో మరలా టెండర్లు :** చిగురుగుంట బంగారు గనుల నిర్వహణకు కేంద్రం 2018సం॥ చివర్లో టెండర్లు పిలిచింది. ఆస్ట్రేలియా దేశంకు చెందిన పలు సంస్థలతో పాటు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ('ఎన్ఎండిసి) పోటీ పడ్డాయి. చివరకు ఎన్ఎండిసి సుమారు 500కోట్లకు టెండర్లు ఖరారు చేసుకుంది. తదనంతరం 2019లో అధికారంలో వచ్చాక వైఎస్ జగన్ సిఎంగా ఉన్న సమయంలో చిగురు గుంట గనుల్ని తెరిపిస్తామని పేర్కొన్నా ఆచరణలో సాధ్యం కాలేదు. పర్యావరణ అనుమతులు, ప్రభుత్వంచే గనుల ప్రాంతం అప్పగింత, మైనింగ్ ప్రణాళిక తదితర అంశాలు కొలిక్కి రాకపోవడంతో ఎన్ఎండిసి గతేడాది ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా చిగురుగుంట గనుల నిర్వహణకు టెండర్లు పిలిచాయి. ఈనెల 9తో బిడ్ గడువు ముగిసింది. త్వరలోనే టెండర్లను ప్రభుత్వాలు ఖరారు చేయనున్నాయని తెలుస్తోంది. ఇదే జరిగితే అతి త్వరలోనే కుప్పం గోల్డ్‌మైన్స్ మరోమారు విపణిలో మెరవడం ఖాయమే. చిగురుగుంట గనులు ప్రారంభమైతే కుప్పం ప్రాంతంలో వేలాది మందికి స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. 2011లో చిగురుగుంట గనుల్లో పరిశోధన చేసిన జియో మైసూరు సంస్థ ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన జొన్నగిరి గోల్డ్‌మైన్స్‌ను నిర్వహించడం విశేషం.


చిగురుగుంట గనుల ప్రాంతం

# రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌ఛైర్మెన్‌గా పి.షణ్ముగం నియామకం

**చిత్తూరురూరల్, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌ఛైర్మెన్‌గా పి షణ్ముగం నియమితులయ్యారు. శనివారం విజయవాడలోని ఎసిటియు భవన్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఏపి ఒలంపిక్ అసోసియేషన్‌కు అనుబంధంగా వున్న ఏపి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో షణ్ముగం పేరును వైస్‌ఛైర్మెన్‌గా ప్రతిపాదించగా అనుబంధ జిల్లా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రవ్యాప్తంగా సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంతో నియామకం చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడకు మరింత ప్రోత్సాహం అందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఆయన నియామకం పట్ల క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, అబిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# భక్తుల రద్దీతో పోటెత్తిన కాణిపాకం

**కాణిపాకం, జూలై 11 ప్రభాతవార్త:** వరుస సెలవులతో కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఆలయంలో సాధారణంగా వారంతపు రోజులు, వరుస సెలవు రోజుల్లో తీవ్ర స్థాయిలో భక్తుల రద్దీ వుంటుంది. ఈ మేరకు శని, ఆదివారాల్లో వారాంతపు రోజులతో పాటు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో స్వామి వారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుండి కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి సైతం భక్తులు స్వామి దర్శనార్థం భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయంలోని క్యూ కాంప్లెక్స్, క్యూ లైన్లు పూర్తి రద్దీతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా రూ.100 శీఘ్ర దర్శనం, రూ.150అతి శీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతంగంటల తరబడి క్యూ లైన్లలో వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.


# వియత్నాం బోటు ప్రమాదంలో పురం యువకుడు దుర్మరణం


రవితేజ (ఫైల్)

**హిందూ పు రం జులై 11 ప్రభాతవార్త:** వియత్నం దేశంలో విహారయాత్రకు వెళ్లిన శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెంది న రవితేజ(40) దుర్మరణం చెందారు. స్థానిక టీచర్స్ కాలనీలో నివసిస్తున్న రవితేజ ధనలక్ష్మి రోడ్లో లక్కీ మొబైల్ షాపును నిర్వహించేవారు. లావా కంపెనీ ఫోన్లను అధికంగా సేల్ చేయడంతో విహారయాత్రకు సెలెక్ట్ అయి కంపెనీ తరఫున వియత్నానికి మూడు రోజుల క్రితం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో వియత్నం దేశంలో సముద్రంలో స్పీడ్ బోట్ లో వెళ్తుండగా ఒకసారిగా అలల తాకిడి పెరిగి బోటు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో రవితేజతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మృత్యువాత పడ్డారు. ఇదిలా ఉండగా రవితేజ మరణ వార్త తెలుసుకొని కుటుంబ సభ్యులు షాక్ గురయ్యారు. తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు శోక సంద్రంలో పడిపోయారు. రవితేజ తండ్రి ఆదిశేషయ్య చాలా ఏళ్ల క్రితమే చనిపోగా ఆ కుటుంబానికి ఏకైక కుమారుడైన ఇతను కూడా మరణించడంతో మగదిక్కు లేకుండా పోయిందని ఆత్మీయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో మంచివాడిగా పేరొందిన రవితేజ అకాల మరణం చెందడంతో స్నేహితులు, పుర ప్రజలు చలించి పోయారు. వియత్నం నుంచి మృతదేహాన్ని వీలైనంత తొందరగా రప్పించేందుకు భారత ఎంబసీ ద్వారా బంధువులు ప్రయత్నాలు చేస్తున్నారు. వరుసకు అన్న అయినా భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన తమ్ముడు మృతి జీర్ణించుకోలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు.

# కీమా రుచులు

మటన్ ముక్కల్లో సింగిల్ ఎముక లేకుండా కీమా కొట్టడం అంటే మామూలు ముచ్చట కాదు. అంతపద్ధతిగా కొట్టిన కీమా..చేయి తిరిగిన వంటవాడి చేతిలో పెడితే.. ఎలా ఉంటుంది చెప్పండి? మసాలా దట్టించుకొని.. నూనెలో మునిగి.. కూరలో తేలి..బిర్యానీలో కుదిరి.. పళ్లెంలోకి వచ్చేస్తుంది. ముదముద్దనూ ఆస్వాదిస్తూ లాగించేయడమే మన పని. కాదంటారా! అయితే వెరైటీలు చేసి చూడండి. కీమా కథ క్లైమాక్స్‌లో ఆహా, ఓహోలు తప్ప మరే మాటలూ వినిపించవు !



## కార్జం-కీమా ..

**కావాల్సినవి :** కీమా-300గ్రా, నూనె-నాలుగు చెంచాలు, ఉల్లిపాయ-ఒకటి, అల్లం-రెండు అంగుళాల ముక్క, వెల్లుల్లి రెబ్బలు-పది, టమాటా గుజ్జు - నాలుగు చెంచాలు, పసుపు-అరచెంచా, కారం- అరచెంచా, ధనియాలపొడి-రెండు చెంచాలు, గరంమసాలా పొడి- అరచెంచా, ఉప్పు-రుచికి తగినంత, కార్జం-200 గ్రా, కొత్తిమీర కొద్దిగా.

**తయారీ :** ఒక కడాయిలో నూనె పోసి వేడిచేసుకోవాలి. తరిగిన ఉల్లిముక్కలని నూనెలోవేసి గోధుమరంగులోకి వచ్చేంత వరకూ వేయించుకోవాలి. మిక్సీలో అల్లం,వెల్లుల్లి రెబ్బలువేసి మెత్తగా మిక్సీ పుట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేగిన ఉల్లిపాయముక్కల్లో వేసి మూడు నిమిషాలపాటు వేయించుకోవాలి. ఆ తర్వాత టమాటా గుజ్జు కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించు కోవాలి. ఇప్పుడు పసుపు, కారం, ధనియాల పొడి, గరంమసాల పొడి,ఉప్పు కూడా వేసుకోవాలి. ఇవన్నీ ఉడుకుతూ నూనెపైకి తేలుతుంది. అప్పుడు కీమా వేసి మూతపెట్టి పావుగంటపాటు ఉడికించుకోవాలి. చివరిగా కార్జం కూడా వేసి మరో పది నిమిషాలపాటు ఉడికించుకుంటే రుచకరమైన కీమాకార్జం సిద్ధమవుతుంది.



## కీమా బిర్యానీ...

**కావల్సినవి :** బాస్మతి బియ్యం-350, పెరుగు-3 చెంచాలు, అల్లం పేస్ట్-చెంచా, నెయ్యి-100గ్రా, కుంకుమపువ్వు-చిటికెడు, కారం-చెంచా నిమ్మరసం-చెంచా, కీమా-400 గ్రా, ఉల్లిపాయ-ఒకటి, వెల్లుల్లి పేస్ట్ - చెంచా, పాలు-అరకప్పు, దాల్చినచెక్క-ఒకటి, లవంగాలు-నాలుగు, చికెన్ ఉడికించిన నీళ్లు-కప్పు, ఉప్పు-తగినంత.

**తయారీ:** ముందుగా బాస్మతి బియ్యాన్ని ఉప్పు వేసిన నీళ్లలో పలుకుగా ఉడికించి వార్చి పక్కన పెట్టుకోవాలి. పాలల్లో కుంకుమపువ్వు కలిపి పక్కనపెట్టుకోవాలి. కడాయిలో నెయ్యి వేడి చేసుకుని అందులో ఉల్లిపాయ ముక్కలు ముదురు గోధుమరంగులోకి వచ్చేంతవరకూ వేయించుకోవాలి. ఇందులోనే దాల్చినచెక్క, లవంగాలు వేసి వాటి పరిమళం బయటకు వచ్చేంతవరకూ ఉండాలి. ఇందులోనే కీమా వేసి గరిటెతో కలియతిప్పి.. అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించి ఉప్పు కలుపుకోవాలి. కీమా పూర్తిగా వేగిన తర్వాత.. పెరుగు, కారం వేసి తక్కువ మంట మీద మగ్గించుకుని పక్కన పెట్టుఓవాలి. కుక్కర్ కానీ, మూత ఉన్న మందపాటి పాత్రను కానీ తీసుకుని ముందుగా పలుకుగా ఉడికించిన అన్నాన్ని ఒక పొరలా వేసుకోవాలి. దానిపై ఉడికించిన కీమాని వేసుకోవాలి. ఆపైన కుంకుమపువ్వు కలిపిన పాలను సగం పోసుకుని, ఆపై కొద్దిగా నిమ్మరసం వేసుకోవాలి. ఇదే పద్ధతిలో మళ్లీ పలుకుగా ఉడికించిన అన్నం, కీమా, పాలు వేసి చివరిగా తగినంత చికెన్ ఉడికించిన నీళ్లు పోసుకోవాలి. ఆవిరి బయటకు పోకుండా మూతపెట్టేసి తక్కువమంట మీద పదిహేను నిమిషాల పాటు ఉడికించుకుని దింపుకోవాలి. కుక్కర్‌ని నేరుగా మంట మీద పెట్టకుండా ఒక పాన్ పెట్టుకుని దానిమీద పెట్టుకుంటే అడుగు మాడకుండా బిర్యాని చక్కగా పొడిపొడిగా వస్తుంది.

## తవా కీమా...



**కావాల్సినవి :** కీమా-పావుకేజీ, ఉల్లిపాయ-ఒకటి, టమాటాలు-రెండు, కసూరీమేథీ- అరచెంచా, కారం-చెంచా, పసుపు- పావుచెంచా, అల్లంవెల్లుల్లి పేస్ట్- చెంచా, సన్నగా తరిగిన అల్లం-చెంచా, పిచ్చిమిర్చి-రెండు, జీలకర్ర- చెంచా, ఉప్పు తగినంత, గరంమసాలా-అరచెంచా, నూనె-. నాలుగు చెంచాలు.

**తయారీ:** పెనంగానీ, వెడల్పుగా, మందంగా ఉండే పాన్‌గానీ తీసుకుని అందులో రెండు పెద్ద చెంచాల నూనె పోసుకోవాలి. అది వేడెక్కిన తర్వాత అల్లం వెల్లులి పేస్ట్ వేసి అది పూర్తిగా వేగిన తర్వాత కీమా కూడా వేసి రంగు మారేంతవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత టమాటా ముక్కలు వేసి మూతపెట్టేసి మరో ఐదు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఇప్పుడు ఉప్పు, పసుపు, కారం, కసూరిమేథి, జీలకర్రపొడి, గరంమసాలా పొడి వేసి పూర్తిగా కలిసేంతవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించుకుని తగినన్ని నీళ్లు పోసి సన్నమంట మీద ఉంచి కీమాని పూర్తిగా ఉడికించుకోవాలి. చివరిగా సన్నగా తరిగిన అల్లం ముక్కలు పైన అలంకరించుకుంటే తవా కీమా రెడీ. పావ్ బ్రెడ్‌లకి కొద్దిగా బటర్ రాసి పెనంపై వేడిచేసి కీమాతో కలిపితింటే చాలా రుచిగా ఉంటాయి. ముంబయి స్ట్రీట్‌ఫుడ్ పావ్‌కీమా చాలా ప్రసిద్ధి. □

## చిట్కా

అర్ధరోగహారి నిద్రాహా:సరైన నిద్ర, మీ వ్యాధుల లో సగం నయం చేస్తుంది. మనిషికి ఆహారం ఎంత ముఖ్యమో, తగినంత నిద్ర కూడా అంతే ముఖ్యం. ఆరోగ్యవంతుడు రోజుకి కనీసం ఆరు గంటలు నిద్రపోవాలి. తిన్న ఆహారం జీర్ణం కావడానికి, శారీరక శ్రమ వల్ల కాళ్ళు, చేతులు, గుండె, మెదడు మొదలైన ముఖ్య అంగాలు అలసట తీరి సక్రమంగా పనిచేయడానికి నిద్ర ఉపకరిస్తుంది. అటువంటి వారికి రోగాలు దరిచేరవు. కనుక మంచి నిద్ర సగం రోగాలను హరించి వేస్తుంది అని ఈ సూక్తికి అర్థం. □

# చిరు ప్రాయంలో వ్యక్తిత్వ సూత్రాలు



దేశం ఏదైనా, ప్రేమాప్యాయతలు ఎలాంటివైనా, పిల్లల నడవడికల గురించి ఇప్పుడు తల్లిదండ్రులు ఎంతో ఆందోళన పడుతున్నారు. సోషల్ మీడియా వచ్చాక పిల్లల్ని అదుపులో పెట్టడమే కష్టమౌతోంది. మా రోజుల్లో ఇలా లేదమ్మా! ఇప్పుడే ఈ వికామంతా ! అంటూ పెదవి విరుపులు వినడం కద్దు. ఐనా కానీ వారిని నయానో భయానో దార్లో పెట్టడం కన్నా చిన్ననాటి నుంచీ వ్యక్తిత్వానికి పునాది. ప్రాధాన్యతనిచ్చి చిన్న చిన్న అలవాట్లు ను సరిదిద్దగలిగితే అవే పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని జపాన్ పేరెంటింగ్ చెబుతోంది . ఈ విలువలను రోజూ ఆచరణలో చూపిస్తూ పిల్లలకు అలవాటు చేస్తారు. అందుకే గౌరవం, బాధ్యత, కృతజ్ఞత, క్రమశిక్షణ వంటి లక్షణాలు వారి వ్యక్తిత్వం లో భాగమైపోతాయి. మంచి మనుషులను తీర్చిదిద్దాలంటే ఖరీదైన పాఠశాలలు, సాంకేతిక పరికరాలు అవసరం లేదని.. సరైన విలువలు, మంచి అలవాట్లు నేర్పిస్తే చాలని జపాన్ పేరెంటింగ్ ప్రపంచానికి చెబుతోంది. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల కన్నా ఏ ఇతర దేశ ఆచార వ్యవహారాలూ గొప్పవి కాదు. కానీ ప్రాశ్చాత్య సంస్కృతి ప్రభావం పిల్లలపై ఎక్కువగా ఉంది. అందుకే ఎవరి జాగ్రత్తలో వారుండాలి. పిల్లలు బాగా చదివి మంచి ఉద్యోగం సాధించాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. కానీ మార్కులు, ర్యాంకులే జీవిత విజయాన్ని నిర్ణయించవని జపాన్ తల్లిదండ్రులు నమ్ముతారు. పిల్లలు మంచి మనుషులుగా ఎదగాలంటే చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు, విలువలు నేర్పాలని భావిస్తారు. పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇవ్వకుండా.. రోజువారీ జీవితంలోనే వాటిని అలవాటు చేస్తారు. అందుకే జపాన్ పేరెంటింగ్ విధానం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.. హోదా, వృత్తిని బట్టి కాకుండా ప్రతి మనిషిని మర్యాదగా చూడాలనే భావన చిన్నప్పటి నుంచే అలవాటు చేస్తారు. దీంతో ఇతరుల పట్ల గౌరవం, వినయం పిల్లల్లో సహజంగా పెరుగుతాయి.భోజనం ముందు, దైవానికి కృతజ్ఞత చెప్పే విషయంలో మనకూ ఓ మంచి సంప్రదాయం. ఉంది. వారూ అలాంటి సంప్రదాయాన్నే పాటిస్తారు. ఆడుకున్న తర్వాత బొమ్మలు సర్దుకోవడం, గదిని శుభ్రం చేసుకోవడం, ఉపయోగించిన వస్తువులను తిరిగి వాటి స్థానంలో పెట్టడం వంటి పనులు పిల్లలే చేయాలని ప్రోత్సహిస్తారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులే తమ తరగతి గదులను శుభ్రం చేస్తారు. దీంతో బాధ్యత, స్వీయ క్రమశిక్షణ పెరుగుతాయి.బ్యాగ్, పుస్తకాలు, చెప్పులు, బొమ్మలు.. ఏ వస్తువైనా జాగ్రత్తగా ఉపయోగించడం నేర్పిస్తారు. కొత్తవి కొనివ్వాలని అడగడం కంటే ఉన్నవాటిని సంరక్షించ డం ముఖ్యం అని తెలియజేస్తారు. దీంతో వస్తువుల విలువ అర్థమవు తుంది. సమయానికి చేరుకోవడం అంటే ఎదుటివారి సమయాన్ని గౌరవించినట్టేనని జపాన్‌లో భావిస్తారు. అందుకే స్కూల్, క్లాస్, సమావేశం.. ఎక్కడికైనా సమయానికి వెళ్లే అలవాటు చిన్నప్పటి నుంచే పెంచుతారు. ఇది జీవితాంతం క్రమశిక్షణగా మారుతుంది. క్యూలో ఓపికగా నిలబడటం, పబ్లిక్ ప్రదేశాల్లో మర్యాదగా ఉండటం వంటి అలవాట్లు సానుభూతి, సామాజిక బాధ్యతను పెంచుతాయి. ఆహారం విలువ, సహజ వనరుల ప్రాముఖ్యత పిల్లలకు అర్థమవుతుంది. విద్య అంటే పాఠశాలకే పరిమితం కాదని జపాన్ తల్లిదండ్రులు యోచన. పుస్తకాలు చదవడం, కొత్త విషయాలు తెలుసుకోవడం, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం జీవితాంతం కొనసాగాలని ప్రోత్సహిస్తారు. దీంతో పిల్లల్లో జిజ్ఞాస, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. బస్సులు, రైళ్లు, లైబ్రరీలు, క్యూల్లో బిగ్గరగా మాట్లాడ కుండా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉండటంమంటే జపాన్ ప్రజలకు పవిత్రత కార్యంగా భావిస్తారు. □

## అంతర్వాణి

# మనకన్నీ దేవుడే ఇచ్చాడు కదా..!

ఒకరోజు సొలొమోను అనే ఇశ్రాయేలీయుల రాజు వద్దకు ఇద్దరు వేశ్యలు వచ్చారు. వారిలో ఒక స్త్రీ రాజుతో ఇలా మనవి చేసింది. 'రాజా..నా యేలినవాడా! నేను ఈ స్త్రీ మేమిద్దరం ఒకే ఇంట్లో ఉంటాం. మూడురోజుల తేడాతో మేం పిల్లల్ని కన్నాం. మేం తప్ప ఇంట్లో ఎవరూ ఉండరు. అయితే రాత్రివేళ ఈ స్త్రీ నిద్రలో తన పిల్లపై పడగా ఆ బిడ్డ చనిపోయింది. మధ్యరాత్రివే ఆమె వచ్చి, బతికి ఉన్న నాబిడ్డను తనవద్ద పెట్టుకుని, మృతి చెందిన తన బిడ్డను నా పక్కన పడుకోబెట్టింది. ఉదయం నేను పాలు ఇచ్చేందుకు చూడగా అది చనిపోయింది. నిదానించి బిడ్డను పరిశీలిస్తే ఆ బిడ్డ నాది కాదు. అయితే బతికి ఉన్న బిడ్డ అని చెప్పింది. రెండవ స్త్రీ కాదు బతికి ఉన్న బిడ్డ నాది, చచ్చిన బిడ్డ ఆమెదే అని చెప్పింది. ఇలా ఇద్దరు బతికి ఉన్నది నాది అంటే నాది అని గొడవకు దిగారు. సొలొమోను రాజు మహాజ్ఞాని కాబట్టి వెంటనే ఒక పెద్ద కత్తి తెమ్మని, తమసేవకుడికి చెప్పాడు. అతడు కత్తి తెచ్చిన తర్వాత రాజు ' ఆ కత్తితో బతికి ఉన్న బిడ్డను రెండు ముక్కలుగా చేసి, చెరి సగం ఇవ్వమని' చెప్పాడు. సేవకుడు ఆ ప్రయత్నం చేసేందుకు కత్తి ఎత్తగా.. బతికి వున్న నిజమైన తల్లి కడుపులో పేగులు తరుగు కొనిపోయినదై 'రాజా! బిడ్డను మాత్రం చంపవద్దు, ఆమెకే ఇవ్వండి' అని మనవి చేసింది. రెండవ స్త్రీ మాత్రం కాదు అది నాదైననుదాని దైనను కాకుండా చెరిసగము చేయమని కోరింది. వెంటనే రాజు తల్లిని ఎంతవ గాత్రం చంపవద్దని చెప్పిన స్త్రీకే ఆ బిడ్డను ఇవ్వ..ఆమె నిజమైన తల్లి అని తీర్పు చెప్పాడు. తన బిడ్డ మరణించింది కాబట్టి, తనతోటి స్త్రీ బిడ్డ కూడా చనిపోవాలని రెండస్త్రీ ఆశించింది. కానీ నిజమైన తల్లి మాత్రం బిడ్డ ప్రాణంతో ఉంటే చాలు.. తన వద్ద లేక పోయినా పర్వాలేదని భావించింది.దేవుడు ఇంతటి జ్ఞానం సొలొమోనుకు రాజు ఇచ్చాడు. ఆ తెలివితేటలతో ఎన్నో కీర్తనలు, సామెతలను రాశాడు. కానీ వృద్ధాప్యంలో మాత్రం చాలామంది స్త్రీలను వివాహం చేసుకుని, దేవుడికి వ్యతిరేకంగా పాపంలో జీవిస్తూ, మరణింస్తారు. సొంత తెలివి తేటలతో దేవుడిని సేవించలేం. మనకు ఏదైతే ఉందో అదంతా దేవుడు ఇచ్చిన కృపగా, బహుమానంగా భావించాలి. జ్ఞానముగలవానికి ఉపదేశము చేయగా వాడు మరింత జ్ఞానము నొందును (సామెతలు 9:9). ఆస్తిపాస్తులు, తెలివితేటలు, హోదా, ఆరోగ్యం, అంతస్తులు ఏవైనా సరే ఇవన్నీ దేవుడు తన దయతో మనకు ఇచ్చాడు అనే భావనతో మిక్కిలి వినయంతోప్రభువును సేవించాలి. ఆ జ్ఞానం పరలోకానికి చేర్చేలా ఉండాలి.

**- పి.వాణిపుష్ప**

## తెర

# 'ఓ.! సుకుమారి' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. : నిర్మాత మహేశ్వర్ రెడ్డి



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఓ.! సుకుమారి'తో అలరించబోతున్నారు.

**'ఓ..! సుకుమారి' ఎలా ఉండబోతోంది?**

ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఎమోషన్, కామెడీ, వినోదం అన్నీ సమపాళ్లలో ఉంటాయి. సినిమా చాలా బాగా వచ్చింది.

**ఈ సినిమా ఎలా మొదలైంది?**

మా డీవోపీ దర్శకుడు భరత్ దర్శన్‌ను పరిచయం చేశారు. ఆయన కథ చెప్పారు. కథ చాలా నచ్చింది. దాదాపు ఏడాది పాటు స్క్రిప్ట్‌పై వర్క్ చేసిన తర్వాత సినిమా ప్రారంభించాం.

**ఈ కథలో మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?**

ఈ సినిమాలో ఒక యూనిక్ పాయింట్ ఉంది.'షాక్ కొట్టడం' అనే కాన్సెప్ట్ చుట్టూ వచ్చే వినోదం, భావోద్వేగాలు చాలా కొత్తగా ఉంటాయి. ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తాయి.

**తిరువీర్, ఐశ్వర్య రాజేష్‌లను ఎంపిక చేయాలనే ఆలోచన ఎవరిది?**

కథకు తిరువీర్, ఐశ్వర్య రాజేష్ అయితే బాగా సరిపోతారని అనిపించింది. ఐశ్వర్య రాజేష్ కోసం దాదాపు మూడు నెలలు వెయిట్ చేశాం. ఆమె ఓకే చెప్పిన తర్వాతే షూటింగ్ ప్రారంభించాం.

**సినిమా గురించి ప్రేక్షకులకు ఏమి చెబుతారు?**

ప్రేక్షకులు టికెట్‌కు పెట్టిన ప్రతి రూపాయికి పూర్తి స్థాయి వినోదం పొందుతారు. ఇది ప్రతి కుటుంబం కలిసి చూసే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.

**ఈ సినిమాను థియేటర్లను దృష్టిలో పెట్టుకునే తీశారా?**

అవును. నేను మొదట నుంచి డిస్ట్రిబ్యూటర్‌ని. అందుకే థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను రూపొందించాం.

**పాన్ ఇండియా రిలీజ్ చేయడానికి కారణం ఏమిటి?**

తిరువీర్‌కు తెలుగులో మంచి గుర్తింపు ఉంది. ఐశ్వర్య రాజేష్ కోసం తమిళంలో కూడా రిలీజ్ చేస్తున్నాం.

**అనుకున్న బడ్జెట్‌లోనే సినిమా పూర్తి చేశారా?**

నేనే అనుకున్న దానికంటే ఎక్కువ ఖర్చు చేశాను. ఈ రోజుల్లో ప్రేక్షకులు ప్రతి రూపాయికి విలువ కోరుకుంటున్నారు. ఖచ్చితంగా విజయం సాధిస్తుంది.

# 'లెనిన్' సక్సెస్ మీట్‌లోనాగార్జున



లెనిన్‌ను ఆదరిస్తోన్న తెలుగు ప్రేక్షకులకు థాంక్స్.. సక్సెస్ మీట్‌లో అఖిల్ అక్కినేని.. అఖిల్ హిట్టు కొట్టాడు అని అందరూ అంటుంటే ఆనందంగా ఉంది..'లెనిన్' సక్సెస్ మీట్‌లో నిర్మాత సూర్య దేవర నాగవంశీ.. అఖిల్ అక్కినేని హీరోగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదలై బ్లాక్ బస్టర్ టాక్‌తో సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ..నిర్మాత కింగ్ నాగార్జున మాట్లాడుతూ అన్నమయ్య చేశాక నేను దేవుడ్ని ఏదీ అడిగింది లేదు. కానీ తిరుపతిలో ఈవెంట్ అయ్యాక.. స్వామిని దర్శించుకున్నప్పుడు మాత్రం మా వాడికి ఓ హిట్టు ఇవ్వండని అడిగాను. భాగ్యశ్రీ కూడా అదే కోరుకుందని తర్వాత నాకు తెలిసింది. ముందుగా ఆ వెంకటేశ్వర స్వామికి కృతజ్ఞతలు. లెనిన్‌కి వాయిస్ ఇచ్చిన నా పెద్ద అబ్బాయి తారక్‌కి థాంక్స్. ఏడాదిన్నర క్రితం తండేల్ సక్సెస్ మీట్‌కి వచ్చాం. ఇప్పుడు ఇలా లెనిన్ సక్సెస్‌కి వచ్చాను. ఇద్దరూ నా రెండు కళ్లలాంటి వాళ్లు. లెనిన్ టీంని చూస్తే అసూయగా ఉంది. అందరూ ఎంతో ఇష్టపడి కష్టపడి చేశారు.'శివ,'నిన్నే పెళ్లాడుతా, అన్నమయ్య సినిమాలు కూడా ఇలానే అందరం కలిసి చేశాం. ఈ మధ్య నాకు మళ్లీ ఇలాంటి అనుభవం కలగడం లేదు.'లెనిన్'కి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అని అన్నారు..హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ లెనిన్ ఓ డిఫరెంట్ మూవీ అని మాకు తెలుసు. కమర్షియల్‌గా ఎలాంటి నంబర్స్ వస్తాయో అని అనుకున్నాను. కానీ మా లెనిన్ చిత్రానికి ప్రేక్షకులు గొప్ప విజయాన్ని అందించారు.

# 'శ్రీనివాస మంగాపురం'తో తెలుగులో పరిచయం కావడం నా అదృష్టం. : రాషా తడానీ



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. .

**'శ్రీనివాస మంగాపురం' కథను ఎప్పుడు విన్నారు?**

గత ఏడాది జూలైలో ఈ కథ విన్నాను. దర్శకుడు అజయ్ భూపతి గారు కథ చెప్పిన విధానం, పాత్రలను, అందులోని ప్రేమ, ఎమోషన్‌ను తీర్చిదిద్దిన తీరు నాకు ఎంతగానో నచ్చాయి.

**మీ క్యారెక్టర్ ఇందులో ఎలా ఉండబోతుంది?**

నా పాత్రకు రెండు షేడ్స్ ఉంటాయి. ఒకవైపు చాలా బబ్లీగా, ఎక్సైటెడ్‌గా ఉంటుంది. మరోవైపు చాలా పద్ధతిగా, హుందాగా ఉండే అమ్మాయిగా కనిపిస్తుంది. నాకు తెలుగు అర్థమవు తుంది. కానీ స్పష్టంగా మాట్లాడలేను. ఈ సినిమా కోసం దర్శకుడు అజయ్ భూపతి ప్రతి డైలాగ్, అందులోని ఎమోషన్‌ను దగ్గరుండి నేర్పించారు. ప్రతి విషయంలో చాలా కేర్ తీసుకున్నారు. మంగా పాత్ర నాకు చాలా దగ్గరగా ఉంటుంది.

**జయకృష్ణ ఘట్టమనేనితో పని చేయడం ఎలా అనిపించింది?**

జయకృష్ణ చాలా స్వీట్ అండ్ కూల్ పర్సన్. సెట్లో చాలా సరదాగా వుంటారు. షూటింగ్ సమయంలో చాలా ఫన్ ఉండేది.

**మోహన్ బాబుతో పని చేయడం ఎలా అనిపించింది?**

మా అమ్మగారు కూడా మోహన్ బాబుతో కలిసి పని చేశారు. ఆయనతో పని చేయడం చాలా ఫన్ ఎక్స్‌పీరియెన్స్. సెట్లో చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడూ జోకులు చెబుతూ ఉంటారు.

**ఇది తెలుగులో మీ మొదటి సినిమా. ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు?**

నాకు తెలుగు తెలియదు. మొదట్లో డైలాగులు అర్థం చేసుకోవడానికి కాస్త కష్టపడ్డాను. కానీ దర్శకుడు అజయ్ భూపతి నాకు చాలా హెల్ప్ చేశారు. తెలుగు, హిందీ కలిపి డైలాగుల అర్థం చెప్పేవారు.

**వైజయంతి మూవీస్ ద్వారా తెలుగులో రావడం ఎలా అనిపించింది?**

వైజయంతి మూవీస్ చాలా ప్రతిష్టాత్మకమైన సంస్థ. ఆ సంస్థ నుంచి మహేష్ బాబుతో పాటు ఎంతో మంది స్టార్స్ పరిచయం అయ్యారు. నా జీవితంలో కలిసిన బెస్ట్ పర్సన్‌లలో అశ్వినిదత్ ఒకరు.

# ఎంఆర్‌పి 'నీకెంత నాకెంత' ప్రీ రిలీజ్ ఈవెంట్.



ఈ చిత్రంలో నరేష్ అగస్త్య హీరోగా నటించగా, డోనల్ బిష్ట్ కథానాయికగా అలరించనున్నారు. అలాగే వెన్నెల కిషోర్, సుదర్శన్, కసిరెడ్డి రాజ్‌కుమార్, హర్ష వర్ధన్, చైతన్య జొన్నలగడ్డ, పృథ్వీ రాజ్, గగన్ విహారి, నంద గోపాల్, స్నేహా సింగ్ తదితరులు కీలక పాత్రల్లో నటించి సినిమాకు మరింత బలం చేకూర్చారు. శ్రవణ్ జేష్ఠ నిర్మాతగా, దర్శకుడిగా తెరకెక్కించిన ఈ చిత్రానికి రాకేష్ కొలాంచి సినిమాటోగ్రఫీ అందించగా, అజయ్ అరసాడ సంగీతాన్ని సమ కూర్చారు. మార్థాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. దర్శక నిర్మాత శ్రవణ్ జేష్ఠ మాట్లాడుతూ:.. మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విచ్చేసి మాకు అండగా నిలిచిన మీడియా మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాను పూర్తి చేయడానికి తమ సమయం, కృషిని అంకితం చేసిన మా నటీనటులు, సాంకేతిక నిపుణులు, మొత్తం చిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు.

.హీరో నరేష్ అగస్త్య మాట్లాడుతూ:.. మా ఎంఆర్‌పి 'నీకెంత నాకెంత' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విచ్చేసి మాకు అండగా నిలిచిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన మా దర్శక నిర్మాత శ్రావణ్ జేస్తాకి ప్రత్యేక కృతజ్ఞతలు. హీరోయిన్ డోనల్ బిష్ట్ మాట్లాడుతూ:.. ఎంఆర్‌పి నీకెంత నాకెంత నా తొలి తెలుగు సినిమా కావడం నాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఈ సినిమాపై వస్తున్న స్పందన చూసి చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది.

# 'సూపర్ హీరో బాబు' ఫస్ట్ లుక్ విడుదల




అర్జున్ దాస్, శాండీ మాస్టర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సూపర్ హీరో బాబు' (తమిళంలో 'సూపర్ హీరో'). ఈ చిత్రాన్ని జాతీయ అవార్డు గ్రహీత నిర్మాత కె.ఎస్. సినిష్ 'సోల్జర్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ' బ్యానర్‌పై సమర్పిస్తుండగా 'రెడాక్టెడ్ స్టూడియోస్'కు చెందిన శంజన్ జి సంయుక్తంగా నిర్మించారు. తెలుగు తమిళ ద్విభాషా చిత్రంగా'సూపర్ హీరో బాబు' రాబోతోంది.'బెలూన్‌ఖి చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన కె.ఎస్. సినిష్ డిక్కిలూనా. పార్కింగ్‌తో నిర్మాతగానూ మంచి పేరు సంపాదించుకున్నారు. నిర్మాతగా సినిష్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా కంటెంట్ ఉన్న కథతో 'సూపర్ హీరో'ని నిర్మించారు.అర్జున్ దాస్‌కి తెలుగులో మంచి క్రేజ్ ఉందన్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా ఓజీతో అందరినీ ఆకట్టుకున్నారు. అలాంటి అర్జున్ దాస్ సూపర్ హీరో బాబుచిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. హీరోయిన్ తేజు అశ్విని, అర్జున్ దాస్ సీన్స్ ఈ మూవీకి హైలెట్ కానున్నాయి. ఈ చిత్రంతో విఘ్నేష్ వేణుగోపాల్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఖిబెలూన్‌ఖి సినిమాకి కె.ఎస్. సినీష్ వద్ద సహాయ దర్శకుడిగా విఘ్నేష్ వేణుగోపాల్ పనిచేశారు. సూపర్ హీరో బాబు చిత్రానికి సంగీతాన్ని హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించారు.ఖుషి, హాయ్ నాన్న, ది గర్ల్‌ఫ్రెండ్ వంటి భావోద్వేగభరితమైన చిత్రాలకు హేషమ్ అందించిన సంగీతం ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే.

# 'వెంకట్రామయ్యగారి తాలుకా' మూడో పాట 'అడుకున్న దిక్కడే' లిరికల్ సాంగ్ విడుదల



కుటుంబ బంధాలు, మానవ సంబంధాల విలువలను హృద్యంగా ఆవిష్కరిస్తూ రూపొందు తున్న వెంకట్రామయ్య గారి తాలుకా ఈ చిత్రం ఈనెల 17 న ప్రేక్షకుల ముందుకి రానుంది. ప్రమోషన్ లో భాగంగా ఈ చిత్రం నుంచి మూడో గీతం ..ఆడుకున్న దిక్కడే.. లిరికల్ సాంగ్‌ను స్టార్ దర్శకుడు వి.వి. వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సినిమా మంచి విజయాన్ని సాధించాలని ఆకాంకించారు.ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మాట్లాడుతూ, "ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు విడుదల చేసిన ..ఆడుకున్న దిక్కడే.. పాట కూడా ప్రతి ఒక్కరిని హృదయానికి హత్తుకునేలా ఉంటుంది. కథలోని భావోద్వేగాలను ప్రతిబింబించే ఈ గీతం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని తెలిపారు.హీరో దినేష్ కుమార్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న దివిజ ప్రభాకర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల దర్శకత్వం వహిస్తున్నారు. కోమలి క్రియేషన్స్ పతాకంపై కోమలి మహేందర్ తొట్టె సోమేష్ సారిపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కుటుంబ అనుబంధాలు, తల్లిదండ్రుల ప్రేమ, భావోద్వేగాలతో నిండిన ఈ చిత్రం జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.



స్పెయిన్‌కు రెండో గోల్ అందించిన మైఖేల్ మెరినో

# బెల్జియంపై గెలుపుతో సెమీస్‌లో స్పెయిన్

**లాస్‌ఏంజిల్స్, జులై 11:** యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్... ఫిఫా వరల్డ్ కప్‌లో మరోసారి ఆధిపత్యాన్ని చెలాయించింది. సెమీస్ బెర్త్ అందుకుంది. లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో బెల్జియంపై 2-1 గోల్స్ తేడాతో స్పెయిన్ విజయం సాధించింది. 88వ నిమిషంలో బెల్జియం గోల్ కీపర్ సెన్నె లామెన్స్ చేసిన చిన్న పొరపాటును అందిపుచ్చుకున్న స్పెయిన్ ఆటగాడు మెరినో.. బంతిని నెట్‌లోకి పంపి స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. రెండోసారి సాకర్ వరల్డ్‌కప్ సెమీఫైనల్లో చేర్చాడు.

ఈ సాకర్ వరల్డ్‌కప్‌లో స్పెయిన్ అద్భుతమైన ఆట తీరు కొనసాగిస్తోంది. బెల్జియం కఠినమైన డిఫెన్స్‌తో అడ్డుకుంటున్నా, స్పెయిన్ ఆటగాళ్లు ఎక్కడా తొందర పాటు ప్రదర్శించలేదు. తమ సహజసిద్ధమైన పాసింగ్ గేమ్‌ను విడిచిపెట్టకుండా, గోల్ చేయడానికి సరైన అవకాశం వచ్చేంతవరకు ఓపికగా వేచి చూశారు. చివరికి వారు నమ్మిన వ్యూహమే వారిని గెలిపించింది. ఈ విజయంతో స్పెయిన్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వరుసగా 36 మ్యాచ్‌ల పాటు అజేయంగా నిలిచి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది.

**కీలకంగా మారిన యమాల్**

18 ఏళ్ల యువ సంచలనం లామిన్ యమాల్ హైలెట్‌గా నిలిచాడు. తొలి అర్ధభాగమంతా బెల్జియం డిఫెండర్లను యమాల్ ముప్పుతిప్పలు పెట్టాడు. కుడి వైపు నుంచి పెడ్రో పోర్రోతో కలిసి దాడులు చేయడం... డిఫెండర్లను ఛేదించుకుంటూ బాక్స్ వైపు దూసుకెళ్లడం ద్వారా బెల్జియంపై తీవ్ర ఒత్తిడి పెంచాడు. 30వ నిమిషంలో స్పెయిన్ సాధించిన తొలి గోల్‌లో యమాల్ చక్కని అసిస్ట్ ఉంది. అతని వైపు నుంచే ప్రారంభమైన దాడిని పెడ్రో పోర్రో లోక్రాస్‌గా మార్చగా, డాని ఒల్మో దాన్ని గోల్ చేయడానికి ప్రయత్నించాడు. బెల్జియం గోల్ కీపర్ కోర్టియోస్ తాకి రిబౌండ్ అయిన బంతిని రూయిజ్ అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపాడు. దీంతో స్పెయిన్ 1-0ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే మరో 11 నిమిషాలకే చార్లెస్ కెటెలెరే గోల్ చేసి బెల్జియంను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు.

**బెల్జియంకు శాపంగా గోల్ కీపర్ తప్పిదం**

స్పెయిన్ దూకుడును తట్టుకుని బెల్జియం మ్యాచ్‌లో యమాల్, మైకెల్ ఓయర్‌జబల్, డాని ఒల్మోలు కొట్టిన ప్రమాదకరమైన షాట్లను స్పెయిన్ గోల్‌కీపర్ తిబో కోర్టియోస్ అద్భుతమైన డైవ్‌లతో అడ్డుకున్నాడు. రెండో అర్ధభాగం డ్రింక్స్ బ్రేక్‌కు ముందు కోర్టియోస్ తొడ గాయంతో మైదానం వీడాడు. కోర్టియోస్ స్థానంలో మైదానంలోకి వచ్చిన సెన్నె లామెన్స్ ఒత్తిడిని తట్టుకోలేకపోయాడు. 88వ నిమిషంలో స్పెయిన్ డిఫెండర్ పౌ కుబార్సి కొట్టిన సాధారణ షాట్ లామెన్స్ ముందు విచిత్రంగా బౌన్స్ అయింది. దాన్ని సరిగ్గా నియంత్రించలేకపోయిన లామెన్స్ బంతిని సిక్స్ యార్డ్ బాక్స్ వైపు పుష్ చేశాడు. అక్కడ అలర్ట్‌గా ఉన్న స్పెయిన్ సబ్‌స్టిట్యూట్ మైఖేల్ మెరినో మెరుపు వేగంతో బంతిని నెట్‌లోకి పంపాడు. ఈఒక్క పొరపాటు బెల్జియం ప్రపంచకప్ కలలను కల్లలు చేసింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత స్పెయిన్ జట్టు మళ్లీ సెమీఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. సెమీస్‌లో స్పెయిన్‌కు అసలైన పరీక్ష ఎదురుకానుంది. మంగళవారం ఆర్లింగ్టన్‌లో జరిగే సెమీఫైనల్లో ఫ్రాన్స్‌తో తలపడనుంది.

# మెస్సీ మాయాజాలమా.. స్విస్ సంచలనమా?



## నేటి క్వార్టర్ ఫైనల్లో అర్జెంటీనా-స్విట్జర్లాండ్ అమీతుమీ

## ఉదయం 6.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం

**కాన్సాస్‌సిటీ, జులై 11:** ఫిఫా ప్రపంచకప్ సెమీస్ స్టేజ్‌కు చేరుకుంటోంది. ఇప్పటికే మూడు క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి. మూడు సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. చివరి క్వార్టర్ ఫైనల్ ఈ రోజు కాన్సాస్‌సిటీ స్టేడియంలో జరగనుంది. ఫిఫా కప్ వేటలో ఉన్న డిపెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా.. పోరాట పటిమకు ప్రతీకగా నిలిచిన స్విట్జర్లాండ్‌తో క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ పోరులో విజేత సెమీఫైనల్‌లో అడుగుపెడుతుంది. ఒకవైపు లియోనెల్ మెస్సీ అనుభవం, అర్జెంటీనా దూకుడు... మరోవైపు స్విట్జర్లాండ్ క్రమశిక్షణ, సమిష్టి ఆట. దీంతో ఈ మ్యాచ్ టోర్నీలో అత్యంత ఉత్కంఠభరిత పోరుగా మారనుంది.

**అపజయం లేకుండా మెస్సీ టీమ్**

అర్జెంటీనా ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచింది. గ్రూప్ దశలో ఆధిపత్యం చాటిన ఆ జట్టు, నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ ఒత్తిడిని అధిగమిస్తూ ముందుకు సాగింది. లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా ఈ టోర్నీలో ఇప్పటివరకు అపజయం ఎరుగకుండా కొనసాగుతోంది. నాకౌట్ దశలో కేప్ వెర్డే, ఈజిప్ట్‌లపై కష్టపడి నెగ్గిన అర్జెంటీనా ఇప్పుడు మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. అర్జెంటీనా విజయాల్లో కెప్టెన్ లియోనెల్ మెస్సీ కీలక పాత్ర పోషిస్తున్నాడు. బంతి అతని కాళ్ల వద్ద ఉంటే ప్రత్యర్థి రక్షణలో అలజడి చెలరేగడం సహజం. గోల్స్ చేయడమే కాకుండా సహచర ఆటగాళ్లకు అవకాశాలు సృష్టించడంలోనూ మెస్సీ తన ప్రత్యేకతను మరోసారి చాటుతున్నాడు. అతనికి తోడుగా మార్టినెజ్, జూలియన్ అల్వారెజ్, ఎంజో ఫెర్నాండెజ్, అలెక్సిస్ మెక్ అలిస్టర్ వంటి ఆటగాళ్ల అద్భుత సమన్వయంతో జట్టును ముందుకు నడిపిస్తున్నారు. అర్జెంటీనా బలం కేవలం స్టార్ ఆటగాళ్లే కాదు. మిడ్‌ఫీల్డ్‌లో బంతిపై ఆధిపత్యం సాధించడం, వేగంగా దాడులు నిర్మించడం, అవసరమైన సమయంలో ఆట వేగాన్ని నియంత్రించడం ఆ జట్టు ప్రత్యేకత.

**పటిష్ట డిఫెన్స్‌తో స్విట్జర్లాండ్**

మరోవైపు స్విట్జర్లాండ్‌ను తక్కువ అంచనా వేయడం ప్రమాదకరం. ప్రపంచ ఫుట్‌బాల్‌లో భారీ జట్లను ఇబ్బంది పెట్టిన చరిత్ర ఆ జట్టుకు ఉంది. ఈటోర్నీలోనూ సమిష్టి ఆటతో క్వార్టర్ ఫైనల్‌కు వచ్చింది. నాకౌట్‌లో అల్జీరియాపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన స్విస్ జట్టు. ప్రిక్వార్టర్ ఫైనల్లో కొలంబియాపై పెనాల్టీ షూటౌట్‌లో అద్భుత మానసిక ధైర్యాన్ని ప్రదర్శించింది. స్విస్ కెప్టెన్ గ్రానిట్ షాకా మిడ్‌ఫీల్డ్‌లో జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. ఆటను నియంత్రించడం, ప్రత్యర్థి దాడులను అడ్డుకోవడం, వేగంగా కౌంటర్ అటాక్స్ ప్రారంభించడం అతని ప్రత్యేకత. ప్రత్యర్థికి అవకాశాలు ఇవ్వకుండా మ్యాచ్‌ను నియంత్రణలో ఉంచడం స్విస్ ఆటగాళ్ల నిపుణులు.

**మెస్సీ పైనే అందరి చూపు**

ఈ మ్యాచ్‌లో ప్రధానంగా అందరి దృష్టి మెస్సీపైనే ఉంటుంది. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అతని అనుభవం అర్జెంటీనాకు అతిపెద్ద బలం. కీలక సమయాల్లో మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థం అతనికి ఉంది. అయితే మెస్సీని అడ్డుకునేందుకు స్విట్జర్లాండ్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్క ఆటగాడితో కాకుండా సమిష్టిగా ఒత్తిడి తీసుకొచ్చి అతనికి ఖాళీలు ఇవ్వకుండా చూడాలని స్విస్ జట్టు భావిస్తోంది. మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించడంలో మిడ్‌ఫీల్డ్ పోరు కీలకం కానుంది. బంతిపై ఆధిపత్యం సాధించిన జట్టుకే ఎక్కువ అవకాశాలు లభించే అవకాశం ఉంది. అలాగే సెట్‌పీస్‌లు, కార్నర్లు, ఫ్రీకిక్స్ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం కూడా విజయంలో కీలక పాత్ర పోషించవచ్చు. మెస్సీ మరోసారి తన మాయాజాలంతో అర్జెంటీనాను సెమీఫైనల్‌కు చేర్చుతాడా? లేక స్విట్జర్లాండ్ మరో సంచలన విజయంతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది.

# వింబుల్డన్ ట్రోఫీ నెగ్గిన నోస్కోవా



**లండన్, జులై 11:** అన్‌సీడెడ్ చెకొస్లోవేకియా ప్లేయర్ లిండా నోస్కోవా సంచలనం కొనసాగింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో చెకొస్లోవేకియాకు చెందిన 8వ సీడ్ కరోలినా ముచోవాపై మూడు సెట్ల పోరులో 6-2, 5-7, 6-3తో ఓడించింది. ఫైనల్ చేరిన తొలిసారే వింబుల్డన్ ట్రోఫీ అందుకుంది. కాగా రెండోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరినా ముచోవా ట్రోఫీ ఆశలు కల్లలయ్యాయి. తొలి సెట్‌ను అలవోకగా నెగ్గిన నోస్కోవాకు రెండో సెట్‌లో ముచోవా పుంజుకుని గట్టి పోటీ ఇచ్చింది. సెట్‌ను నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో నోస్కోవా.. ప్రత్యర్థి సర్వీసును రెండు సార్లు బ్రేక్ చేసి 6-3తో సెట్‌ను, గేమ్‌ను ముగించింది. 2024 ఆస్ట్రేలియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ వరకు వచ్చిన నోస్కోవా... ఈ సారి ఏకంగా వింబుల్డన్ ట్రోఫీ పట్టేసింది.

# టీ20 సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్



**సౌథాంప్టన్, జులై 11:** టీ20 ప్రపంచ ఛాంపియన్లు టీమిండియా.. వరుసగా రెండో సిరీస్ కోల్పోయింది. అయిదో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 56 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి అయిదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-0తో క్లీన్ స్వీప్ చేసింది. 258 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఈ మ్యాచ్‌లోనూ తడబడింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(3) నిరాశపరచగా, వైభవ్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన సంజూ కూడా 27 రన్స్ చేసి అవుటయ్యాడు. ఇషాన్ కిషన్(35 బంతుల్లో 56), తిలక్ వర్మ(25 బంతుల్లో 53) అర్ధసెంచరీలతో రాణించారు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 28 రన్స్, శివమ్ దూబె 14 రన్స్ చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో కుర్రాన్ 3 వికెట్లు, అదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టాడు.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 257 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫిల్ సాల్ట్(6)ను ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. జోస్ బట్లర్(64 బంతుల్లో 131), కెప్టెన్ హారీ బ్రూక్స్(45 బంతుల్లో 95 నాటౌట్) చెలరేగి ఆడారు. సిక్స్‌లు, ఫోర్ల వర్షం కురిపించారు. రెండో వికెట్‌కు రికార్డు స్థాయిలో 233 రన్స్ జోడించారు. భారత బౌలర్లలో దూబె రెండు వికెట్లు తీశాడు.

# ఫెడ్‌రిజర్వ్‌లో భారత సంతతి ప్రముఖులు!



**వాషింగ్టన్, జులై 11:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) ఛైర్మన్ కెవిన్‌వార్ష్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన (మానిటరీ పాలసీ)వ్యవస్థను సమీక్షించి, కీలక సంస్కరణలను సూచించేందుకు ఏర్పాటు చేసిన ఐదు టాస్క్‌ఫోర్స్ ప్రముఖుల పేర్లను ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లలో అకడమిక్ నిపుణులు, మాజీ కేంద్ర బ్యాంకు గవర్నర్లు, కార్పొరేట్ రంగ ప్రముఖులతో పాటు భారత సంతతికి చెందిన ముగ్గురు ప్రముఖులకు కీలక బాధ్యతలు అప్పగించారు. మాజీ ఆర్‌బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్, హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ రాజ్ చెట్టి, మైక్రోసాఫ్ట్ ఎక్స్‌బాక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశా శర్మ ఈజాబితాలో ఉన్నారు. టాస్క్‌ఫోర్స్‌ల నాయకత్వాన్ని ప్రకటిస్తూ కెవిన్ వార్ష్, "ప్రస్తుత కీలక సమయంలో ఫెడరల్ రిజర్వ్ తన లక్ష్యాలను మరింత సమర్థంగా సాధించేలా సంస్థను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం" అని తెలిపారు.

భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్, కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు రఘురామ్ రాజన్‌కు "బ్యాలెన్స్ షీట్ పాలసీ" టాస్క్‌ఫోర్స్‌కు సహనాయకత్వ బాధ్యతలు అప్పగించారు. ఫెడరల్ రిజర్వ్ అమలు చేస్తున్న ప్రస్తుత బ్యాలెన్స్ షీట్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, వ్యయాలు, సంస్థాగత ప్రభావాలను ఈ బృందం సమగ్రంగా పరిశీలించి మార్పులపై సిఫార్సులు చేయనుంది. ప్రస్తుతం చికాగో విశ్వవిద్యాలయం బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో కేథరిన్ డుసాక్ మిల్లర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్, 2005లో జాక్సన్ హోల్‌లో జరిగిన ఫెడరల్ రిజర్వ్ సమావేశంలో అమెరికా బ్యాంకుల సబ్‌ప్రైమ్ రుణాల ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుపొందారు. అనంతరం 2008లో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి సంబంధించిన ఆయన హెచ్చరికలు నిజమయ్యాయి. భారత సంతతి ఆర్థికవేత్త రాజ్ చెట్టిని "లిక్విడిటీ డిపెండెన్స్" ప్యానెల్‌కు ఎంపిక చేశారు. హార్వర్డ్ యూనివర్సిటీలోని "ఆపర్చునిటీ ఇన్‌సైట్స్" సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న చెట్టి, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు జీవితంలో విజయవంతం కావడానికి అవసరమైన విధానాలపై పరిశోధనలు చేస్తున్నారు. హార్వర్డ్ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ జెరెమీ స్టెయిన్, వాల్‌మార్ట్ మాజీ అధ్యక్షుడు, సీఈఓ డగ్ మెక్‌మిలన్, చికాగో విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ కెవిన్ మర్ఫీతో కలిసి ఫెడరల్ రిజర్వ్ ప్రస్తుత బ్యాలెన్స్ షీట్ విధానం ప్రభావాలను ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగం ఎక్స్‌బాక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న భారత సంతతి ఆశా శర్మకు "ప్రొడక్టివిటీ అండ్ ఎంప్లాయ్‌మెంట్" టాస్క్‌ఫోర్స్ నాయకత్వం అప్పగించారు. ఇటీవల మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగంలో భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపులు జరిగిన నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత సంతతి అమెరికన్ ఆశా.. మెటా, ఈకామర్స్ సంస్థ కూపాంగ్, గ్రోసరీ డెలివరీ సంస్థ ఇన్‌స్టాకార్ట్, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ సంస్థ హోమ్ డిపో వంటి కంపెనీల్లో కీలకబాధ్యతలు నిర్వహించారు. ఈటాస్క్ ఫోర్స్‌లో హోరోవిట్జ్ సహ వ్యవస్థాపకుడు మార్క్ ఆండ్రీసెన్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ చార్లెస్ "చాడ్" జోన్స్ సహఅధ్యక్షులుగా వ్యవహరించనున్నారు.

# 1.7 కోట్లకు పైగా ఐటి రిటర్నులు దాఖలు



**ముంబయి, జులై 11:** ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అసెస్‌మెంట్ ఇయర్ 2026-27 కోసం ఇప్పటివరకు 1.7 కోట్లకు (17 మిలియన్లు) పైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ శనివారం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంపాదించిన ఆదాయానికి సంబంధించిన ఐటీఆర్1 సహజ్, ఐటీఆర్2 రిటర్నులు దాఖలు చేయడానికి జులై 31చివరితేదీ అని శాఖ మరోసారి గుర్తు చేసింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ, అసెస్‌మెంట్ సంవత్సరం 2026-27 కోసం ఇప్పటికే 1.7 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు తమ ఐటీఆర్‌లను దాఖలు చేసి ముందడుగు వేశారు" అని పేర్కొంది. ఇప్పటివరకు దాఖలైన రిటర్నుల్లో శుక్రవారం ఒక్కరోజే 10 లక్షలకు పైగా ఐటీఆర్‌లు దాఖలుచేసినట్లు వెల్లడించింది. ఐటీఆర్1 (సహజ్) చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారుల కోసం రూపొందించిన సరళమైన రిటర్న్ ఫారమ్. ఏటా రూ.50 లక్షల వరకు ఆదాయం కలిగిన నివాస భారతీయ వ్యక్తులు, జీతం ద్వారా ఆదాయం పొందేవారు, ఒకే ఒక్క గృహ ఆస్తి నుంచి ఆదాయం ఉన్నవారు, అలాగే వ్యవసాయ ఆదాయం సంవత్సరానికి రూ.5,000 వరకు ఉన్నవారు ఈ ఫారమ్‌ను ఉపయోగించి రిటర్నులు దాఖలు చేయవచ్చు. ఇక ఐటీఆర్2ను వ్యాపారం లేదా వృత్తి ద్వారా లాభాలు, ఆదాయం లేని వ్యక్తులు మరియు హిందూ అవిభక్త కుటుంబాలు దాఖలు చేస్తారు. అయితే, వీరికి మూలధన లాభాల ఆదాయం ఉన్నప్పుడు ఈఫారమ్ వర్తిస్తుంది.

# డీమార్ట్ నికరలాభం రూ.936 కోట్లు




**ముంబై, జులై11:** డీమార్ట్ నిర్వహణ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ తొలి త్రైమాసికంలో నికరలాభం వార్షిక ప్రాతిపదికన12.8 శాతం పెరిగి 936కోట్లకు చేరినట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.830 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ విశ్లేషకులు రూ.964 కోట్ల లాభాన్ని అంచనా వేయగా, కంపెనీ ఫలితాలు దానికి స్వల్పంగా తక్కువగా నమోదయ్యాయి. కంపెనీరాబడులు కూడా 15.1శాతం పెరిగి రూ.18,343 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ ఆదాయం రూ.15,932 కోట్లుగా ఉంది. కంపెనీ విస్తరణతో పాటు వినియోగదారుల కొనుగోళ్లు పెరగడం ఆదాయ వృద్ధికి దోహదపడినట్లు తెలిపింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు లాభం 16.2 శాతం పెరిగి రూ.1,526 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.1,313 కోట్లుగా నమోదైంది.

మార్కెట్ అంచనా రూ.1,517 కోట్లుగా ఉండగా, కంపెనీ దానిని స్వల్పంగా అధిగమించింది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 8.2 శాతం నుంచి 8.3 శాతానికి స్వల్పంగా మెరుగుపడింది. కంపెనీ లైక్‌ఫర్‌లైక్ విక్రయాల వృద్ధి తొలి త్రైమాసికంలో 5.5 శాతంగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 7.1 శాతంగా ఉండటం గమనార్హం. ఈ త్రైమాసికంలో డీమార్ట్ స్టోర్లలో మొత్తం 11 కోట్ల బిల్లులు ప్రాసెస్ చేయగా, గత ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 9.7 కోట్లుగా ఉంది. అదనంగా, కంపెనీ రూ.1,000 కోట్ల వరకు నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు జారీ చేసి నిధులు సమీకరించేందుకు ఆమోదం తెలిపింది.




# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు తొమ్మిది నోటీసులు

**న్యూఢిల్లీ, జులై 11:** దేశ ఆహార భద్రత నియంత్రణ సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శనివారం స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు 9నోటీసులు జారీ చేసింది. కస్టమర్లనుంచి వచ్చిన పలుమార్లు ఫిర్యాదుల ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించిన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ, ఈ చర్యలు చేపట్టింది. వినియోగదారులకు గడువు ముగిసిన, పాడైన, కుళ్లిపోయిన, కలుషితమైన, మానవ వినియోగానికి అనర్హమైన ఆహార ఉత్పత్తులు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో, సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ సమగ్ర వివరణతో పాటు నిబంధనల అమలుపై నివేదిక సమర్పించాలని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశించింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విక్రయించిన గుడ్లు, సంస్థకు ఉన్న ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్‌లో అనుమతి పొందిన ఉత్పత్తుల జాబితాలో లేకపోయినప్పటికీ మార్కెటింగ్ చేసినట్లు గుర్తించింది. చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌లో ఆ ఉత్పత్తి చేర్చే వరకు విక్రయాలు నిలిపివేయాలని, అవసరమైతే లైసెన్స్ సవరణకు దరఖాస్తు చేయాలని ఆదేశించింది. (1 కిలో) మరియు హోంస్టైల్ మద్రాస్ మిక్చర్ పీనట్స్ ఉత్పత్తులు గడువు ముగిసిన తర్వాత కూడా వినియోగదారులకు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. గడువు ముగిసిన, కుళ్లిపోయిన, దుర్వాసన వెదజల్లుతున్న, కలుషితమైన గుడ్లు సరఫరా చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి.

# వచ్చే రెండేళ్లలో 210 కంపెనీల ఐపిఒలు




**ముంబయి, జులై 11:** భారత స్టాక్ మార్కెట్లకు వచ్చే రెండేళ్లో టాప్‌కంపెనీలు మార్కెట్లోకి ఐపీఓ ద్వారా ఎంట్రీ ఇవ్వనున్నాయి. కన్సల్టింగ్ సంస్థ రెడ్సీర్ అంచనా ప్రకారం వచ్చే రెండేళ్లలో సుమారు 210 కొత్త కంపెనీలు ఐపిఒలకు రెడీ అవుతున్నాయి. కొత్త తరం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ జూలైలో ఉన్న 150 బిలియన్ డాలర్ల నుండి 2030 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని తెలిపింది. వచ్చే దశాబ్దం చివరి నాటికి కొత్త లిస్టింగ్‌ల వల్ల భారతదేశ ఈక్విటీ మార్కెట్లో కొత్త తరం కంపెనీల వాటా 3 శాతం నుండి 11.5 శాతానికి పెరుగుతుందని ఆ సంస్థ ఒక నివేదికలో అంచనా వేసింది. దీనితో ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై సమీకరించిన నిధుల విషయంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మూడవ స్థానంలోను, వృద్ధి రేటు విషయంలో మొదటి స్థానంలో నిలుస్తుంది. గతంలో ఐపీఓ మార్కెట్ అటువంటి కొత్త తరం కంపెనీల వృద్ధికి ప్రతిఫలమిచ్చిందని కానీ ఇప్పుడు అది లాభదాయకమైన వృద్ధిని కోరుకుంటోందని, లిస్టింగ్ అయిన 20 కంపెనీలలో 14 లాభదాయకంగా ఉన్నాయి. వారి ఐపీఓల ధరలను, గత ప్రైవేట్ రౌండ్ల ఆధారంగా కాకుండా.. అదే తరహా లిస్టెడ్ కంపెనీల ఆధారంగా నిర్ణయిస్తున్నారు.

దీనివల్ల, లిస్టింగ్ సమయంలో ఒక కంపెనీ చేసుకునే సన్నాహాలు.. భవిష్యత్ రాబడులను మరింత మెరుగ్గా అంచనా వేయడానికి వీలవుతుందని నివేదిక తెలిపింది గత ఏడాది మొత్తం కంటే 2026 క్యాలెండర్ సంవత్సరం ద్వితీయార్థంలోనే ఎక్కువ నిధులు సమీకరించబడతాయని కేవలం ఆరు నెలల్లోనే 19 నుంచి 22 బిలియన్ డాలర్లు సేకరిస్తాయని నివేదిక అంచనా వేస్తోంది. 200కుపైగా కంపెనీలు పబ్లిక్ మార్కెట్లలో నిధులు సమీకరించడానికి సిద్ధమవుతుండగా వాటిలో 150కి పైగా కంపెనీలు మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన సెబీ నుండి ఇప్పటికే ఆమోదం పొందాయి. దశాబ్దంలో భారత్‌లోని ప్రధాన ప్లాట్ఫారమ్లపై ఐపీఓలు 8 రెట్లు పెరిగాయని.. ఇందులో ఐదేళ్లలో 300కి పైగా కొత్త లిస్టింగ్లు కూడా ఉన్నాయని నివేదిక పేర్కొంది. బలమైన దేశీయ మూలధనం, అధిక కార్పొరేట్ ఆదాయాలు, మెరుగైన నిష్క్రమణ అవకాశాలు, అనుకూలమైన నియంత్రణ వంటివి ఈ వృద్ధికి తోడ్పడ్డాయని కన్సల్టింగ్‌సంస్థ రెడ్సీర్ నివేదిక తెలిపింది.

# 20వేల కోట్లకు పెరిగిన హిండాల్కో అల్యూమినా పెట్టుబడి




**ముంబయి, జులై 11:** ఆదిత్య బిర్లా గ్రూప్ ఒడిశాలో తన పెట్టుబడులను మరింత విస్తరించింది. రాయగడ జిల్లాలోని కన్సరిగూడలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీ ప్రాజెక్టు విస్తరణ కోసం అదనంగా రూ.12,000 కోట్ల పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనపై శనివారం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా సమావేశమై చర్చించారు. ఈ విస్తరణతో రిఫైనరీ సామర్థం ప్రస్తుతం ప్రతిపాదించిన సంవత్సరానికి 10 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు పెరగనుంది. దీంతో ప్రాజెక్టులో మొత్తం పెట్టుబడి రూ.20 వేల కోట్లకు చేరనుంది.

ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన లోహ రంగ ప్రముఖ సంస్థ హిండాల్కో ఇండస్ట్రీస్ ఈ గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీని అభివృద్ధి చేస్తోంది. తొలుత ఈ ప్రాజెక్టును సంవత్సరానికి 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థంతో, సుమారు రూ.8,000 కోట్ల పెట్టుబడితో ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రాజెక్టు దీర్ఘకాలిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని సంస్థ ఇప్పుడు మరో రూ.12,000 కోట్ల పెట్టుబడితో అదనంగా సంవత్సరానికి 20 లక్షల టన్నుల శుద్ధి సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఈ విస్తరణ వల్ల ప్రత్యక్ష, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడటంతో పాటు స్థానిక పారిశ్రామికవేత్తలు, సేవల రంగ సంస్థలు, అనుబంధ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని కంపెనీ పేర్కొంది. అలాగే ఈ ప్రాజెక్టు విస్తరణతో ఒడిశాలో అల్యూమినియం డౌన్ స్ట్రీమ్ పరిశ్రమల అభివృద్ధికి ఊతం లభించనుంది. అల్యూమినియం విలువ ఆధారిత ఉత్పత్తుల శ్రేణిలో రాష్ట్రం మరింత వాటాను దక్కించుకునేందుకు ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.